



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 29 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | బుధవారం 22 అక్టోబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-


# శాంతి భద్రతలపై రాజీ లేదు

- రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు సాగండి
- పోలీసులకు ముఖ్యమంత్రి పిలుపు.. అసాంఘిక శక్తులను ఏరి పారేయండి
- 'సోషల్' సైకోలపై ఉక్కుపాదం!.. రాజకీయ ముసుగులో చిచ్చురేపేవారిని వదలొద్దు
- వారు క్రిమినల్స్ కన్నా ప్రమాదకరం.. వ్యక్తిగత గొడవలకు కులం రంగు
- ఆర్థిక నేరాలకు మతం రంగు.. ఫేక్ ప్రచారాలతో అలజడులకు కుట్ర
- అటువంటి వారిని జైల్లో పడేయాలి.. మీకు పూర్తి అధికారాలు ఇస్తున్నా
- పోలీసుల త్యాగాలతోనే ప్రశాంతత.. ప్రజల భద్రత మీది.. మీ సంక్షేమం ప్రభుత్వానిది
- పోలీసు అమరవీరుల సంస్మరణలో సీఎం చంద్రబాబు



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

శాంతిభద్రతలతోనే అభివృద్ధి సాధ్యమని నమ్ముతాను. విశాఖలో గూగుల్ ఏఐ డేటా హబ్ సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చిందంటే.. ఇక్కడి శాంతిభద్రతలపై ఆ సంస్థకు ఉన్న నమ్మకమే కారణం. రాజకీయ నాయకుల ముసుగులో కొందరు పెద్దఎత్తున నేరాలకు పాల్పడుతున్నారు. అశాంతిని సృష్టించేందుకు దేనికైనా తెగిస్తున్నారు. వీరు క్రిమినల్స్ కన్నా ప్రమాదకరం. ప్రజల రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న పోలీసులంటే నాకెప్పుడూ గౌరవమే. 'శాంతిభద్రతలపై రాజీ పడొద్దు.. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు సాగండి.. అసాంఘిక శక్తులను ఏరి పారేయండి.. మీకు పూర్తి అధికారాలు ఇస్తున్నా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పండగలు, పబ్బాల్లో కుటుంబాలను వదిలి సమాజ శ్రేయస్సు కోసం రాత్రింబవళ్లు పనిచేస్తూ ప్రాణాలు సైతం అర్పిస్తున్న పోలీసుల త్యాగాలు, బలిదానాల వల్లే సమాజం ప్రశాంతంగా ఉంటోందన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం (ప్రతి ఏటా అక్టోబరు 21న) సందర్భంగా పోలీసు శాఖ మంగళగిరి ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ గ్రౌండ్స్‌లో - మిగతా2లో



## రైతులకు రబీ షాక్

- చైనా ఎగుమతుల నిలిపివేతతో పెరగనున్న ఎరువుల ధరలు
- యూరియా, డీఏపీ ఎరువుల్లో 95 శాతం చైనా నుంచే..
- ఈ నిలిపివేత 5 నుంచి 6 నెలల పాటు కొనసాగే అవకాశం

5



## కిక్కు దించుతున్న లిక్కర్ రేట్లు!

- మహారాష్ట్రలో భారీగా తగ్గిన మద్యం అమ్మకాలు
- ధరల పెంపుతో తగ్గిన రెవెన్యూ
- జీవన వ్యయం పెరగడమూ కారణమే
- కొవిడ్-19 కాలంలో విదేశీ మద్యం అమ్మకాలు పుంజుకోవడం విశేషం.

## భీమవరం డీఎస్పీపై పవన్ సీరియస్



- పేకాట, జూదాలకు జయసూర్య ప్రోత్సాహం
- పశ్చిమ ఎస్పీతో ఫోన్లో మాట్లాడిన డిప్యూటీ సీఎం
- తర్వాత డీజీపీతోనూ.. నివేదిక ఇవ్వాలని సూచన
- తనకు అందిన ఫిర్యాదులు హోం మంత్రికి
- విచారణకు ప్రభుత్వ ఆదేశాలు?
- నివేదిక రాగానే జయసూర్యపై చర్యలు!

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో పేకాట నిర్వహణకు పోలీసులు సహకరిస్తున్నారన్న ఫిర్యాదులపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. స్థానిక డీఎస్పీ జయసూర్య ఒక వర్గానికి కొమ్ము కాస్తూ చట్టవిరుద్ధమైన పేకాట, జూదం నిర్వాహకులకు వంత పాడుతున్నారని వరుస ఫిర్యాదులు అందడంతో జిల్లా ఎస్పీ నయీంతో ఆయన మంగళవారం ఫోన్లో మాట్లాడారు. పేకాట విషయంలో - మిగతా2లో



## డీఏ బకాయిలపై ప్రభుత్వం స్పష్టత

- వచ్చే ఏప్రిల్‌లో పది శాతం జమ
- మిగిలిన 90 శాతం మూడు విడతల్లో
- జీపీఎఫ్, ప్రాన్ ఖాతాల్లో జమ చేస్తాం
- ఉద్యోగుల అభ్యంతరాలపై స్పందన
- ఆర్థిక శాఖ అధికారులతో సీఎం భేటీ
- సీఎం ఆదేశాలతో సవరణ జీవో జారీ
- సవరణ జీవోపై ఉద్యోగ సంఘాల హర్షం

2లో

## వంద జిల్లాల్లో స్వేచ్ఛా వాయువులు

- మావోయిస్టు ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తున్నాం..
- పదేళ్ల కిందట 125 జిల్లాల్లో .. ప్రస్తుతం
- 11 జిల్లాలకే పరిమితం: ప్రధాని మోదీ
- ఆపరేషన్ సిందూర్‌తో పాటు ఇదీ గొప్ప విజయమే
- మన భద్రతా బలగాలకు సెల్యూట్
- ఐఎన్ఎస్ విక్రాంత్‌పై జవాన్లతో కలిసి దీపావళి వేడుకలు

5లో





## టీచర్లకూ టెట్

- ఐదేళ్ల కంటే ఎక్కువ సర్వీసు ఉన్నవారు ఈ పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించాల్సిందే
- సుప్రీంకోర్టు తీర్పు అమలుకు చర్యలు
- త్వరలో నోటిఫికేషన్ విడుదలకు కసరత్తు

2లో

## మహాఘట్‌బంధన్ X మహాఘట్‌బంధన్

- బీహార్‌లో ప్రతిపక్ష కూటమిలో తీవ్ర విభేదాలు
- 11 శాసనసభ స్థానాల్లో ముఖాముఖీ పోటీ
- స్నేహపూర్వక పోటీ అంటూ కూటమి పార్టీల సమర్థన
- ఎన్డీఏకు మేలు చేస్తుందంటున్న రాజకీయ విశ్లేషకులు

5లో



# టీచర్లకూ టెట్

అమరావతి

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) విషయంలో పాఠశాల విద్యాశాఖ కీలక ప్రతిపాదన చేసింది. ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించాలనుకునేవారితో పాటు టెట్ అర్హత లేని ఇన్ సర్వీస్ టీచర్లు కూడా ఈ పరీక్ష రాయాల్సి ఉంటుంది. నిరుద్యోగులు, టీచర్లు ఇద్దరూ టెట్ రాసేందుకు వీలుగా త్వరలో నోటిఫికేషన్ జారీ చేయడానికి కసరత్తు చేస్తోంది. టీచర్లంతా తప్పనిసరిగా టెట్ ఉత్తీర్ణత సాధించాల్సిందేనని కొద్ది నెలల కిందట సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఈ మేరకు చర్యలు చేపట్టింది. అయితే దీనిపై తుది నిర్ణయం ప్రభుత్వం తీసుకోనుంది. 2011లో టెట్ అమల్లోకి వచ్చింది. అంతకుముందు టీచర్ ఉద్యోగాలు పొందిన వారంతా తప్పనిసరిగా టెట్ ఉత్తీర్ణత సాధించాలని ఇటీవల సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఐదేళ్ల కంటే ఎక్కువ సర్వీసు ఉన్నవారు రెండేళ్లలో టెట్ సర్టిఫికెట్ పొందాలని ఆదేశించింది. ఐదేళ్లలోపు సర్వీసు ఉన్న టీచర్లకు మినహాయింపు ఇచ్చినప్పటికీ పదోన్నతి పొందాలంటే మాత్రం టెట్ ఉండాలని పేర్కొంది. దీంతో టెట్‌తో సంబంధం లేకుండా ఉద్యోగాలు పొంది ప్రస్తుతం సర్వీసులో ఉన్నవారంతా ఇప్పుడు అందులో ఉత్తీర్ణత సాధించాల్సిన అవసరం ఏర్పడింది. పదోన్నతి అవసరం లేదనుకుంటే ఐదేళ్లలోపు సర్వీసు ఉన్నవారు మినహాయింపును పొందవచ్చు. కాగా, టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయ విద్య జాతీయ మండలి(ఎన్‌సీటీఈ)ని కొందరు టీచర్లు ఆశ్రయించారు. అయితే వీరి వినతిని ఎన్‌సీటీఈ తిరస్కరించింది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇందులో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. దీనిపై కొందరు టీచర్లు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేశారు. ఒకవేళ అక్కడ టీచర్లకు మినహాయింపు లభిస్తే రాష్ట్రంలోనూ ఆ వెసులుబాటు దక్కుతుంది. లేనిపక్షంలో టెట్ లేని టీచర్లంతా కచ్చితంగా అందులో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

## భీమవరం డీఎస్పీపై పవన్ సీరియస్

-మొదటిపేజీ తరువాయి

ఎందుకు గట్టిగా వ్యవహరించలేకపోతున్నారని ఆరా తీశారు. అనంతరం డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాతో కూడా డిప్యూటీ సీఎం ఫోన్లో మాట్లాడారు. పేకాట, డీఎస్పీ జయసూర్య పాత్ర, వ్యవహారశైలిపై నివేదిక కోరారు. అసాంఘిక, చట్ట విరుద్ధ కార్యకలాపాలకు డీఎస్పీ స్థాయి అధికారి అండగా ఉండడాన్ని తీవ్రంగా పరిగణించాలని.. పోలీసులు ఇటువంటి వ్యవహారాలతోపాటు సివిల్ వివాదాల్లో తల దూర్చకుండా చూడాలని సూచించారు. కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తే ఎవ్వరినీ ఉపేక్షించబోమనే సంకేతాన్ని పంపాలని స్పష్టం చేశారు. పేకాట నిర్వాహకులపై గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేయాలని, నెలవారీ మామూళ్లు తీసుకుంటున్నారనే ఫిర్యాదులపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. డీఎస్పీ జయసూర్యపై తనకు వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులను హోం మంత్రికి, డీజీపీకి తన కార్యాలయం నుంచి పవన్ పంపినట్లు తెలిసింది. దీంతో ఈ వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో సమాచారం సేకరిస్తున్నారు. విచారణకు ఆదేశాలు జారీచేసినట్లు తెలిసింది. ఆరోపణల్లో వాస్తవాలున్నట్లు తేలితే జయసూర్యపై సస్పెన్షన్ వేటు తప్పదనే ప్రచారం పోలీసు వర్గాల్లో నడుస్తోంది. పూర్తి స్థాయి నివేదిక అందాక తదుపరి చర్యలు చేపడతామని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

సివిల్ తగాదాల్లో జయసూర్య
బదిలీ నిలిపివేయించిన కీలక నేతతో అంటకాగుతున్న డీఎస్పీ

భీమవరం డీఎస్పీ గణేశ్ జయసూర్య సివిల్ తగాదాల్లో తలదూరుస్తున్నారని, ఓ వర్గం పేకాటలను ప్రోత్సహిస్తున్నారని బాధితులు ఇటీవల ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేశారు. భీమవరం డివిజన్ పరి?ధిలోని ఓ నియోజకవర్గంలో డీఎస్పీయే పేకాటలను ప్రోత్సహిస్తున్నారని లేఖలు కూడా రాశారు. ప్రభుత్వం గతంలో ఈయన్ను భీమవరం నుంచి బదిలీ చేసింది.

# డీఏ బకాయిలపై ప్రభుత్వం స్పష్టత

అమరావతి

ప్రభుత్వ ఉద్యోగులకు 'దీపావళి' కానుకగా ప్రకటించిన డీఏ చెల్లింపులో నెలకొన్న గందరగోళాన్ని ప్రభుత్వం తొలగించింది. ఉద్యోగుల నుంచి వ్యక్తమైన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని... అప్పటికప్పుడు పొరపాటును సవరించింది. తప్పులు దిద్దుకునే విషయంలో ఎలాంటి భేషజాలు ప్రదర్శించబోమని స్పష్టమైన సంకేతాలు పంపింది. ఉద్యోగులకు ఒక డీఏ ప్రకటిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. అయితే... దీనికి సంబంధించి సోమవారం జారీ అయిన జీవోల్లో అధికారుల స్థాయిలో అనాలోచిత నిర్ణయాలు తీసుకున్నారు. 2024 జనవరి నుంచి చెల్లించాల్సిన 3.64 శాతం డీఏ బకాయిలను... రిటైర్మెంట్ సమయంలో చెల్లిస్తామని అందులో పేర్కొన్నారు. ఇప్పటిదాకా పీఆర్సీ బకాయిలను మాత్రమే రిటైర్మెంట్ సమయంలో చెల్లించేలా నిర్ణయాలు తీసుకున్నారు. డీఏ బకాయిలను విడతల వారీగా చెల్లిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో... 21 నెలల డీఏ బకాయిల కోసం రిటైర్మెంట్ దాకా వేచి చూడాల్సిన పరిస్థితి ఏమిటంటూ ఉద్యోగుల్లో తీవ్ర చర్చ మొదలైంది. ఈ విషయాన్ని ఉద్యోగ సంఘాల నేతలు అప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంగళవారం తీవ్రస్థాయిలో కసరత్తు జరిగింది. ఉద్యోగుల డిమాండ్‌ను అర్థం చేసుకున్న ప్రభుత్వం... దీనిపై మంగళరం రాత్రి సవరణ జీవో జారీ చేసింది. దీని ప్రకారం... 2024 జనవరి డీఏకు సంబంధించిన బకాయిలు అంటే 21 నెలల బకాయిలను నాలుగు విడతల్లో ఉద్యోగులకు అందజేస్తారు. బకాయిల్లో 10 శాతాన్ని 2026 ఏప్రిల్‌లో చెల్లిస్తారు.

ఓపీఎస్ ఉద్యోగులకు వారి జీపీఎఫ్ ఖాతాల్లోకి... సీపీఎస్, పీటీడీ ఉద్యోగులకు ప్రభుత్వ వాటాతో కలిపి వారి ప్రాన్ ఖాతాల్లోకి జమ చేస్తారు. మిగిలిన 90 శాతం బకాయిలను 3 సమాన భాగాల్లో 2026 ఆగస్టు, 2026 నవంబరు, 2027 ఫిబ్రవరి నెలల్లో అందిస్తామని జీవోల్లో స్పష్టం చేశారు. ఈ మొత్తాలను ఓపీఎస్ ఉద్యోగులకు వారి జీపీఎఫ్ ఖాతాల్లో జమ చేస్తామని... సీపీఎస్, పీటీడీ ఉద్యోగులకు నగదు రూపంలో అందజేస్తామని జీవోలో వెల్లడించారు.

**సీఎం ఓ వైపు.. ఆర్థిక శాఖ మరోవైపు**

ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా కృషి చేస్తుంటే, మరోవైపు ఆర్థిక శాఖ నిర్ణయాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం వద్ద డబ్బుల్లేవని, అందువల్ల డీఏ బకాయిలు రిటైర్మెంట్ సమయంలో ఇస్తామని ఆర్థిక శాఖ తీసుకున్న నిర్ణయాన్ని ముఖ్యమంత్రికి ఆపాదిస్తూ సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం చేశారు. ఉద్యోగులకు ప్రభుత్వానికి దూరం పెంచేలా తీవ్రస్థాయిలో ప్రయత్నాలు జరిగాయి. ఇది తన దృష్టికి రాగానే ముఖ్యమంత్రి స్పందించారు. మంగళవారం ఆర్థిక శాఖ అధికారులను పిలిచి మందలించారు. ఇకపై ఇలాంటి తప్పులు దొర్లకూడదని, సాధారణంగా డీఏ బకాయిలు ఎలా చెల్లిస్తారో అలాగే ఇప్పుడూ చెల్లించేలా జీవోను సవరించాలని ఆదేశించారు. ఆ మేరకు ఆర్థిక శాఖ మంగళవారం రాత్రి జీవో 62 విడుదల చేసింది.

**పదోన్నతులపై ధన్యవాదాలు**
**సీఎంను కలిసిన ఆర్టీసీ కార్మిక పరిషత్**

ఉద్యోగులకు డీఏ సహా ఆర్టీసీలో పదోన్నతులు కల్పించడంపై ఆర్టీసీ కార్మిక పరిషత్ సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపింది. మంగళవారం ఈ మేరకు అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మిక పరిషత్ ప్రధాన కార్యదర్శి వై శ్రీనివాసరావు మాట్లాడారు. 'ఆరేళ్లుగా పదోన్నతులు రాక ఇబ్బందులుపడుతున్న ఆర్టీసీ ఉద్యోగులకు సీఎం చంద్రబాబు పదోన్నతులు ఇచ్చారు. సీఎం ఆమోదంతో 3 వేల మందికి పదోన్నతులు వస్తున్నాయి. ఆర్టీసీలో మరిన్ని సమస్యలు పరిష్కరించాలని సీఎంకు వినతిపత్రం ఇచ్చాం. స్త్రీశక్తి పథకం అమలు దృష్ట్యా ఆర్టీసీలో అవసరమైన సిబ్బందిని నియమించాలని కోరాం. విశ్రాంత ఉద్యోగులకు ఈహెచ్‌ఎస అందడం లేదని, విధి విధానాలు విడుదలు చేయాలని విజ్ఞప్తి చేశాం. అమరావతి బ్రాండ్ బస్సులు 100 కొనుగోలు చేయాలని, ఆర్టీసీ బస్సుల్లో వెళ్లే భక్తులకు తిరుమలలో శ్రీవారి దర్శనం పునరుద్ధరించాలని, రోజుకు 5 వేల మంది భక్తులకు ఆర్టీసీ ద్వారా శ్రీవారి దర్శనం కల్పించాలని సీఎంకు విన్నవించాం. ఆయన మా వినతులపై సానుకూలంగా స్పందించారు. సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారు' అని పరిషత్ నేతలు చెప్పారు.

**ఉద్యోగ సంఘాల హర్షం**

గత ఆరేళ్లలో మొట్టమొదటిసారిగా ఉద్యోగ సంఘాలందరినీ పిలిపించిన ప్రభుత్వం పలు సమస్యలు పరిష్కరించింది. తాజాగా డీఏ విడుదల జీవోలో ఏర్పడిన ఇబ్బందులనూ తొలగిస్తూ రివైజ్డ్ డీఏ జీవోను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. దీనికి ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ చైర్మన్ విద్యాసాగర్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగులు, సీపీఎస్ ఉద్యోగులు, పెన్షనర్లకు ఒకటే షెడ్యూల్‌లో మూడు విడతలుగా డీఏ బకాయిలు విడుదల చేయడం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు స్వాంతన కలిగించిందన్నారు. జీవోలో ఉన్న ఇబ్బందులను రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగానే స్పందించిన సీఎం చంద్రబాబు, ఆర్థికశాఖా మంత్రి పయ్యావుల కేశవ్, సీఎంవో అధికారులకు, ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్ తదితరులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. పీఆర్సీ తదితర అంశాల్లో, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన ప్రతి విషయంలోనూ ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ రాజీలేని ధోరణిని అవలంభిస్తుందని పేర్కొన్నారు. కాగా, ఏపీ సచివాలయ సంఘం మాజీ కార్యదర్శి రామకృష్ణ హర్షం వ్యక్తం చేస్తూ ఓ ప్రకటన చేశారు. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ఓ ప్రకటన చేస్తూ... 'డీఏ అరియర్స్ గందరగోళానికి చెక్‌పెట్టి, రివైజ్డ్ జీవోను ఇప్పించిన సీఎంకి ధన్యవాదాలు తెలిపారు.

# శాంతి భద్రతలపై రాజీ లేదు

-మొదటిపేజీ తరువాయి

నిర్వహించిన కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోలీసు దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. హోం మంత్రి అనిత, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాతో కలిసి పోలీసు అమరులకు నివాళులర్పించారు. అనంతరం ప్రసంగించారు. కూటమి ప్రభుత్వంలో శాంతిభద్రతలపై నమ్మకంతో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయన్నారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునేలా సైబర్ నేరాల కట్టడిలో టెక్నాలజీ అందిపుచ్చుకుని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని చెప్పారు. పోలీసుల పనితీరు, త్యాగాల వల్ల ఫ్యాక్షనిజం, నక్సలిజంపై విజయం సాధించామని.. ఇప్పుడు శేషాచలంలో ఎర్రచందనం, విశాఖ మన్యంలో గంజాయి స్మగ్లింగ్‌ను నిరోధించడంలోనూ వారి తీరు ప్రశంసనీయమని తెలిపారు. 'వ్యక్తిత్వ హననం నుంచి సమాజంలో చిచ్చు పెట్టేవరకూ సోషల్ మీడియాను ఉపయోగించి.. రాజకీయ ముసుగులో విధ్వంసం సృష్టించే కుట్రలకు పాల్పడుతున్న వారిపై కఠినంగా వ్యవహరించాలి. వ్యక్తిగత గొడవలకు కులం రంగు పులుముతారు.. ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన నేరాలకు మతం రంగు పూస్తారు.. ఫేక్ ప్రచారాలతో అలజడులకు కుట్ర చేస్తున్నారు.. అటువంటి వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకుండా జైల్లో పడేయాలి' అని చెప్పారు. గత ప్రభుత్వం పోలీసుల్ని పూర్తిగా విస్మరించిందన్నారు. ఇప్పుడు తాము సరెండర్ లీవ్‌లు ఇస్తున్నామని.. ప్రమాద బీమా కల్పిస్తున్నామని.. పోలీసుల పిల్లలకు స్కాలర్‌షిప్పులు ఇస్తున్నామని తెలిపారు. వైద్య సేవలకు రూ.33 కోట్లు విడుదల చేశామని.. మరణించిన 171 మంది పోలీసులకు బీమా




కింద రూ.23 కోట్లు అందించామని చెప్పారు. ఇటీవలే 6,100 కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేశామని గుర్తుచేశారు. పదోన్నతులు ఇస్తున్నామని.. హోం గార్డులకు ఆరోగ్య బీమా కల్పిస్తామని చెప్పారు.

**ప్రజల కోసం పనిచేయండి..**

'కుమార్తెను రోజూ స్కూలుకు దించే వికలాంగురాలి స్కూటర్‌ను దొంగిలిస్తే.. దానిని రికవరీ చేసి ఆమె కళ్లల్లో ఆనందబాష్పాలు రప్పించిన ఏలూరు పోలీసులకు.. నిరుపేద పిల్లలకు చెప్పులు లేకుండా స్కూలుకు వెళ్తుంటే సొంత డబ్బుతో అందరికీ చెప్పులు కొనిచ్చిన పెనమలూరు హెడ్ కానిస్టేబుల్ వెంకటరత్నాన్ని చూస్తే.. పోలీసుల ఒంటిపై ఉన్నది ఖాకీ అయినా వారి హృదయంలో కారుణ్యం కనిపించింది.. మీరు ప్రజల కోసం పని చేయండి.. ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుంది.. మీ సంక్షేమం ప్రభుత్వ బాధ్యత.. నేరగాళ్లను కట్టడి చేసి ప్రజలకు భరోసా కల్పించాల్సింది మీరే.. ఏపీ పోలీసు అంటే ఓ బ్రాండ్. దానికి మరింత వన్నె తెచ్చేలా పనిచేయాలి' అని సీఎం కోరారు.

శాంతిభద్రతల విషయంలో తానెప్పుడూ రాజీపడలేదని, కఠినంగా ఉన్నందుకే తనపై నక్సల్స్ క్లెమోర్‌మైన్ పేల్చారని గుర్తుచేశారు. నేరాల కట్టడిలో టెక్నాలజీకి ప్రాధ్యాం ఇస్తున్నామని, సీసీ కెమెరాలు, డ్రోన్లు, కృత్రిమ మేధ (ఏఐ)తో పోలీసు శాఖను బలోపేతం చేస్తున్నామన్నారు. 'సీసీ కెమెరాల ద్వారా పాస్టర్ ప్రవీణ్ ప్రమాద కేసు వెలికి తీశాం. జీడీ నెల్లూరులో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టి చిచ్చు రేపే ప్రయత్నం చేశారు. నకిలీ మద్యం కట్టడి చేస్తున్నా ఫేక్ ప్రచారాలతో ప్రజల్లో భయాన్ని సృష్టిస్తున్నారు' అని విమర్శించారు.

**పోలీసుల త్యాగాలు సమాజం కోసమే: అనిత**

ప్రతి పౌరుడూ నిశ్చింతగా నిద్రపోవడానికి.. ప్రతి కుటుంబం ప్రశాంతంగా జీవించడానికి.. పోలీసులు ఉన్నారనే భరోసానే కారణమని హోం మంత్రి అన్నారు. మహిళలకు 'శక్తి' ఒక రక్షణ కవచంలా ఉంటే.. సమాజాన్ని మత్తులో ముంచే ముఠాలపై 'ఈగల్' ఉక్కుపాదం మోపుతోందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు సిబ్బంది త్యాగాలు, నిబద్ధతతో కూడిన విధులు వెలకట్టలేనివని డీజీపీ వ్యాఖ్యానించారు. 'ఈ రోజు యూనిఫామ్ పోలీసులు తలవంచి నివాళులర్పించేది దేశ రక్షణ కోసం ప్రాణ త్యాగం చేసిన పోలీసులకు.. ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారంటే పోలీసుల త్యాగాల వల్లే.. పోలీసు ఉద్యోగం ఒక వృత్తి కాదు.. బాధ్యతతో కూడిన సమాజ సేవ.. యూనిఫాం గౌరవ సూచిక మాత్రమే కాదు.. కర్తవ్యానికి ప్రతీక' అని గుర్తుచేశారు.

## ఉద్యోగుల డిమాండ్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందన హర్షణీయం

**ఏపీఎన్జీజీఓ అసోసియేషన్ చల్లపల్లి యూనిట్ అధ్యక్షులు తోట సుధాకరరావు**

చల్లపల్లి, మహానగర్



ఉద్యోగుల డిమాండ్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందన హర్షణీయం అని ఏపీఎన్జీజీఓ అసోసియేషన్ చల్లపల్లి యూనిట్ అధ్యక్షులు తోట సుధాకరరావు అన్నారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ దీపావళి పండుగ కానుకగా నవంబర్ నెల నుంచి ఒక డీఏ విడుదల చేయటం, అరవై రోజుల్లో హెల్త్ కార్డ్ సిస్టమ్ సక్రమంగా నడిపించేందుకు కమిటీ ఏర్పాటు చేసి ఇన్సూరెన్స్ విధానాన్ని పరిశీలించాలని ఆదేశించటం హర్షణీయమన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల ప్రమోషన్లపై వారం రోజులలో ఉత్తర్వులు జారీచేస్తామని చెప్పటం, చైల్డ్ కేర్ సెలవులపై సీఎం ప్రకటన మహిళా ఉద్యోగుల్లో ఆనందం నింపిందన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులతో జరిగిన స్నేహపూర్వక చర్చలు దాదాపు ఐదేళ్ల తరవాతి ఈ స్థాయిలో జరగటం సంతోషదాయకమని తెలిపారు. సమావేశంలో సంఘ కార్యదర్శి పీవీ మాధవేంద్రరావు, సహాధ్యక్షులు పూసపాటి బ్రహ్మానందరావు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఘంటసాల కృష్ణ మోహన్, చల్లపల్లి యూనిట్ నాయకులు కే.రామకోటేశ్వరరావు, నందం బాబూరావు, జీవీవీ శ్రీనివాస్, బీ.విజయకుమార్, ఏ.శ్రీనివాస్, రాంబాబు, ప్రభు ఉదయ్, విజయవల్లి పాల్గొన్నారు.

## ఆదమరిచి ప్రయాణిస్తే.. అంతే సంగతి!

కోట



నాయుడుపేట రోడ్డు అత్యంత అధ్వాన్నంగా తయారైంది. రోడ్డు ఎక్కడికక్కడ గుంతలు పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. ద్విచక్ర వాహనదారులు అతివేగంగా కానీ,ఆదమరిచి గానీ వస్తే ఇక అంతే సంగతులు.. ప్రమాదం తప్పదు. చీకట్లో వచ్చే ప్రయాణీకుల పరిస్థితి మరి దారుణంగా ఉంటుంది. సుమారు 40 గ్రామాలకు వెళ్లేందుకు ఈ రోడ్డు మార్గాన్ని ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా విద్యానగర్, గుడలి బ్రిడ్జ్, మెట్టు గ్రామాల్లో రోడ్లు బురదమయంగా మారాయి. ప్రభుత్వాలు మారినా ఈ రోడ్డు పరిస్థితి మారడం లేదు. సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాలు కలిసిన ఈ రోడ్డు బాగు కోసం గూడూరు, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

## నిరుపేద కుటుంబాలకు సహాయం




వాకాడు

మండల పరిధిలోని బాలిరెడ్డిపాళెం గ్రామంలోని శ్రీ పట్టాభిరామాలయం కేంద్రంగా నడపబడుతున్న శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు రామిరెడ్డి వేంకటరామిరెడ్డి, హైమావతమ్మ దంపతుల ఆర్థిక సౌజన్యంతో నాలుగు పేద కుటుంబాలకు 55 వేల రూపాయలను మాజీ సొసైటీ చైర్మన్, ఆలయ ధర్మకర్త కొడవలూరు దామోదర్ రెడ్డి ఆన్ లైన్ ద్వారా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దామోదరరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతమే కాకుండా చెన్నైకి చెందిన సుమతమ్మ, పల్నాడు జిల్లాకు చెందిన అగ్నిహోత్రం సువర్ణ లక్ష్మి, కృష్ణా జిల్లాకు చెందిన వినుకొండ విజయ రామాచార్యులు, నెల్లూరు జిల్లాకు చెందిన ఉదయగిరి గోపికృష్ణలకు 55వేల రూపాయలను దాతల ద్వారా మంగళవారం అందజేయడం చాలా సంతోషమన్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులను,దాతలను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీరామసేన అధ్యక్ష,కార్యదర్శులు కొడవలూరు హరీష్ రెడ్డి, పోలిపాటి శివకుమార్, వంశీ, వినయ్, సంస్థ ప్రతినిధి దీవి అనంతబాబు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధిలో దూసుకెళుతోన్న ఉజ్జీవన్ బ్యాంక్

ujjivan
UJJIVAN SMALL FINANCE BANK
Build a Better Life

విజయవాడ

ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఈ సెప్టెంబర్ త్రైమాసికానికి రూ. 122 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఇది గత త్రైమాసికంతో పోలిస్తే 18.2 శాతం పెరిగినట్లు బ్యాంక్ ప్రకటించింది. బ్యాంక్ ఏటా 47.6 శాతం వృద్ధితో రూ. 7,932 కోట్ల రుణాల విడుదలను నమోదు చేసింది. ఇది ఇప్పటివరకు అత్యధికం. మొత్తం రుణ పుస్తకం రూ. 34,588 కోట్లకు చేరింది. భద్రమైన రుణాల వాటా 47 శాతానికి చేరగా, డిపాజిట్లు రూ. 39,211 కోట్లు ఉన్నాయి. నికర వడ్డీ ఆదాయం 7.7 శాతం పెరిగి రూ. 922 కోట్లకు చేరింది. ఆస్తుల నాణ్యత కూడా మెరుగుదల చాటింది. జిఎన్పిఎ 2.45 శాతం ఎన్‌ఎన్పిఎ 0.67 శాతానికి తగ్గాయి. కలెక్షన్ ఎఫిషియెన్సీ 99.5 శాతంగా నమోదై, మైక్రో ఫైనాన్స్ బుక్ స్థిరతను సూచిస్తోంది. ప్రొవిజన్ కవరేజ్ రేషియో 73 శాతంగా ఉంది. బ్యాంక్ కాసా పెంపు, కొత్త ఉత్పత్తుల ప్రారంభం ద్వారా మున్ముందు మరింత కాసా వృద్ధిని ఆశిస్తోంది. క్యాపిటల్ అడిక్వసీ 21.4 శాతం, టియర్ 1 క్యాపిటల్ 19.9 శాతంగా ఉంది. బ్యాంక్ ఆర్థిక సంవత్సరం 26లో రుణాల వృద్ధి 20 శాతం ఉండాలని లక్ష్యంగా పెట్టుకుంది. క్రెడిట్ ఖర్చులు 2.3 శాతం నుండి 2.4

## కూటమిలో విబేధాలు అన్న వార్తలకు మంత్రి కందుల దుర్గేష్ చెక్

### కూటమి కలిసే ఉంటుంది.. కూటమి మధ్య చిచ్చు పెట్టాలని చూస్తే సహించం : మంత్రి కందుల దుర్గేష్




**నిడదవోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** నిడదవోలులో కూటమి మధ్య ఎలాంటి తారతమ్య బేధాలు లేవని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. కూటమి అంతా ఒకేతాటిపై నిలబడి ఉందని ఘంటాపథంగా తెలిపారు. నామినేటెడ్ పోస్టుల విషయంలో ప్రతి మండలంలోని కూటమి నాయకులు చర్చించుకున్న అనంతరమే లోతుగా అధ్యయనం చేసి అందరికీ సముచితమని అనుకున్నాకే ఎంపిక చేస్తున్నామని పేర్కొన్నారు. కూటమిలో విబేధాలు సృష్టించేలా కొన్ని ఛానళ్లు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నాయన్నారు. కూటమిలో వైషమ్యాలు సృష్టిస్తూ వక్రీకరిస్తున్నారని అన్నారు. కూటమిలో విభేదాలు సృష్టించాలనుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. కూటమి కలిసే ఉంటుంది..కలిసే ఉండి బుద్ధి చెప్తామని స్పష్టతనిచ్చిన మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా కూటమిలో విబేధాలు అన్న వార్తలకు చెక్ పెట్టారు. కొందరు వ్యక్తులు, కొన్ని సంస్థలు వాస్తవాలు తెలుసుకోకుండా అనవసర దుష్ప్రచారాలకు తెరతీయడం మంచి పద్ధతి కాదని, సామాజిక బాధ్యతతో కథనాలు రాస్తే, ప్రసారాలు ప్లే చేస్తే ఎవరైనా హర్షిస్తారని పేర్కొన్నారు. వ్యక్తిగత విద్వేషాలు రెచ్చగొట్టేలా, పార్టీల మధ్య వైషమ్యాలు సృష్టించేలా కుట్రపూరితంగా, అక్కసుతో వార్తాకథనాలు రాయడం జర్నలిజం అనిపించుకోదన్నారు.

## కార్మిక నేత బాక్స్ ప్రసాద్ జన్మదిన వేడుకల్లో పలు సేవలు

### పారిశుద్ధ్య కార్మికులు, ట్రాన్స్ కో సిబ్బందికి సత్కారం, వస్త్రాలు పంపిణీ





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కార్మిక నాయకులు, మాజీ డిప్యూటీ మేయర్ బొలిశెట్టి సత్యనారాయణ ప్రసాద్ (బాక్స్ ప్రసాద్) జన్మదిన వేడుకలు మంగళవారం ఆయన కార్యాలయం వద్ద పలు సేవా కార్యక్రమాల నడుమ అత్యంత ఘనంగా జరిగాయి. ప్రతి ఏటా కార్మికుల సమక్షంలో జన్మదిన వేడుకలు నిర్వహించుకునే బాక్స్ ప్రసాద్ ఈ ఏడాది పారిశుద్ధ్య కార్మికులు, ఎలక్ట్రికల్ సిబ్బంది సమక్షంలో జరుపుకున్నారు.ఐఎల్టిడి సెంటర్లో ఉన్న వారి కార్యాలయం వద్ద జరిగిన జన్మదిన వేడుకలకు ప్రముఖులు జనసేన పార్టీ అర్బన్ ఇన్చార్జ్ అత్తి సత్యనారాయణ, న్యాయవాది గొందేశి శ్రీనివాసులురెడ్డి, మాజీ కార్పొరేటర్ బట్లంకి ప్రకాష్, టిఎన్టియుసి నాయకులు నల్లం శ్రీనివాస్, చౌదరి, జనసేన నాయకులు వైవిడి ప్రసాద్,విన్నా వాసు, ముద్దల అను,అలివేలు, ఆకుల బుజ్జి,సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పిలిచిన వెంటనే హాజరై వారి సమస్య పరిష్కారానికి పనిచేసే నాయకుడు బాక్స్ ప్రసాద్ అని కొనియాడారు. అర్ధరాత్రి ఫోన్ చేసిన సహాయానికి ముందుకు వచ్చే బాక్స్ ప్రసాద్ ఆరోగ్యంగా ఉండాలని భగవంతుడు మంచి ఆయుష్షుని ఇవ్వాలని ఆకాంక్షించారు. బాక్స్ ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఏడాది ప్రజల కోసం పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు ఎలక్ట్రికల్ సిబ్బంది మధ్య జరుపుకోవాలని ఆలోచించామన్నారు. అనంతరం పారిశుద్ధ్య సిబ్బందికి ఎలక్ట్రికల్ సిబ్బందికి వస్త్రాలు స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటిలో చికిత్స పొందుతున్న పారిశుద్ధ్య కార్మికురాలు కుటుంబానికి బాక్స్ ప్రసాద్ 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా నగర ప్రముఖులు, ఆటో కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు, ప్రజలు భారీ ఎత్తున వారి కార్యాలయం వద్దకు చేరుకుని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.







## ఈవిఎంలను మాయ చేయటం మోదీ సర్కార్‌కే సాధ్యం..

### ఏపీ అసెంబ్లీ ఓట్లను పవన్ కళ్యాణ్ దొంగిలించారు - పార్లమెంట్ ఓట్లను మోదీ దొంగిలించారు
### మోడీ పాలన, చదువు, గెలుపు,పదకాలు పచ్చి మోసం.. - మేడా శ్రీనివాస్, తీవ్ర ఆరోపణ..



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నిజాయితీగా ఎన్నికల్లో గెలిచాం అని ఋజువు చేసుకోగల సత్తా పవన్ కళ్యాణ్‌కు వుందా! అని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టి వారాంతపు సమావేశంలో అర్పిసి వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ సూటిగా ప్రశ్నించారు. విలేకరులతో మేడా మాట్లాడుతూ మోదీ సర్కార్ గెలుపు వెనుక అంతా ఒక రాజకోట రహస్యం దాగివుంది.ఈ వి ఎమ్,ల మాయా జాలం తోనే మూడు సార్లు మోదీ ప్రధానిగా గెలిచి కార్పొరేట్‌లకు, ఆర్థిక నేరగాళ్లకు ఊడిగం చేసారు. దేశ ఆర్థిక స్థితిని హీనస్థితికి తీసుకెళ్లారు.మోదీ ప్రవేశపెట్టిన అన్ని పథకాల వెనుక ఒక రకమైన మాయాజాలం పొదిగి వుంది. అంతర్ జాతీయ కార్పొరేట్ మాఫియాతో కుట్ర పన్ని భారతదేశంలో ప్రజల ఓట్లను మోదీ దొంగిలించారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసి సమాజాన్ని హంపసయ్యపై పడుకోబెట్టారు. నేరగాళ్ళను ప్రోత్సహించి పార్లమెంట్‌కు మకిలి పట్టించారు.మోదీ గెలుపు ఒక రహస్యం.మోదీ విద్యార్హత ఒక రహస్యం. మోదీ పాలన ఒక అబద్ధం. మోదీ సొంత ఈవిఎమ్‌లకు భయపడి నరేంద్ర మోదీ కూటమికి జై కొట్టి దొంగలందరు పాలనను శాసిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సైతం బారిగా ఈ వి ఎమ్ మోసాలు జరిగాయి అనటంలో సందేహం లేదు. పోలైన ఓట్లకు,లెక్కించిన ఓట్లకు సంబంధమే లేకపోయింది.అనేక గందరగోళ పరిస్థితుల్లో 2024 సాధారణ ఎన్నికలు దేశ వ్యాప్తంగా జరిగాయని, మరి ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ లో జరిగాయి. కూటమితో కలిసి ఆంధ్రప్రదేశ్ లో పోటి చేసిన పవన్ కళ్యాణ్ 21 అసెంబ్లీ స్థానాల్లోను గెలవటం అత్యంత ఆశ్చర్య కరమైనప్పటికి పాలనా వైఫల్యం అయినప్పటికి నేర పరిశోదన బలహీనతతో నేరాలను కట్టడి చేయగల సామర్థ్యం రోజు రోజుకు నిర్వీర్యం అయిపోతుంది. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి సర్కార్ ఆత్మ విమర్శ చేసుకుంటే అనుభవిస్తున్న అధికారం అధికారమేనా! నీతులు చెప్పే పవన్ కళ్యాణ్ తన గెలుపు ఎలా సాధ్యం అయ్యిందో గ్రహించలేరా! పిఠాపురం నియోజకవర్గం మొత్తంగా పవన్ కళ్యాణ్‌ను వ్యతిరేకించి నోటికొచ్చిన బండ బూతులు శాపనార్థాలుతో వ్యతిరేకించినా వేల ఓట్లు మెజార్టీ రావటం ప్రపంచ వింతల్లో ఒకటిగా ఉంటుంది. ఇన్వెస్టిగేషన్ చేయగల దమ్మున్న ఏజెన్సీ మోదీ సర్కార్ పాలనలో వుంటే ఎన్నో ఆసక్తికర సాంకేతిక నేరాలు భహిర్గతం అవుతాయని ఆయన పేర్కొన్నారు. అతి తక్కువ రాజకీయ అనుభవంలో ఆంధ్రులను ఎలా మోసం చేయాలో మెళుకువలు తెలుసుకున్న పవన్ కళ్యాణ్. పవన్ కళ్యాణ్ అభిమానుల్లో ఉన్నటువంటి కమ్మిట్మెంట్ పవన్ కళ్యాణ్ లో లేదనేది నిజం కాదా ! పవన్ కళ్యాణ్ స్వప్రయోజనం కోసం ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ను దోచుకుంటున్న వారికి వెన్ను దన్నుగా నిలబడటం బాదాకరం . మోదీ పార్లమెంట్ ఓటును దొంగిలించారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి సర్కార్ అసెంబ్లీ ఓటును దొంగిలించారు . ప్రజల హృదయాలను గెలవలేని పవన్ కళ్యాణ్ అడ్డ దారిలో అన్యాయంగా గెలుపుని స్వయం ప్రకటన చేసుకున్నారు. విభజన ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ నష్ట పోవటానికి పవన్ కళ్యాణ్ కారణం కాదా ! పవన్ కళ్యాణ్ ఆవేసిత ఉపన్యాసాలు చూసి కొంతమంది ఏదో మంచి చేస్తాడు అని నమ్మారు. మోదీకి సాగిల పడి రాష్ట్ర ప్రతిష్టను, అభివృద్ధిని, యువత భవిష్యత్ ను తాకట్టు పెడతారని ఊహించలేకపోయారు. ఏ బలహీనతలు మిమ్ములను వెంటాడుతున్నాయో మాకు తెలవదు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ దృష్ట్యా, మీ ప్రతిష్ట మరింత దిగజారకముందే మీరు రాజకీయాల నుండి నిష్క్రమించటం మంచిదని, లేకుంటే ఆంధ్ర రాష్ట్ర ప్రజలే పవన్ కళ్యాణ్‌ను భహిష్కరించే రోజులు దగ్గరలోనే వున్నాయని ఆర్పీసీ అధ్యక్షులు మేడా శ్రీనివాస్ హెచ్చిరించారు. సభకు అర్పిసి సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఆర్పీసీ సెక్యులర్స్ ,కార్యకర్తలు పాల్గొన్నారు.

### అలరించిన ఘంటశాల, బాలు

## సంగీత విభావరి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సొగ్గాడు శోభన్ బాబు కల్చరల్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో శోభన్ బాబు ఫ్యాన్స్ అధ్యక్షుడు దొండపాటి సుబ్రహ్మణ్యం నిర్వాహణలో ఆదివారం రాత్రి విక్రమహల్ లో జరిగిన పద్మశ్రీ ఘంటశాల, పద్మభూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాటలతో "ఆపాత మధురాలు" సినీ సంగీత విభావరి అలరించాయి. జూనియర్ ఘంటశాల బిరుదు పొందిన కాకినాడకు గాయకుడు పి.వి.రమణ నిర్వహించిన సినీ సంగీత విభావరి వీనుల విందుగా సాగింది. ఈ సంగీత విభావరిలో పలువురు గాయనీ గాయకులు పాడిన పాటలువిని శ్రోతలు మైమరిచారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ గాయకునిగా పేరుగాంచిన పి.వి.రమణను దొండపాటి సుబ్రహ్మణ్యం సారధ్యంలో పి.వి.ఎస్.కృష్ణారావు, ఆలీ ఘనంగా సత్కరించారు. రామచంద్రమూర్తి కూడా గాయకుడు రమణను సత్కరించారు.వక్తలు మాట్లాడుతూ భారతదేశం గర్వించతగ్గ అంతర్జాతీయ గాయకుడు పి.వి.రమణ అని అభినందించారు.తన గాన మాధుర్యంతో ఘంటశాలను జ్ఞప్తికి తెస్తున్నారని కొనియాడారు.స్వరనిధి,గాయక రత్న,గాయక సేవాశిరోమణి బిరుదులతోపాటుఅమెరికాలో సంగీత విభావరి నిర్వహించి గాయక సార్వభౌమ బిరుదు అందుకోవడం అందరికీ గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో ఆత్మీయ అతిధులుగా శోభన్ బాబు ఫ్యాన్స్ సేవా సమితి గౌరవాధ్యక్షులు అల్లు బాబి, కళారత్న పి.వి.ఎస్. కృష్ణారావు,రాయుడు చంద్రకుమార్, బర్రే సుబ్రహ్మణ్యం, మైలవరపు నాగేంద్రప్రసాద్, డి.ఎస్.ప్రభాకరరావు, పాటల అభిమాని కేశవ్ సత్యనారాయణ, టి.వెంకట రవి, కళాభిమాని కసిరెడ్డి రాంబాబు, ఆకుల రామచంద్రరావు, యేరుకొండ వెంకటేష్ పాల్గొన్నారు.

### నిత్యం ప్రజాసేవకై పరితపించే

## అనపాల ఆంజనేయులు రెడ్డి కృషికి గుర్తింపునిస్తూ మరో మైలురాయి



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్ర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ జయంతిని పురస్కరించుకుని కాకినాడ జెఎన్‌టియు యూనివర్శిటీలో డొక్కా సీతమ్మ స్ఫూర్తి పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. రాజమండ్రికి చెందిన 'పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్' ఆధ్వర్యంలో అద్దంకి రాజా సారధ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కాకినాడ జె.ఎన్.టి.యు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని సేవా కార్యక్రమాలు నిర్వహించే పలువురికి పురస్కారాలను అందజేశారు. దీనిలో భాగంగా కాకినాడకు చెందిన ప్రముఖ సేవా తత్పరుడు 'ఆంధ్రశ్రీ, సేవా రత్న అనపాల ఆంజనేయులు రెడ్డి స్వచ్ఛంధ సేవా సంస్థ వ్యవస్థాపకులు అనపాల ఆంజనేయులు రెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి వైస్ ఛాన్సలర్ ప్రసాద్ చేతులమీదుగా అనపాల ఆంజనేయులు రెడ్డికి డొక్కా సీతమ్మ స్ఫూర్తి పురస్కారం అవార్డును ప్రధానం చేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో సాటివారికి సహాయం చేయాలనే ఆలోచన అందరికీ ఉంటుందని, కాని నిజంగా అవసరం ఉన్నవారిని గుర్తించి గత కొంతకాలంగా నిర్విరామంగా శక్తికి మించి సేవా కార్యక్రమాలు చేస్తున్న అనపాల ఆంజనేయులు రెడ్డి కృషి అభినందనీయమని, అనపాల ఆంజనేయులు రెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని మరింతమంది సేవా కార్యక్రమాలు చేసేందుకు ముందుకు రావాలని కోరారు.

## వృద్ధాశ్రమంలో ఘనంగా దీపావళి వేడుకలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక లాలా చెరువులో గల స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వృద్ధాశ్రమం ముందు రంగవల్లులతో అలంకరించి వృద్ధులకు మిఠాయిలు పండ్లు పంచి నగదును నిర్వాహకులు రాంబాబు బహూకరించారు. దీపావళి మతాబులు కాల్చుతూ వృద్ధులు చిన్నపిల్లల కేరింతల కొడుతూ ఆనందించారని రాంబాబు తెలిపారు.ఈ సందర్భంగా ప్రత్యేక భోజనం ఏర్పాటు చేసామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మీరా కుమారి, సింధు, దివ్య, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల త్యాగాలు వినలేనివి : సీఐ సత్య కిషోర్

### ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజల శాంతి భద్రతలకు దేశ పరిరక్షణకు ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు ఎనలేనివని కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ వై.సత్య కిషోర్ అన్నారు. మంగళవారం "పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం"లో భాగంగా ఎస్సై నాగార్జున ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల విద్యార్థులు పోలీస్ స్టేషన్ నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించి, అమరవీరులు అమరహే అంటూ నినాదాలు చేస్తూ, పెద్ద ఎత్తున మానవహారం నిర్వహించారు. అనంతరం సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్య కిషోర్ మాట్లాడుతూ పోలీసులు తమ కుటుంబాల కంటే ప్రజల రక్షణకు, ప్రజల ఆస్తులు, దేశభద్రతకు తమ ప్రాణాలు సైతం ఫణంగా పెడతారన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన,అమరవీరుల త్యాగాలను కొనియాడుతూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. పోలీస్ వ్యవస్థలో నేరాలను అరికట్టడానికి నిఘా నేత్రాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రజలు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని అసాంఘిక కార్యక్రమాలను నిర్మూలించడానికి పోలీసులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నాగార్జున, ట్రైన్ ఎస్సై అలెగ్జాండర్, పోలీస్ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన చెల్లుబోయిన



**ధవళేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి రూరల్ నియోజకవర్గం ధవళేశ్వరం గ్రామంలోని ఇండస్ట్రియల్ కాలనీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు బలగం ప్రమోద్ తల్లి బలగం హైమావతి ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి ఆపరేషన్ చేయించుకున్నారని తెలుసుకుని సోమవారం వారి ఇంటికి వెళ్ళి పరామర్శించిన రూరల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకృష్ణ,ఆవిడ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు, పార్టీ మీకు అన్ని విధాల అండగా ఉంటుందని ఏ సమస్య ఉన్న తమకు కబురు చేస్తే మీకు అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు.

### పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే

## చర్యలు తప్పవు.. : అదనపు కమిషనర్ సుధాకర్





**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కెటి సుధాకర్ హెచ్చరించారు. మంగళవారం ఉదయం ఆయన కాకినాడ నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. జన్మభూమి పార్క్, రామకృష్ణారావుపేట, బ్యాంక్‌పేట, మహాలక్ష్మీనగర్, జె రామారావుపేట, అన్నమ్మ ఘాటి ప్రాంతాల్లో శానిటేషన్ కార్యకలాపాలను స్వయంగా పరిశీలించారు. సినిమా రోడ్‌లోని పెట్రోల్ బంక్ వద్ద హాప్పర్ టిప్పర్ వాహనాలు గ్యాస్ నింపుకునేందుకు వేచి ఉన్నట్లు గమనించిన ఆయన విధుల్లో నిర్లక్ష్యం వహించిన డ్రైవర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అన్నమ్మఘాటి సెంటర్‌లో గల అన్న క్యాంటీన్ను సందర్శించి, అల్పాహార నాణ్యతపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. క్యాంటీన్ రిజిస్టర్ నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అదే విధంగా 23వ డివిజన్ పరిధిలో త్రాగునీటి కొళాయి ద్వారా అందిస్తున్న నీటి నాణ్యతను స్వయంగా పరిశీలించి, తగిన సాంద్రత ఉన్నదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శానిటేషన్ అధికారులకు పలు సూచనలు చేస్తూ "నగర శుభ్రతలో ఎటువంటి నిర్లక్ష్యం సహించం. ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి," అని అదనపు కమిషనర్ సుధాకర్ స్పష్టం చేశారు.

## ఎడిటర్ వాయిస్

### వ్యవస్థలో పాతుకపోయిన

# కుల వివక్ష

అత్యున్నత అధికార పీఠాలు అణగారిన వర్గాలకు అందుబాటులోకి వచ్చినా, సామాజిక వాస్తవికత ఆ పదవులను కూడా వివక్షా క్షేత్రాలుగా మారుస్తోంది. ఈ అధికార–సామాజిక వైరుధ్యం భారత ప్రజాస్వామ్యంలో సామాజిక న్యాయ సాధనకు సవాలుగా పరిణమించి అణగారిన వర్గాల ప్రతీకార ఆవశ్యకతను నొక్కి చెబుతోంది. అణగారిన వర్గాలు కేవలం పదవులను పొందడం మా త్రమే కాకుండా, ఆ పదవుల ద్వారా వ్యవస్థాగతమైన వివ క్షను సమూలంగా ఎదుర్కొనే చట్టబద్ధమైన అధికారాన్ని సాధించాలని. అలాగే వ్యవస్థీకృత వివక్షను ఎదు ర్కొనేం దుకు రాజకీయ అధికారం, ఏకీకృత శక్తి తప్పనిసరి అని ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలు తెలియజేస్తున్నాయి. భారతదేశ 52వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ అణగారిన నేపథ్యం నుంచి ఈ అత్యున్నత పదవికి చేరుకున్నారు. ఆయన స్థానాన్ని అంగీకరించలేని కులతత్వ రాజ్యాధికార ఆధిపత్యం ఇటీవల కోర్టు హాలులోనే ఒక న్యాయవాది దాడి చేసేందుకు ప్రయత్నించడం ద్వారా బహిర్గతమైంది. ఈ దాడి న్యాయవ్యవస్థను ధిక్కరించడమే కాక, దీని వెనుక అణగారిన నేపథ్యం పట్ల ఉన్న తీవ్ర పక్షపాతమే దాగి ఉందని స్పష్టమైంది. ఈ ఘటనపై జరిగిన దేశవ్యాప్త చర్చ, సమాజంలో అట్టడుగున ఉన్న కోట్లాది మంది నిస్సహాయ ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న తిరస్కరణకు, అగౌరవానికి ప్రతీకగా మారింది. ఉన్నత పదవిలో ఉన్నప్పటికీ వివక్ష ఎదురైనప్పుడు, అది నిస్సహాయ ప్రజల గళాన్ని ఏకం చేసి, రాజ్యాంగ విలువలకు రక్షణగా నిలబడాల్సిన స్థానంలో సైతం పోరాడవలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పింది. ఈ దాడిని అణగారిన నాయకత్వంపై ఆధిపత్య వర్గం చూపే తిరస్కరణగా, న్యాయవ్యవస్థ రాజ్యాంగ సమగ్రతను బలహీనపరిచేందుకు జరిగిన ధిక్కార చర్యగానే చూడాలి. హర్యానా కేడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి వై. పురాణ్ కుమార్ ఆత్మహత్య ఘటన, ఉన్నత పదవుల్లోని వ్యవస్థీకృత వివక్షకు తిరుగులేని సాక్ష్యం. అణగారిన వర్గానికి చెందిన పూరన్ కుమార్, సీనియర్ అధికారుల నుంచి కులం పేరుతో వేధింపులు, అవమానాలు, తప్పుడు కేసుల బెదిరింపులు ఎదుర్కొన్నట్లు తన ఆత్మహత్య లేఖలో పేర్కొన్నారు. అత్యున్నత పోలీస్ అధికారిగా ఉన్నా, ఆయనను లక్ష్యంగా చేసుకుని వేధింపులు ఆత్మహత్యకు దారితీయడం.. అధికారం అట్టడుగు వర్గానికి చేరినా, దానిపై వివక్ష నీడ పడుతుందనడానికి నిదర్శనం. ఈ సంఘటన, అణగారిన సమాజంలో తీవ్ర ఆగ్రహాన్ని, అభద్రతా భావాన్ని రేకెత్తించింది. పూరన్ కుమార్ కుటుంబానికి న్యాయం జరగాలంటూ దేశవ్యాప్తంగా అణగారిన సంఘాలు ఏకమై నిరసనలు తెలుపడం, నిస్సహాయ ప్రజల గళం ఏకమవడానికి, అధికార దుర్వినియోగానికి వ్యతిరేకంగా పోరాడటానికి కారణమైంది. ఉన్నత పదవిలో ఉన్న అధికారి ఆత్మహత్య, కేవలం పాలనా వైఫల్యం కాదు. ఇది వ్యవస్థీకృత దౌర్జన్యానికి, రాష్ట్ర నైతిక నిర్మాణానికి జరిగిన ఘోర విఘాతంగా విశ్లేషించబడుతోంది. ఈ విషాదం, ఉన్నత స్థానంలో ఉన్న బహుజనుడికి సైతం రాష్ట్ర యంత్రాంగం రక్షణ కల్పించడంలో వైఫల్యం చెందిందని నిస్సహాయులకు స్పష్టం చేసింది. ఈ అంతర్గత వైఫల్యంపై ఉద్యమం తలెత్తింది. గతంలో ఒక మంత్రి పరిస్థితి గంజీల ఈగను గుంజేసినట్లు ఉండేది. ఇప్పుడు పీటలపై కుర్చోవడం, కుర్చీ నుంచి లేపడం, ఒక మంత్రిని, తోటి మంత్రి వివక్ష వాఖ్యలు చేయ డం, సదరు మంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలు, మాదిగ వర్గానికి చెందిన నాయకుడైనందునే జరిగాయని అణగారిన సంఘాలు ఆరోపించాయి. ఇలా ఏ కోణంలో చూసినా ఆ వాఖ్యలు మంత్రి పదవిలో ఉన్న తోటి మంత్రిపై చూపిన అగౌరవాన్ని ప్రతిబింబించాయి. అణగారిన సంఘాల ఒత్తిడితో చివరకు తోటి మంత్రి క్షమాపణలు చెప్పవలసి వచ్చింది. ఈ ఘటన, తమ ఆత్మగౌరవాన్ని పరిరక్షించుకోవడానికి, తమ రాజకీయ శక్తిని మరింత పటిష్టం చేసుకోవడానికి నిస్సహాయ ప్రజల గళం ఏకం కావాల్సిన ఆవశ్యకతను మరోసారి గుర్తు చేసింది. ఈ పోరాటంలో వ్యక్తిగత ఆత్మగౌరవం, వర్గ ఆత్మగౌరవంగా రూపాంతరం చెందుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అసెం బ్లీలో అక్బరుద్దీన్ ఒవైసీ నుంచి ఎదుర్కొన్న వ్యాఖ్యలు, అధికారంలో ఉన్నప్పటికీ గిరిజన నేపథ్యం పట్ల ఉన్న చిన్నచూపును ప్రతిబింబించాయని విమర్శకులు అరోపించారు. ఒవైసీ, తాను చెప్పేది సీతక్కకు అర్థం కావడం లేదంటూ, 'ఆమెకు ఉర్దూ, ఇంగ్లీష్ రాదు' అని వ్యంగ్యంగా మాట్లా డడం, గిరిజన ప్రాంతం నుంచి వచ్చిన నాయకురాలిని, ఆమె ఆదివాసీ గుర్తింపును, నేపథ్యాన్ని కించపరిచేలా ఉం దంటూ విమర్శలు వెల్లువెత్తాయి. పోరాటాల ద్వారా ప్రజా జీవితంలోకి వచ్చిన సీతక్కను లక్ష్యంగా చేసుకొని భాషా ప్రాతిపదికన అగౌరవపరచడం,



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# విప్లవ జ్వాల అమరజీవి అష్ఫాఖ్



మాతృదేశ విముక్తి పోరాటంలో ప్రాణాలకు తెగించి పోరాడిన యువ విప్లవ కారుల్లో అష్ఫాఖుల్లా ఖాన్ ప్రముఖుడు. వయసుకు మించిన పరిణితితో కేవలం 27 సంవత్సరాలకే నూరేళ్ళ ఖ్యాతినార్జించి, దేశంకోసం ఉరితాడును ముద్దాడిన మేరునగ ధీరుడు. మాతృభూమిని ఆంగ్లేయుల దాస్యశృంఖలాల నుంచి విముక్తం చేయాలనుకున్న క్రమంలో తనత్యాగం వృధా పోదని, మరెందరో త్యాగధనులకు స్ఫూర్తినిస్తుందని నిర్భయంగా ప్రకటించిన సాహస వీరుడు. తనదేశం తప్పకుండా స్వేచ్ఛా వాయువులు పీలుస్తుందని, అతిత్వరలో బానిస సంకెళ్ళు తెగిపోతాయని ధీమాగా పలికిన దేశభక్తుడు. దేశంలోని కోట్లాది మంది ముస్లింలలో దేశ స్వాతంత్ర్యం కోసం ఉరికంబాన్ని ఎక్కబోతున్న మొట్ట మొదటి అదృష్టవంతుడిగా గర్వపడుతున్నానంటూ ఉరితాడును ముద్దాడి తానే మేడలో వేసుకున్నధీశాలి. నా దేశ సోదరులారా.! మీరు మొదట భారతీయులు. ఆ తర్వాతే మీమీ మతధర్మాలు. మీరు ఏమతం వారైనప్పటికీ పరస్పరం కలహించుకోకండి. ఐకమత్యంతో ఆంగ్లేయులను ఎదిరించండి. దేశ విముక్తే మన లక్ష్యం కావాలి '. అంటూ దేశంపట్ల బాధ్యతను గుర్తుచేస్తూ కర్తవ్యబోధ చేసిన దార్శనికుడు. ఆంగ్లేయులకు కంటిమీద కునుకు లేకుండా చేసి ముచ్చెమటలు పట్టించిన అష్ఫాఖుల్లాఖాన్ 1900 సంవత్సరం అక్టోబర్ 22 తేదీన ఉత్తర ప్రదేశ్ లోని షాజహాన్‌పూర్ లో జన్మించాడు. మజ్హరున్నీసా, షఫీఖుల్లాహ్ ఖాన్ తల్లిదండ్రులు. ఆరుగురు సంతానంలో అష్ఫాఖ్ చిన్నవాడు. మిషనరీ స్కూల్ లో చదువుకున్నాడు. తల్లి దండ్రులు విద్యావంతులు. తండ్రి షఫీఖ్ పోలీసు శాఖలో ఉద్యోగం చేశాడు. అష్ఫాఖ్ ప్రాథమిక ఇస్లామీయ పరిజ్ఞానమంతా తల్లి వద్దనే నేర్చుకున్నాడు. అష్ఫాఖ్ కు ధార్మిక విద్యలో మంచి శిక్షణ ఇప్పించాలనే ఉద్దేశ్యంతో తల్లిదండ్రులు ఒక ధార్మిక గురువును ఏర్పాటు చేశారు. ఆ పండితుడు కూడా గొప్ప దేశభక్తుడు. ఎట్టి పరిస్థితిలోనూ విదేశీ వస్తువులు వాడేవాడుకాదు. ఆంగ్లేయుల అరాచకాలను, వారి ఆధిపత్య ధోరణిని అష్ఫాఖ్ కు విడమరచి చెప్పేవాడు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడి దేశానికి విముక్తి కల్పించడం గొప్ప పుణ్యకార్యమని, వారికి సహకరించినా, వారితో స్నేహం చేసినా నరకం రుచి చవిచూడాల్సి ఉంటుందని చెప్పేవాడు. గురువు మాటలు అష్ఫాఖ్ ను అమితంగా ప్రభావితం చేశాయి. స్వయంగా తల్లికూడా విద్యాధికురాలు కావడంతో పిన్న వయసులోనే అతనికి గొప్ప జ్ఞాన సంపద సమకూరింది. కుటుంబ నేపథ్యం రాజకీయాలకు అతీతమైనా, తన ఆలోచనలు మరోలా సాగేవి. దీంతో అష్ఫాఖ్ ఎప్పుడెప్పుడు విప్లవోద్యమంలోకి దూకాలి, ఎప్పుడు బ్రిటిషర్ల ముష్కర పాలన నుండి దేశానికి విముక్తి కల్పించాలి.. అని కలలు కంటూ ఉండేవాడు. సరిగ్గా ఆసమయంలోనే గాంధీజీ సహాయ నిరాకరణోద్యమం కూడా ప్రారంభమైంది. విద్యార్థిగా ఉంటూనే అష్ఫాఖ్ ఆ ఉద్యమంలో పాలు పంచుకున్నాడు. విదేశీ వస్తువులను వాడడం , ఆంగ్ల వస్త్ర ధారణ చేయడం మానేశాడు. విదేశీ వస్తువుల వాడకం ఆంగ్లేయుల బానిసత్వానికి చిహ్నమని, వీటి వాడకం మానేయాలని ప్రచారమే ప్రారంభించాడు. ఈచర్య కుటుంబీకుల్ని కలవర పరిచింది. మిషన్ స్కూల్ ఆయన్ని పాఠశాలనుండి బహిష్కరించింది. అయినా సరే అష్ఫాఖ్ బెదరలేదు, నిరాశ చెందలేదు. ప్రపంచంలోని ప్రభావవంతమైన విప్లవ వీరుల చరిత్రలు చదివి ప్రేరణ పొందేవాడు. తను కుడా వారికి లాగానే మాతృదేశంకోసం పోరాడి చరిత్రలో నిలిచి పోవాలని, దానికోసం తాను ఏమైపోయినా పరవాలేదని దృఢంగా నిర్ణయించుకున్నాడు. మిషన్ స్కూల్లో విప్లవ దళ సభ్యుడు, సహ విద్యార్థి రాజారాం కోసం వెదికాడు. కాని అతని జాడ దొరకలేదు. ఇతర విప్లవ దళ సభ్యులను కలుసుకోడానికి ప్రయత్నించి, చివరికి రాంప్రసాద్ బిస్మిల్ ను కలుసుకోగలిగాడు. తనుకూడా అష్ఫాఖ్ కు లాగానే దేశ విముక్తికోసం కలలు గంటూ దేనికైనా సిద్ధమని రంగం లోకి దూకిన విప్లవకారుడు. పదహారణాల సనాతనవాది. ఆర్యసమాజీకుడు. ఒకవైపు అష్ఫాఖ్ సాంప్రదాయ కుటుంబానికి చెందిన ముస్లిం. మరోవైపు సనాతన హిందూ కుటుంబానికి చెందిన ఆర్య సమాజ సభ్యుడైన హిందువు. ఉప్పు, నిప్పు లాంటి పరిస్థితి. చాలాకాలం ఇద్దరి మధ్య సఖ్యత కుదరలేదు. కాని ఇద్దరి లక్ష్యం ఒక్కటే.. బానిస బంధనాలనుండి దేశానికి విముక్తి. ఎవరి ధర్మాలను వారు పాటిస్తూనే దేశం కోసం ఒక్కటై భావితరాలకు ఆదర్శంగా నిలిచిపొయ్యారు. ఇప్పుడు వీరికి ఉద్యమ అవసరాలకోసం పైకం కావాలి. దానికోసం ఒక పథకం ఆలోచించి, ప్రభుత్వ ధనాన్ని కొల్లగొట్టాలని నిర్ణయించారు. అందులో భాగంగా 1925 ఆగష్టు 9 వ తేదిన అష్ఫాఖుల్లా ఖాన్, రాంప్రసాద్ బిస్మిల్ , చంద్రశేఖర్ ఆజాద్ , రాజేంద్ర లాహిరి, రోషన్ సింగ్ లాంటి మరికొందరు విప్లవ మిత్రులతో కలిసి కాకోరీ గ్రామం వద్ద ప్రభుత్వ ఖజానాతో వెళుతున్న రైలును దోపిడీ చేశారు. పట్టుమని పదిమంది కూడా లేని యువకులు ఏకంగా బ్రిటిషోడి ఖజానాకే గురి పెట్టి, రైలునే దోచేయడం ఆంగ్లాధికారులకు తల తీసేసినంతపనైతే, ఉద్యమ కారులకు కొత్త ఉత్సాహాన్ని అందించినట్లయింది. దీంతో ఆంగ్లాధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని సోదాలు ముమ్మరం చేసి, సెప్టెంబరు 26 న రాంప్రసాద్ బిస్మిల్ ను అరెస్టుచేశారు. అష్ఫాఖ్ ఇంటిపైకూడా పోలీసులు దాడిచేశారు. కాని అష్ఫాఖ్ వారికి దొరక్కుండా తప్పించుకున్నాడు. ఎలాగో బనారస్ చేరుకొని పది నెలలపాటు అక్కడే ఒక కంపెనీలో పనిచేశాడు. తరువాత ఇక ఏమాత్రం అజ్ఞాతంలో ఉండలేక దేశానికి ఉపయోగపడాల్సిందేనని, దానికోసం మార్గాలు అన్వేషిస్తూ ఢిల్లీ చేరుకున్నాడు. అక్కడొక మిత్రుడు చేసిన నమ్మక ద్రోహంతో పోలీసులకు పట్టుబడ్డాడు. నయానా భయానా లొంగదీసుకొని మిగతా వారి సమాచారం రాబట్టాలని పోలీసులు ఎంతప్రయత్నించినా అష్ఫాఖ్ ఏమాత్రం భయపడలేదు. చివరికి 1927 డిసెంబర్ 19 వ తేదీన అష్ఫాఖ్ ను ఉరితీయాలని తీర్పు వెలువడింది. ప్రాణత్యాగానికి ఏనాడో సిద్ధపడ్డ అష్ఫాఖ్ , మాతృదేశ విముక్తికోసం ఉరికంబాన్నెక్కబోతున్నందుకు గర్వపడుతున్నానని సగర్వంగా ప్రకటించాడు. ఇంతటి అదృష్టం అందరికీ దక్కదని, ఇన్నికోట్ల మంది ముస్లిం జనాభాలో దేశంకోసం బలిపీఠమెక్కబోతున్న తొలి ముస్లింను తానే అయినందుకు సంతోషంతో పొంగిపోతున్నాని గర్వంగా చెప్పుకున్నాడు. ఉరితాడును పూమాలగా స్వీకరించిన ఈధీశాలి, ' నా మాతృదేశమా.. సదా నీసేవ చేస్తూనే ఉంటా.. ఉరిశిక్షయినా, యావజ్జీవమైనా.. సంకెళ్ళ దరువుతో నీ కీర్తిగానం చేస్తూనే ఉంటా.' అని కవితాత్మకంగా తన దేశభక్తిని చాటిచెప్పాడు. ఆరోజు రానే వచ్చింది. అష్ఫాఖ్ తెల్లవారు ఝామున్నే నిద్రలేచి స్నాన పానాదులు ముగించుకున్నాడు. శుభ్రమైన వస్త్రాలు ధరించాడు. ప్రాతఃకాల ఫజర్ నమాజు (దైవప్రార్థన) ఆచరించాడు. తరువాత ఖురాన్ పారాయణం లో లీనమైపోయాడు. అంతలో జైలు అధికారులు అక్కడికి వచ్చారు. వారిని చూస్తూ పలకరింపుగా, ' ఏర్పాట్లు పూర్తయ్యాయా ? 'అని ప్రశ్నించాడు చిరునవ్వుతో.. 'మన్నించండి, మేము నిమిత్తమాత్రులం' అన్నారు వారు. ' అయ్యో.. ఉద్యోగులుగా మీ ధర్మం మీరు నెరవేర్చారు. ఇందులో మీ తప్పేమీ లేదు.' అంటూ, ఖురాన్ గ్రంథం చేత పట్టుకొని ' దేవా..వచ్చేస్తున్నా..!' అంటూ వధ్యస్థలి వైపుకు కదిలాడు అష్ఫాఖ్ చిరుదరహాసంతో..ప్రాతఃకాల ప్రకృతి మాత ఈతంతంగాన్నంతా చేష్టలుడిగి చూస్తూఉండి పోయింది. అమరజీవి అష్ఫాఖుల్లా ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపొయ్యాయి. కేవలం 27 సంవత్సరాల అతి పిన్నవయస్కుడైన దేశభక్తుడు నిండునూరేళ్ళ జీవితాన్ని పణంగా పెట్టి భావితరాలకు స్ఫూర్తిగా నిలిచాడు. వందేళ్ళ కీర్తిని మూటగట్టుకున్నాడు. భూప్రపంచం ఉన్నంత వరకు దేశం పట్ల బాధ్యతను గుర్తుచేస్తూ షహీద్ అష్ఫాఖ్ త్యాగం సజీవంగా ఉంటుంది.

# నత్తి జబ్బు కాదు... ఇబ్బందే

నత్తి అనగా అసంకల్పిత పునరుక్తుల ద్వారా ప్రసంగ ప్రవాహమునకు విఘాతం కలిగించే ప్రసంగ లోపం. దీనిలో శబ్దాలు, పదాంశాలు, పదాలు లేదా పదబంధాల యొక్క పొడిగింపు అలాగే అసంకల్పిత నిశ్శబ్ద అంతరాయాలు లేదా నిరోధాలు ఉంటాయి, అందువలన నత్తి ఉన్న వ్యక్తి ధ్వనులను స్పష్టంగా పలకడం సాధ్యం కాదు. ఎవరైనా మాట్లాడే టప్పుడు మాటలు తడబడటం లేదా ముద్ద ముద్దగా మాట్లాడటం, కొన్ని అక్షరాలు సరిగా పలక లేకపోవడం జరుగు తుంటుంది. ఈ విధంగా తరచుగా జరుగు తున్నట్లయితే వారికి నత్తి ఉందని అర్థం. ప్రపంచ నత్తి నివారణ అవగాహనా దినోత్సవమును ప్రతి సంవత్సరం అక్టోబరు 22న జరుపు కుంటారు. 1998, అక్టోబరు 22న 'ఇంటర్నేషనల్ ఫ్లూయెన్సీ అసోసియేషన్', 'ఇంటర్నేషనల్ స్టట్టరింగ్ అసోసియేషన్', యూరోపియన్ లీగ్ ఆఫ్ స్టట్టరింగ్ అసోసియేషన్' సంస్థలు సమావేశమై నత్తిపై ప్రజలకు అవగాహన కలిగించటం ద్వారా దానిని నివారించవచ్చని ఒక నిర్ధరణకు వచ్చాయి. అంతే కాకుండా ప్రతి సంవత్సరం అక్టోబరు 22న అంతర్జాతీయ నత్తి నివారణ అవగాహనా దినోత్సవం నిర్వహించాలని పిలుపు నిచ్చాయి. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం పలు దేశాలు, సంస్థలు "నత్తి" నివారణ పట్ల అవగాహనా కార్య క్రమాలు నిర్వహిస్తున్నాయి. మనం మాట్లాడేటప్పుడు అక్షరాలు ఒక దాని తరువాత మరోటి నిర్దిష్ట సమయంలో ఉచ్ఛరించడం వలన ఇతరులకు ఆ ధ్వనులు స్పష్టంగా వినిపిస్తాయి. ఊపిరితిత్తుల నుండి బయటకు వచ్చేగాలి, స్వరపేటిక లోని స్వరతంత్రుల ప్రకంపనలతో స్వరంగా మారి బయటకు వచ్చే టప్పుడు నాలుక పలు విధాలుగా కదిలించడం వలన అనేక శబ్దాలు ఉచ్ఛరించ గలుగుతాము. ఈ ప్రక్రియ మొత్తం మెదడు పర్య వేక్షణలో అతివేగంగా జరుగుతూ కొన్ని సెకండ్ల వ్యవధిలోనే పూర్తవు తుంటుంది. అయితే ఈ ప్రక్రియలో ఒక్కోసారి కొన్ని అసమానతలు తలెత్తి స్వరతంత్రులు సరైన సమయానికి తెరచుకోక పోవడం, నాలుక నిర్దిష్ట సమయంలో కదలక పోవడం లేదా నాలుక ఒకే చోట ఎక్కువ సేపు ఉండిపోవడం వలన శబ్దాలు, పదాలు, వాక్యాలు ఆగి ఆగి రావడం లేదా అవే ధ్వనులు మళ్ళీ మళ్ళీ రావడం జరుగుతుంది. పుట్టుకతో వినికిడి సమస్య ఉన్న వారికి మాటలు నత్తిగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. కొంత మందిలో భయం, టెన్షన్, ఇతరులను అనుకరించడం వల్ల, వంశపారంపర్యంగా నత్తి వస్తుంది. కొందరిలో ఒక అక్షరం బదులు ఇంకొక అక్షరం పలుకు తుంటుంది. వీటిని స్పీచ్ థెరపీతో నయం చేయవచ్చు. నేటి రోజుల్లో చిన్న పిల్లలు నత్తినత్తిగా మాట్లాడటం ఒక సాధారణ సమస్యగా మారింది. ముఖ్యంగా ఈ సమస్య 2సంవ త్సరాల నుండి 5ఏళ్ళ మధ్య ఉంటుంది. చిన్న పిల్లలు నత్తి నత్తిగా మాట్లాడటాన్ని ఇంగ్లిష్‌లో స్టామరింగ్ లేదా స్టట్టరింగ్ అంటారు. ఒక పదాన్ని ఉచ్చరించే సమయంలో తొలి అక్షరాన్ని పదే పదే పలుకుతూ ఉండటం, లేదా ఆ పదాన్ని గబుక్కున ఉచ్చరించలేక అదే మాటను మళ్లీ మళ్లీ అంటుం డటం, ఒక్కోసారి మాట ఆగిపోయి ఒక పట్టాన గొంతు పెగిలి బయటకు రాకుండా ఉండటం... ఇవన్నీ స్టామరింగ్ లేదా స్టట్టరింగ్‌లో భాగమే. స్టామరింగ్ అన్నది చాలా సాధారణ సమస్య. నత్తికి చాలా కారణాలు ఉన్నాయి. జన్యుపర మైన, న్యూరో ఫిజియలాజికల్ మార్పుల వల్ల ఒక్కోసారి నత్తి రావచ్చు. నత్తి ఉన్న పిల్లల్లో కొందరికి వినికిడి సమస్య కూడా ఉండవచ్చు. కాబట్టి పై సమస్యలు ఉన్నాయా లేదా అని పరీక్షించడం చాలా ముఖ్యం. పిల్లల మానసిక స్థితిని సరిగ్గా అర్థం చేసుకోకుండా వారిని ఇతరులతో పోల్చిచూడటం, వాళ్లపై ఒత్తిడి పెంచడం వంటి కారణాలతో స్టామరింగ్ ఇంకా ఎక్కువ కావచ్చు. మాటలు నేర్చుకునే వయసు పిల్లల్లో స్టామరింగ్ అన్నది చాలా సాధారణంగా కనిపించే సమస్య. అయితే వాళ్లలో వయసు పెరుగుతున్న కొద్దీ సమస్య తగ్గుతూ ఉంటుంది. పిల్లల్లో ఒకవేళ స్టామరింగ్ ఉంటే... ఐదేళ్లు వచ్చేనాటికి 65 శాతం మంది పిల్లల్లో, యుక్తవయసు వచ్చేదానికి ముందుగా 75 శాతం మందిలో ఈ సమస్య తగ్గిపోతుంది. నత్తి బాలికలంటే బాలురలో నాలుగు రెట్లు అధికంగా ఉంటుందని పరిశోధనలు చెబుతున్నాయి. 15 మిలియన్ల మందికి నత్తి ఉంటే అందులో అధికంగా పిల్లలే ఉన్నారని అంచనా. రెండు నుంచి ఏడు సంవత్సరాల వయస్సు గల పిల్లల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. కొందరిలో అకస్మికంగా నత్తి మాటలు వస్తాయి. కొంతకాలం కొనసాగుతాయి. నత్తిగా మాట్లాడే వారిని ఎగతాళి చేయకూడదు. ఇతరులు ఎగతాళి చేసిన కొద్దీ వారి సమస్య మరింత పెరగగలదు. నత్తి అనేది రోగం కాదు, వీరిలో శారీరకంగా ఎటువంటి సమస్యలూ ఉండవు. అందువలన మందులు శస్త్ర చికిత్సల వలన ఇది నయం కాదు, కాని వారిలో మానసిక ఒత్తిడిని, భయాన్ని తగ్గించే ప్రత్యేక చికిత్సా విధానం ద్వారా నత్తిని నయం చేయవచ్చు. ఈ ప్రత్యేక చికిత్సా విధానంలో మాట్లాడే క్రమంలో స్వరతంత్రులు, నాలుక, పెదవుల కదలికలు, గాలి సరఫరాలోని అసమానతలు సరిచేయడం, వాటిని సమన్వయంతో పని చేయించ గలడం జరుగుతుంది, తద్వారా నత్తి ఉన్నవారు మామూలుగా మాట్లాడ గలుగుతారు. వాస్తవంగా జబ్బు కాదు. ఇబ్బంది మాత్రమే. మాటలు తడబడుతున్నా, ఆగుతూ, సాగుతూ ముక్కలు ముక్కలుగా వస్తున్నా నిపుణులను సంప్రదించాలి. స్పీచ్ థెరపీ చేస్తే నత్తి నూరు శాతం తగ్గుతుంది. వయస్సును బట్టి థెరపీ ఉంటుంది. స్పీచ్ ట్రైనింగ్ ద్వారా సాధారణం గానే మాట్లాడేలా చేయవచ్చు. నత్తి ఉన్న పిల్లలు మాట్లాడు తున్నప్పుడు వాళ్లు చెప్పేది పూర్తిగా వినాలి. వాళ్లను తొందర పెట్ట కూడదు. వాళ్లకు మాట మాట్లాడు తున్నప్పుడు నత్తి వస్తుంటే వాళ్ల తరఫున మనమే మాట్లాడ కూడదు. వాళు మాట్లాడు తుండగా మధ్యలోనే అందుకుని మాట్లాడ కూడదు. వాళ్లు చెప్పదలచు కున్నది పూర్తిగా చెప్పే వరకూ ఆగి వినాలి. వాళ్లను పూర్తిగా మాట్లాడ నిచ్చేలా ప్రోత్సహించాలి. స్పీచ్ ఫ్లుయెన్సీ, స్టామరింగ్ మాడిఫికేషన్ వంటి స్పీచ్‌థెరపీ ప్రక్రియల ద్వారా మంచి ప్రయోజనం ఉంటుంది. చాలా మంది భాషావేత్తలు, వక్తలు ప్రాక్టీస్ ద్వారా నత్తిని జయించిన వారు ఉన్నారు. నత్తిని అధిగమించాలి అనుకున్నవారు ఈఎన్‌టీ నిపుణులను, స్పీచ్ థెరపిస్ట్‌లను సంప్రదించాలి. అదే సమయంలో ఈ సమస్యకు ఇంట్లో కూడా కొన్ని సాధారణ విధానాలు మరియు పద్ధతులను ఉపయోగించి సమస్యను అధిగమించవచ్చు.

## కార్తీక మాసం పరమ పవిత్రం

బతుకమ్మ పండుగ తర్వాత దసరా సరదాలు కూడా అనుభవించాం. దీపావళి వెలుగుల్లో మన ఇంటికి సంతోష తోరణాలు కట్టాం. అక్టోబర్ 21న ఆశ్వయుజ బహుళ అమావాస్యతో మాసం పూర్తి అవుతున్నది. ఈ రోజు (21 అక్టోబర్ 2025) గుజరాతీల సంవత్సరాదిగా పాటిస్తున్నాం. అక్టోబర్ 21న ఆశ్వయుజ మాసం ముగుస్తూ 22 అక్టోబర్ 2025 రోజున పరమ పవిత్ర కార్తీక మాసం మెదలు అవుతున్నది. "కార్తీక మాసం కన్న పరమ పవిత్ర మాసం లేదని, మహావిష్ణువుకు సమానమైన దేవుడు లేడని, వేదానికి సమానమైన శాస్త్రం ఏదీ లేదని, గంగతో సమానమైన తీర్థం లేదని" స్కంద పురాణం పేర్కొంటున్నది. శివారాధన విశిష్టమైన కార్తీక మాసం 22 అక్టోబర్ నుంచి 20 నవంబర్ 2025 వరకు కొనసాగుతుంది. మహిమాన్వితమైన కార్తీక మాసంలో పరమేశ్వరుడిని విశేష భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తాం. దామోదర మాసంగా పిలుచుకునే పండుగగా అశేష భక్తకోటి పారవశ్యంలో మునిగి పూజలు, వ్రతాలు, ఉపవాసాలు, వన భోజనాలతో భక్తి వరదలతో గుడుస్తుంది. కార్తీక మాసంలో సత్యనారాయణ వ్రతాలు, విష్ణుసహస్రనామ పారాయణాలు, లలిత సహస్రనామ పారాయణాలు ఆచరిస్తారు. ఏడాదిలో తొమ్మిదవ నెలలో వచ్చే కార్తీక మాసంలో శివాలయాల్లో రుద్రాభిషేకాలు, రుద్రపూజలు, లక్ష బిల్వదళ పూజలు, అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు లాంటివని విశేషంగా జరుపుకోవడం అనాదిగా వస్తున్నది. శివున్ని పూజించడంతో మరుజన్మ ఉండదని భక్తులు విశ్వసిస్తారు. అశుతోషుడైన పరమ సదాశివుడు కోరిన కోర్కెలను తీర్చి సకల సౌఖ్యాలను కలిగిస్తున్నాడు. కార్తీక మాసంలో పవిత్ర నదిలో స్నానాలు చేయడంతో పాటు 365 ఒత్తులతో దీపారాధనలు చేస్తారు. పరమ పవిత్రంగా భావించే ఉసిరి చెట్టు కింద ఆవు నెయ్యితో దీపం పడతారు. ఈ మాసం దీపదానం చేస్తే చీకట్లు తొలగుతాయని, లక్ష్మీదేవి అనుగ్రహం కలిగి ఆ ఇల్లు సిరి సంపదలతో నిండిపోతుందని ప్రగాఢ విశ్వాసం. తులసి కోటకు పూజలు నిర్వహిస్తారు. పున్నమి వెలుగుల్లో కార్తీక దీపాలను వెలిగించి నదుల్లో, పారే నీటిలో వదులుతారు.

విశ్వ వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్
మంగళవారం, 21 అక్టోబర్ 2025
www.viswamvoice.com





# అమలాపురంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలు

## సురక్షిత సమాజ నిర్మాణంలో పోలీసులదే కీలక పాత్ర : కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** సురక్షిత సమాజ నిర్మాణంలో పోలీసులు పాత్ర ఎంతో ముఖ్యమని రాష్ట్ర కార్మిక శాఖ మాత్యులు వాసంశెట్టి సుభాష్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద అమర వీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత ప్రజా ప్రతినిధులు పోలీసు ఉన్న తాధికారులు అమరవీరుల స్తూపం వద్ద పుష్ప చక్రాలు ఉంచి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం పోలీసు బలగాల ధైర్యం, కర్తవ్యనిష్ఠ, త్యాగాన్ని వీరోచిత పోరాటాలను స్మరించుకుంటూ దేశ భద్రతకు అంకితభావాన్ని గుర్తుచేస్తుందన్నారు. దేశ భద్రత, ప్రజా శాంతి కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు సిబ్బందిని దేశ వ్యాప్తంగా స్మరించుకుంటారన్నారు. పోలీసు సేవలను గౌరవించే రోజుగా, సివిల్ సొసైటీ భద్రతా వ్యవస్థల మధ్య పరస్పర గౌరవాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహ ణలో తమ ప్రాణాలను అర్పించిన పోలీస్ సిబ్బంది యొక్క త్యాగాలను, శౌర్యాన్ని స్మరించుకుంటూ గౌరవ వందనం సమ ర్పించారు. వారి అపారమైన ధైర్యం దేశభక్తికి చిహ్నంగా ఈ దినోత్స వాన్ని ప్రకటించారన్నారు జిల్లా స్థాయిలో పోలీస్ బలగాలు అమరులకు నివాళులు అర్పిస్తూ ప్రత్యేక పరేడ్‌లు, సంస్మరణ కార్యక్ర మాలు నిర్వహించడం జరి గింద న్నారు. అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం, పోలీసు శాఖ అండగా నిలబడి వారి సంక్షేమం కోసం చర్యలు తీసుకుంటా మన్నారు అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు చేస్తున్న సేవలు, కష్టాలు నిరంతరకృషి శ్లాఘ నీయమన్నారు. ఈ దినోత్స వ విశిష్టతను ప్రజలకు తెలియజేయడమే ప్రధాన ఉద్దేశ్యమన్నారు దేశ సేవ లో ప్రాణాలు అర్పించిన పోలీసు సిబ్బందిని స్మరిం చుకుని దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన పోలీ సులకు శ్రద్ధాంజలి ఘటిం చార న్నారు. 1959లో లద్దాఖ్ లోని హాట్‌స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైన్యం చేతిలో 10 మంది భారత సాయుధ పోలీసులు వీరమరణం పొందిన నాటినుండి ఈ సంస్మరణ దినోత్సవం ప్రాముఖ్యత సంతరించుకుందన్నారు. పోలీసు శాఖలో సేవలంది స్తున్న వారికి ప్రోత్సాహం, గౌరవం కల్పించేందుకు ఇదొక అవకాశమన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాలొడ్డి పోరాడిన పోలీ స్ అమరుల సేవలను జాతి ఎన్నటికీ మరువదని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు. దేశం కోసమే ఈ దేహ మని ప్రజల కోసమే మా ప్రాణమంటూ విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీ రులకు శ్రద్ధాంజలి ఘటిం చారు. దేశ ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణ కోసం శాంతి భద్రతల పరిరక్షణలో అసాంఘిక శక్తులతో ప్రతి దినం ధైర్యంగా పోరాడు తూ తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన పోలీసు సిబ్బందికి నివాళు లర్పించేందుకు అక్టోబర్ 21వ తేదీని పోలీస్ అమర వీరుల సంస్మరణ దినంగా జరుపుకోవడం ఆనవాయితీగా కొనసాగు తోందన్నారు పోలీసు సేవలో అత్యున్నత త్యాగం చేసిన వీర జవాన్లను స్మరించుకునే రోజు మాత్ర మే కాకుండా, ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడటానికి వారు చూపిన సేవాభా వానికి చిహ్నమన్నారు. అమరు లత్యాగాన్ని స్మరిం చుకునే సూచకంగా అమరవీ రుల సంస్మరణ దినంగా పాటించడం జరుగుతోంద న్నారు. నేడు ఆరంభమైన సంస్క రణ కార్యక్రమాలు జాతీయ ఐక్యతా దినోత్సవం అనగా ఈనెల 31 తో ముగుస్తాయ న్నారు. దేశ భద్రత కోసం వారు చేసిన త్యాగాల గురించి సమాజంలో అవ గాహన కల్పించేందుకు అమర వీరుల స్మారకార్థం పోలీసు సిబ్బంది వారం రోజులపాటు కార్యక్రమా లను చేపడతా రన్నారు. విధి నిర్వహణలో వీరమరణం పొందిన అమలాపురం ఎస్సై అశోక్ కుటుంబానికి కానిస్టేబుల్ బ్లెసన్ జీవన్ కుటుంబ సభ్యులకు జ్ఞాపికల తో పాటుగా ఆర్థిక సహాయాన్ని పోలీసు శాఖ తరపున అతిధులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. తొలుత జిల్లా ఎస్పీ రాహుల్ మీనా జిల్లావ్యాప్తంగా పోలీస్ శాఖలో విధినిర్వహణలో అమరులైన వారి కుటుంబాల సంక్షేమ నిమిత్తం చేపడుతున్న సహాయ కార్యక్రమాలు వారి కుటుంబాలను ఆదుకునే విధివి ధానాలపై విశదీకరించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్, స్థానిక శాసనసభ్యులు అయితా బత్తుల ఆనందరావు, డీఎస్పీలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా పోలీసు అమరవీరుల స్మృతి దినం 2025 వేడుకలు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం పోలీస్ ప్రధాన కార్యాలయం వద్ద గల పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు అమరవీరుల స్మృతి దినం - 2025 ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, ఎమ్మెల్యే అయితబత్తుల ఆనందరావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ అతిథులకు స్వాగతం పలికారు. పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. ఏఆర్ ఆర్ఐ బ్రహ్మానందం ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. అనంతరం అమరవీరుల స్మారక స్తూపం వద్ద పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ దేశానికి నిజమైన హీరోలు పోలీసులే. రేయింబవళ్లు ప్రజల రక్షణకై కృషి చేసే పోలీసుల త్యాగం స్మరణీయమైనది" అని అన్నారు. 1959లో లడక్‌లో జరిగిన సంఘటనలో అమరులైన 10 మంది సిఆర్పిఎఫ్ జవానుల త్యాగానికి గుర్తుగా అక్టోబర్ 21ను పోలీసు అమరవీరుల దినోత్సవంగా దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నామని వివరించారు. రాష్ట్ర పోలీసు శాఖ దేశంలోనే ఉత్తమంగా నిలుస్తుందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిజిపి హరీష్ కుమార్ గుప్తా, ఐపీఎస్ మార్గదర్శకత్వంలో పోలీస్ శాఖ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, దిశ యాప్ వంటి సౌకర్యాలతో ప్రజల సేవలో ముందంజలో ఉందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజా సేవలో ప్రాణాలర్పించిన పోలీసుల సేవలు అమూల్యం. వారి కుటుంబాలకు అన్ని విధాలుగా ప్రభుత్వ సహాయం అందించబడుతుందని తెలిపారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ పోలీసులు ప్రజల భద్రత కోసం త్యాగం చేసే నిజమైన సైనికులు. వంద మార్కుల్లో 99 వచ్చినా పోలీస్ శాఖ ఆ ఒక మార్క్ కోసం కృషి చేస్తుంది" అని అన్నారు. అమరవీరుల కుటుంబాలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని చెప్పారు. ఈ ఏడాది మొత్తం దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల సంఖ్య 191. అందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం - 05 మంది. జిల్లా ఏఆర్ డీఎస్పీ సుబ్బరాజు ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా అమరులైన పోలీసుల పేర్లను చదివి శ్రద్ధాంజలి ఘటించారు. ఎస్ఐ, శ్రీ అశోక్ కుమార్, కానిస్టేబుల్ బ్లెసన్ జీవన్ కుటుంబాలకు జ్ఞాపికలను రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, ఎస్పీ రాహుల్ మీనా చేతుల మీదుగా అందజేశారు. సురక్షిత సమాజ నిర్మాణంలో పోలీసుల పాత్ర అమూల్యం" అని కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిదులు, ముఖ్యఅతిదులు అన్నారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఎమ్మెల్యే అయితబత్తుల ఆనందరావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు, పోలీసులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా రాజబాబు 8ి9వ జయంతి నివాళి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ హాస్యనట చక్రవర్తి రాజబాబు 89వ జయంతి గోదావరి గట్టున ఉన్న ఆయన విగ్రహం వద్ద సోమ వారం ఘనంగా జరిగింది. రాజబాబు తమ్ముడు బాబి ఆధ్వర్యాన ఆయన మిత్ర బృందం రాజబాబుకు ఘన నివాళు లర్పించారు. రాజమండ్రి వాస్తవ్యవులు పుణ్యమూర్తుల ఉమామహేశ్వరరావు, వెంకట రవణమ్మ దంపతుల మొదటి సంతా నంగా రాజబాబు 1936 అక్టోబరు 20న నరసాపురంలో జన్మించారు. రాజబాబు 1960లో సినీ పరిశ్రమలో అడుగుపెట్టి 1982 వరకు 550 చిత్రాలలో నటించి తన హాస్యం ద్వారా ఎన్నో అవార్డులు అందుకుని మన అందరిలో చిరస్థాయిగా హాస్యనట చక్రవర్తిగా నిలిచిపోయారు. రాజబాబుకు ముగ్గురు తమ్ముళ్ళు చిట్టి బాబు, బాబి అనంత్, ఐదుగురు చెల్లెళ్ళు శేషు, లక్ష్మి, కుమారి, సుందరి, పద్మ అందరూ హైదరాబాదులో సెటిలయ్యారు. రాజబాబు సతీమణి లక్ష్మి అమ్మలు, కుమారులు నాగేంద్ర బాబు, మహేష్ బాబు పెళ్ళిళ్ళు చేసుకుని ఉద్యోగ రీత్య అమెరికాలో సెటిల్ అయ్యారని రాజబాబు ఆశీస్సులతో అందరూ వెల్ సెటిల్డ్ అని ఆయన తమ్ముడు బాబి తెలిపారు.. రాజబాబు హైదరాబాదులో 47 సంవత్సరాల అతి చిన్న వయసులోనే 1983 ఫిబ్రవరి 14 న మన నుంచి దూరమయ్యారని, రాజబాబు చేసినగుప్తదానాలు, మంచితనం, పంచిన హాస్యం అందరు గుర్తు చేసుకుంటారని వక్తలు చెప్పారు. టీవీ చానెల్స్ ద్వారా, ఆయన నటించిన పాత సినిమాల ద్వారా ఆయన హాస్యం అందరికీ పంచుతున్నారనడంలో ఎలాంటి అతిశయోక్తిలేదు. సినిమా అనే మూడు అక్షరాలు ఉన్నంతకాలం ఆయన మనకు చిరంజీవే. కార్యక్రమంలో రాజబాబు మిత్ర బృందం ముసిని వెంకటేశ్వరరావు (బాబులు), రాజబాబు మేనల్లుడు బి.ఎస్.ఎన్.ఎల్.వాసు, కట్టా చంద్రరావు, బొమ్మూల సత్య బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

## జాలెం రాముకు

# వైసీపీలో కీలక పదవి...

### పార్టీ విజయానికి కృషి చేస్తానన్న రాము..



**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోక వరం మండలం తంటి కొండ గ్రామానికి చెం దిన జాలెం రాము ను కాకినాడ జిల్లా వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ యూనియన్ కాం గ్రెస్ (టీయూసీ) జన రల్ సెక్రటరీగా నియ మిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలి పారు. ఈ నియామకం మాజీ మంత్రివర్యులు, జగ్గంపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్‌చార్జి తోట నరసింహం, రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తోట రాంజి సిఫారసుతో జరిగిందని చెప్పారు. గోకవరం మండలంలోని వివిధ వర్గాలకు చెందిన పార్టీ నాయకులు, పెద్దలు ఆశీస్సులు, సహకారంతో తనకు ఈ బాధ్యతలు అప్పగించారని రాము తెలిపారు. నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తూ, 2029 ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేయడానికి కట్టుబడి ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. తన నియామకానికి తోడ్పడిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

## ద్రాక్షారామం కార్తీకమాసం ఏర్పాట్లపై

# మంత్రి సుభాష్ సమీక్ష

### భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశాలు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ద్రాక్షారామ.. దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానములో కార్తీక మాసం ఏర్పాట్లపై పోలీస్, రెవెన్యూ, పంచాయతీ, ఇతర శాఖల అధికారులతో రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ కార్తీక మాసంలో బక్షుల తాకిడి పెరిగే అవకాశాలు ఉన్నందున తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఇబ్బంది పడకుండా మంచినీళు, మజ్జిగ సదుపాయం, చిన్నపిల్లలకు పాలు ఇచ్చే ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు ఎండ తగలకుండా వాటర్ ప్రూఫ్ టెంట్లు, భద్రత దృశ్య తగు ఏర్పాట్లు చేయాలని మంత్రి సుభాష్ తగు ఆదేశాలు జారీ చేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల సమన్వయంతో కార్తీక మాసం ఘనంగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం ఆర్డీవో దేవరకొండ అఖిల, సబ్ డివిజనల్ పోలీస్ అధికారి రఘువీర్, దేవాలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారిని అల్లు వెంకట దుర్గా భవాని, ద్రాక్షారామం గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, కూటమి పార్టీ నాయకులు, అర్చకులు, వివిధ శాఖల అధికారులు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శప్రాయుడు సురేష్‌కి చిరు సన్మానం



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం, స్థానిక విద్యానిధి స్కూల్లో గని శెట్టి వెంకటేశ్వరరావు( బాబీ మాస్టర్), విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు, స్కూల్ ప్రిన్సిపల్ తీగల మాధవి ఆధ్వర్యంలో ప్రముఖ సమాజ సేవకులు సురేష్‌కి చిరు సత్కారం చేశారు. ఈ సందర్భం గా బాబీ మాస్టర్ మాట్లాడుతూ ఒంటరిగా దాతల సహకారంతో కొన్ని వందల కుటుంబా లకి సహాయం చేస్తూ సమాజంలో పేరుకు పోయిన రుగ్మతలపై కూడా పోరాటం చేస్తున్న సురేష్ అభినందనీయుడు అన్నారు. నాయుడు మాట్లాడుతూ ఇంకా మంచి పనులు చేయాలని కొనియాడారు. సమాజంలో విలువల కోసం శ్రమిస్తున్న సురేష్‌ని మాధవి ఆశీర్వదించారు.

# నల్లా సూర్యచంద్రరావు 71వ జయంతి సందర్భంగా ఘన నివాళులు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** జై ఆంధ్ర ఉద్యమ నాయకుడు, కాపు రిజర్వేషన్ పోరాట సమితి కన్వీనర్, కాపురత్న కీర్తిశేషులు నల్లా సూర్య చంద్రరావు జయంతి. నల్లా సూర్య చంద్రరావు తనయులు నల్లా అజయ్, సంజయ్ ఆద్వర్యంలో గండువీధి, మహిపాల వీధి, నల్లా గార్డెన్‌లలో గల చంద్రరావు విగ్రహలకు కుటుంబ సభ్యులు నల్లా విష్ణుమూర్తి, నల్లా పవన్ కూమార్, స్థానిక నాయకులతో పూలమాలలు వేసి నివాళు లర్పించారు. తదుపరి అమలాపురం ఏరియా హాస్పిటల్ నందు పెషెంట్లకు, హరి మనోవికాస కేంద్రం, లూయి అంధుల పాఠశాల నందు పాలు, బ్రెడ్ అందించడం జరిగింది. తదుపరి నల్లా పవన్ మాట్లాడుతూ చంద్ర రావు ప్రజలందరికీ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాటం చేసి ఎన్నో విజయవంతమైన ఉద్యమాలు చేశారు అని ఇప్పటికీ ఆయన వారసులు గా కుటుంబ సభ్యులు అందరూ ఆయన అశయసాధన కోసం బడుగు బలహిన వర్గాల కు అండగా ఉంటాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లా విష్ణుమూర్తి, నల్లా పవన్ నల్లాచంద్రరావు తనయులు నల్లా అజయ్, సంజయ్, తిక్కిరెడ్డి సురేష్, గంపాల గోవింద్, దార్లంక సురేష్, గోకరకొండ సాయిధర్, రావూరి మధన్ రావూరి స్వామి, వింటే దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

# గంగన్నకు డొక్కా సీతమ్మ ఇన్స్పిరేషనల్ అవార్డు...



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం మండలం జనుపల్లి గ్రామానికి చెందిన గోకరకొండ గంగన్న స్వామికి కాకినాడ జేఎన్టీయూ యూనివర్సిటీ వీసీ ఛాంబర్‌లో మంగళవారం డొక్కా సీతమ్మ ఇన్స్పిరేషనల్ అవార్డును ప్రధానం చేశారు. ఈ అవార్డు పాన్ ఇండియా సోషల్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫౌండర్ డాక్టర్ అద్దంకి రాజా చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. గంగన్నస్వామి అమలాపురం పట్టణం నల్ల వంతెన వద్ద ఉన్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం చేసి ప్రతీ బుధవారం వందల మందికి అన్న దానం చేస్తున్నారు. అంతే కాకుండా ఎన్నో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు ఆయన నిర్వహిస్తున్నారు. భారతీయ జనతా పార్టీలో అంబేద్కర్ కోనసీమ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులుగా పనిచేస్తున్నారు. రైతుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారు. ఆయనకు ఈ అవార్డు దక్కడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. గంగన్నకి శుభాకాంక్షలు తెలిపారు.

# పోలీసుల అమర వీరుల త్యాగాలు వెలకట్టలేనిది

## జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి

















**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా శ్రేయస్సు, క్షేమం కోసం అహర్నిశలు రేయింబవళ్లు కృషి చేస్తూ విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమర వీరుల త్యాగాలు వెలకట్ట లేనివని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి పేర్కొన్నారు. పోలీసు అమర వీరుల దినోత్సవాన్ని పురస్కరించి కాకినాడ జిల్లా పోలీసు కేంద్ర కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం ఉదయం నిర్వహించిన పోలిసు అమరవీరుల సంస్మరణ సభా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన సభా సభికులను ఉద్దేశించి ప్రసంగించారు. జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వర రావులతో కలిసి అమర వీరుల స్థూపం వద్ద పూలమాలికలు ఉంచి పోలీస్ అమర వీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్మ్ రిజర్వ్ పోలీసు వందనం స్వీకరణ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21న భారత్-చైనా సరిహద్దుల్లోని అక్సాయ్ చిన్ వద్ద గస్తీ కాస్తూ, సియాచిన్ ప్రాంతాన్ని ఆక్రమించేందుకు మెరుపు దాడులకు దిగిన చైనా సైనికులను డీఎస్పీ కరమ్ సింగ్ నేతృత్వంలోని 10 మంది పంజాబ్ సీఆర్పీఎఫ్ బృందం సాహసోపేతంగా నిలువరించి వీరోచిత పోరాటంలో అమరులు అయ్యారు అన్నారు. స్ఫూర్తిదాయకమైన వారి సేవలను, త్యాగ నిరతిని, దేశభక్తిని స్మరిస్తూ ఏటేటా అక్టోబర్ 21 తేదీన పోలీసుల అమరవీరుల సంస్మరణ దినాన్ని పాటిస్తూ ఉన్నామని కలెక్టర్ అన్నారు. దేశంలో శాంతి భద్రతలను కాపాడుతూ, ప్రజా రక్షణకు ప్రాణాలను సైతం అర్పిస్తున్న పోలీస్ వీరుల సేవలు ఎనలేనివని అన్నారు. ఏ ఆపద వచ్చినా ప్రతి ఒక్కరికీ మందుగా గుర్తుకు వచ్చే ఆపద్బాంధవులు పోలీసులేనని కలెక్టర్ కొనియాడారు. దేశ, రాష్ట్రాభివృద్ధికి కీలకమైన శాంతి భద్రతలను పరిరక్షణకు పోలీసులు క్లిష్టమైన, ప్రమాదభరిత పరిస్థితుల్లో పనిచేస్తున్నారని, వారికి ప్రజలు అందరూ సదా కృతజ్ఞతలు అన్నారు. మారుతున్న సమాజంలో పోలీసులకు మరిన్ని కొత్త సవాళ్ళు ఎదురౌతున్నాయని, వాటిని సమర్ధవంతంగా అధిగమించేందుకు శారీరకంగా, మానసికంగా మరింత సుదృఢం కావాలని ప్రస్తుతం విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు కలెక్టర్ పిలుపును ఇచ్చారు. సేవ ద్వారా అనిర్వచనీయమైన ఆనందం, తృప్తి పొందే అవకాశం పోలీసులకే అధికమని, ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజల ఆదరాభిమానాలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీఎస్. శ్రీనివాసరావు ఈ సంవత్సరం దేశంలోను, రాష్ట్రంలోను విధి నిర్వహణలో మరణించిన పోలీస్ అమర వీరుల పేర్లను చదివి వినిపించారు. దేశ వ్యాప్తంగా 191 మంది పోలీసులు అమరులు కాగా, ఇందులో రాష్ట్రానికి చెందిన వారు ఐదుగురు ఉన్నారని తెలిపారు. పోలీస్ అమర వీరులను స్మరిస్తూ పెరేడ్ కమాండర్, ఇన్స్పెక్టర్ ఎం.ఎన్. మూర్తి నేతృత్వంలో సాయుధ పోలీస్ దళం స్మృతి పేరేడ్ నిర్వహించింది. అలాగే కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ రెండు నిమిషాలు మౌనం పాటించి పోలీస్ వీరులకు స్మృతి నివాళులు అర్పించారు. జిజిహెచ్ సూపరిండెంట్ డా.లావణ్య కుమారి, ఎస్బి డీఎస్పీ కెవివి సత్యనారాయణ, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు, పలువురు సిఐలు, ఎస్సైలు, అమర వీరుల కుటుంబాల సభ్యులు, కానిస్టేబుళ్లు, తదితరులు స్థూపం వద్ద పూలు ఉంచి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లాలో అమరులైన 14 మంది పోలీసు అమర వీరుల కుటుంబాల సభ్యులకు ఒక్కొక్కరికి రూ.10,000ల నగదు, పండ్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ బిందు మాధవ్ అందించారు. అలాగే వారితో ఆత్మీయంగా ముచ్చటించి పోలీస్ అమర వీరుల కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలియ జేసారు. పోలీసుల సేవలను, త్యాగాలను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన్న రాజప్ప, కాకినాడ నగర ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ కొనియాడారు. కలెక్టర్, ఎస్పీ, ప్రజాప్రతినిధులు జెండా ఊపి ప్రారంభించగా పోలీస్ అమర వీరులను స్మరిస్తూ పోలీసు కార్యాలయం నుండి భానుగుడి కూడలి వరకూ ర్యాలీని నిర్వహించారు.

## రత్నగిరిపై కార్తీకమాస మహోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంపై కార్తీకమాస మహోత్సవములు-2025 ను విజయ వంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అత్యంత భక్తి, శ్రద్ధలతో భక్త జన హితంగా చేపట్టేందుకు కృషి చేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణ అధికారి వీర్ల సుబ్బారావు ప్రకటించారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరం రత్నగిరి దేవస్థానంపై ఆయన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో కార్తీకమాస మహోత్సవాల ఏర్పాట్ల విశేషాలను వెల్లడించారు. బుధవారం 22 నుండి నవంబర్ 20 గురువారం వరకూ ఈ ఉత్సవాలను నిర్వహిస్తాం అన్నారు. 1 నవంబర్ శనివారం ఏకాదశి రోజున స్వర్ణ పుష్పార్చన, రాత్రికి గ్రామ సేవను, ఆదివారం 2 కార్తీక శుద్ధ ద్వాదశి రోజున "సత్యజ్యోతి" "తెప్పోత్సవము" శ్రీ స్వామి అమ్మ వార్లకు పావని పంపా సరోవరంలో నౌకా విహార యాత్ర, బుధవారం 5 న కార్తీక శుద్ధ పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ, పంపా హారతులు, జ్వాలాతోరణం, బుధవారం 12 న కార్తీక బహుళ అష్టమి రోజున శ్రీ సత్యనారాయణ స్వామి వారి పడిపూజ, గురువారం 13న కార్తీక బహుళ నవమి రోజున శ్రీ స్వామి వారికి మఖా నక్షత్రాభిషేకము, ఆయుష్ హెూమం, సత్య దీక్ష విరమణ, శనివారం 15 న కార్తీక బహుళ ఏకాదశి రోజున స్వర్ణ పుష్పార్చన, రాత్రికి గ్రామసేవను, మంగళ వారం 18 న కార్తీక బహుళ త్రయోదశి మాస శివరాత్రి రోజున శ్రీ స్మామివారి సన్నిధిలో జ్యోతిర్లింగార్చన కార్యక్రమాలను నిర్వహిస్తామని వెల్లడించారు. కార్తీక మాసలో ముఖ్య పర్వదినాల్లో రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రత్నగిరికి తరలి వచ్చి స్వామి వారిని దర్శించు కుంటారు. వ్రతాలను ఆచరిస్తారు. అందువల్ల భక్తుల రద్దీకి అనుగుణంగా సౌకర్యంగా ఉండేలా అన్ని ఏర్పాట్లను చేస్తున్నామని తెలిపారు. వ్రతం టికెట్లకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తూ ఎప్పటి కప్పుడు వ్రతాలు త్వరగా పూర్తయ్యే విధంగా ఏర్పాట్లను చేస్తున్నామని, దైవ దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా వారికి త్రాగు నీరు, మజ్జిగ, పాలను పంపిణీ చేస్తామని, ముఖ్య పర్వదినాల్లో భక్తులు కొరకు పులిహోర దద్దోజనం అన్నప్రసాదంగా వితరణ చేస్తామని ఆయన వెల్లడించారు. భక్తులు కొండపైకి వచ్చేందుకు, తిరిగి కొండ దిగువకు వెళ్లేందుకు రాకపోకలు, రవాణా అంతరాపు సమస్యలు లేకుండా చూసుకునే విధులను నిర్వర్తించే సెక్యూరిటీ సిబ్బందిని, రవాణా అధికారులను నియమించామని చెప్పారు. శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంపై కార్తీకమాస మహోత్సవములు-2025 ను విజయ వంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి వీర్ల సుబ్బారావు పాత్రికేయుల సమావేశంలో వెల్లడించారు.

## ఆర్థిక వనరుల సమీకరణపై కార్పొరేషన్ దృష్టి : ప్రత్యేక అధికారి, కలెక్టర్



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ నగర పాలక సంస్థ ఆర్థిక వనరులు సమీకరణపై ప్రత్యేక దృష్టి సారించామని నగరపాలక ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి పేర్కొన్నారు. కాకినాడ నగరంలో ఖాళీ స్థలాల పన్నులు, ప్రకటనల హెూర్డింగులు ఏర్పాటు చేసుకుని పన్నులు వసూలు చేసే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. నగరంలో ఉన్న తొమ్మిది పార్కుల నిర్వహణను బయటి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి వారు ఆదాయం సమకూర్చుకోవడంతో పాటు కార్పొరేషన్కు తగిన ఆదాయం వచ్చే విధంగా ఈ విధానాన్ని తీసుకొస్తున్నామని కలెక్టర్ చెప్పారు. మంగళవారం కాకినాడలోని శారదాంబ గుడి వద్ద ఉన్న నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ విలేకరులతో సమావేశం నిర్వహించారు. కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో ఇంటి పన్నులు, హెూర్డింగ్స్ వంటి వాటిపై ఆదాయాన్ని సమీక్షిస్తామని చెప్పారు. అలాగే నగరపాలక సంస్థలో ఖాళీగా ఉన్న స్థలాలలో చెత్త పేరుకుపోయిందని అక్కడ అనేక అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని వాటిని శుభ్రం చేయని ఆ స్థలాల యజమానులకు నోటీసులు ఇస్తామన్నారు. వారు స్పందించని పక్షంలో ప్రభుత్వ భూమిగా రికార్డులో నమోదు చేస్తామని చెప్పారు. కాకినాడ నగరంలో తొమ్మిది పార్కులు నిర్వహణ నిమిత్తం సంస్థకు లేదా వ్యక్తులకు దత్తత ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని దీనికి ఎవరైనా ముందుకు వస్తే తనకు తెలియజేయాలన్నారు. నవంబర్ 25వ తేదీ నుంచి లోగా స్పందించాలని లేని పక్షంలో తామే స్వయంగా క్షేత్రస్థాయిలోకి వెళ్లి ఖాళీ స్థలాలను స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. అంతేకాక ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో చిరు వ్యాపారం చేసుకునే వారికి అవకాశం కల్పించి అక్కడ వారు జీవించేలా అవకాశం కల్పించి కొన్ని నియమాలతో కూడిన బాధ్యతలను అప్పగిస్తామని చెప్పారు. సురేష్ నగర్ పార్కులో స్విమ్మింగ్ పూల్, జగన్నాథపురం వార్ఫ్ రోడ్డులో ఈట్ స్ట్రీట్ ఏర్పాటు చేస్తున్నామని దీని నిర్వహణ నిమిత్తం తనకు నేరుగా గాని లేదా నగరపాలక సంస్థ కార్యాలయంలో లిఖితపూర్వకంగా తెలియజేయాలని కలెక్టర్ షాన్ మోహన్ కోరారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, సహాయ కమిషనర్ కే శ్రీనివాసరావు, కార్పొరేషన్ ఎస్ఇ పి వెంకట్రావు, మున్సిపల్ ఆరోగ్యాధికారి దళే పృధ్వి చరణ్, డిసిపి ఎం కృష్ణారావు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## ఊరికి ఉపసర్పంచ్ "బొబ్బిలి వెంకన్నబాబు" ఉపకారం...!






**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పేరులో ఉన్న గొప్పతనం వ్యక్తిత్వంలో ఏ కొద్ది మందికో బహు అరుదుగా మాత్రమే ఉంటుంది. సొంత సొమ్ములతో ఊరికి ఉచిత రీతిన ఉపకారం చేయడం అంటే ఈ రోజుల్లో ముందుకు వచ్చే వారు కొద్ది మాత్రమే ఉంటారు. ఆ కొద్ది మందిలో ఆ ఉప సర్పంచ్ ఒకరు. రోజూ ఆ గుంతలు పడిన రోడ్డులో ప్రయాణిస్తున్న తన ప్రజలు పడుతున్న వెతలను ఆయన నిత్యం కళ్ళారా చూస్తూ సహించలేక పోయారు. ఇంకానా...? ఇంకెంత కాలం అని ఆయన ఆత్మసాక్షి నొచ్చుకున్నట్టుంది. ఎవరో వస్తారు... ఏదో చేస్తారని ఎదురు చూడకుండా అదేదే... తానే ఎందుకు చేయకూడదు అనుకున్నారు. అనుకున్నదే తడవుగా ఆ రోడ్డు మీద గుంతను తానే స్వయంగా దగ్గర ఉండి ఆగమేఘాల మీద పూడ్పించారు. ఆయన ఎవరో కాదు... కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరం పంచాయతీ ఉప సర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు. అన్నవరం గ్రామపంచాయతీ ఆర్యవైశ్య కొప్పనా రెడీమేడ్ వస్త్ర దుకాణం ప్రక్కన రోడ్డు కొంత కాలంగా గుంతలు పడి అటుగా వెళ్లే వాహనచోదకులు, పాదచారులకు చాలా ఇబ్బందికరంగా ఉంటోంది. ప్రయాణీకుల్లో చాలా మంది ఆ గుంతల్లో పడిపోయే వారు కూడా. దీనిని గమనించిన బొబ్బిలి వెంకన్నబాబు ఈ రోడ్డు గుంతలను పూడ్చే బాధ్యత జాతీయ రహదారుల నిర్వహణా సంస్థదా, రోడ్లు, భవనాలు శాఖదా, పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖదా అని మీనమేషాలు లెక్కించకుండా "ఒట్టి మాటలు కట్టి పెట్టు... గట్టి మేల్ తలపెట్టవోయ్" అన్న ప్రజాకవి గురజాడ అప్పారావు పంతులు మాటల అడుగు జాడలో వెంకన్నబాబు తానే పూనుకొని తన సొంత ఖర్చులతో ఆ గుంతలను సోమవారం సిమెంట్ కాంక్రీటుతో పూడ్పించారు. ముగ్గురు కూలీలను నియమించి, కాంక్రీటు మెటల్, ఇసుక, సిమెంట్లను తెప్పించి తగు మోతాదులో కలిపించి రోడ్డు గండిని పూడ్పించారు. పంచాయతీ, మండల ప్రజా పరిషత్తు ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ప్రయాణ భత్యాలను ప్రభుత్వం తొక్కి పెట్టడంపై ఉద్యమిస్తున్న తరుణంలో పైపాటు ఆదాయం లేని ఆయన తన రోజువారీ పాల వ్యాపారపు సొమ్ముల నుంచి సుమారు రూ. 5,000 లను వెచ్చించి ఈ రోడ్డు గుంతను అన్నవరం ఉప సర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు పూడ్పించడం తనకన్నా పెద్ద నేతలకు ఓ చెంప పెట్టు కాదా....! జనహితులు కొందరికైనా స్ఫూర్తి కాకుండా పోతుందా...??

# జాతీయ రహదారి విస్తరణ పనులు వేగవంతం చేయాలి

**నాలుగు రోడ్ల రహదారి ఆరు లైన్లుగా అభివృద్ధిపై సమీక్ష. - జిల్లా పరిధిలో 11కి.మీ. పనులపై సమీక్ష.**
**సమీక్షలో ప్రజా ప్రతినిధులు మెరుగైన సూచనలను చెయ్యడం జరిగింది : రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధి దేశ ఆర్థిక ప్రగతికి ప్రతిబింబమని, జాతీయ రహదారుల విస్తరణ ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి అన్నారు. 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదిత పనులను, ప్రజా ప్రతినిధులు వెల్లడించిన అంశాలను దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మంగళవారం రాజమహేంద్రవరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అనకాపల్లి, అన్నవరం, దివాన్ చెరువు సెక్షన్‌లోని ఎన్ హెచ్ -16 రహదారిని ఆరు లేన్ల పాక్షిక యాక్సెస్ నియంత్రిత హైవేగా విస్తరించే పనుల పురోగతిపై ఆమె సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్ హెచ్ ఏ ఐ), కన్సల్టెన్సీ సంస్థలు, జిల్లా అధికారులు, సంబంధిత విభాగాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ పురంధరేశ్వరి మాట్లాడుతూ "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా రహదారి సామర్థ్యాన్ని పెంచే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. అనకాపల్లి- దివాన్ చెరువు సెక్షన్ 6-లేన్ల విస్తరణ ప్రాజెక్ట్ తూర్పు గోదావరి, కాకినాడ, అనకాపల్లి జిల్లాల ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తుందన్నారు. రహదారుల ద్వారా పారిశ్రామిక, వాణిజ్య రంగాలు ఉత్సాహాన్ని పొందడంతో పాటు ప్రయాణ సమయం తగ్గి ఆర్థిక లాభాలు కలుగుతాయి" అని ఆమె పేర్కొన్నారు. 2027 పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని, రహదారి పనులు వేగవంతం చేయాలని ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి సూచించారు. "పుష్కరాల సమయంలో భక్తుల రాకపోకలు పెరగనున్న నేపథ్యంలో ట్రాఫిక్ రద్దీని నివారించడానికి ప్రాజెక్టు పనులను సమయానికి పూర్తి చేయడం అత్యవసరం. జాప్యం లేకుండా భూసేకరణ, అనుమతుల మంజూరు, శాఖల సమన్వయాన్ని వేగవంతం చేయాలి" అని ఆమె పేర్కొన్నారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను, ప్రజా ప్రతినిధుల సూచనలు పరిగణనలోకి తీసుకుని సమతుల్యమైన అలైన్‌మెంట్ తుది రూపు ఇవ్వాలని ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి అధికారులకు సూచించారు. ఆవ రోడ్డు, జెఎన్ రోడ్డు వద్ద అండర్ పాస్ రోడ్డు, ధవళేశ్వరం ప్రాంతంలో పనులు కోసం రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి కొన్ని ప్రతిపాదనలు ఇవ్వడం జరిగిందని ఎంపీ సమావేశంలో తెలియచేశారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, "తూర్పు గోదావరి జిల్లా పరిధిలో సుమారు 11కిలోమీటర్ల పొడవున ఈ జాతీయ రహదారి విస్తరించనుందన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా, భూసేకరణ, పునరావాస ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేస్తాం అన్నారు. పనుల్లో జాప్యం లేకుండా అన్ని శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.కృష్ణమూర్తి ప్రాజెక్ట్‌కు సంబంధించిన సమగ్ర వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రాజెక్ట్ మొత్తం 160.245 కి.మీ. పొడవున కొనసాగనుందని, ఇందులో తూర్పు గోదావరి జిల్లా భాగం రాజానగరం మండలం పరిధిలోని ఈస్ట్ గణుగూడెం, కలవచెర్ల, రాజానగరం, జగన్నాధపురం, వెంకటాపురం, నరేంద్రపురం, వెలుగుబంద గ్రామాల గుండా సాగుతుందని చెప్పారు. దివాన్ చెరువు వద్ద ప్రాజెక్ట్ ముగుస్తుందని, ప్రధాన జంక్షన్ల వద్ద ప్రమాద నివారణ చర్యల భాగంగా లైట్ వెహిక్యులర్ అండర్ పాస్‌లు, వాహన అండర్ పాస్‌లు, సురక్షిత క్రాసింగ్ మార్గాలు ప్రతిపాదించ బడ్డాయని వివరించారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణ రెడ్డి సమావేశంలో చక్రద్వారబంధం, వెలుగుబంద ప్రాంతాలకు వెళ్ళే రహదారి మార్గాలపై తీసుకోవలసిన జాగ్రత్తలు, నిర్మాణాల ప్రతిపాదనలపై స్పష్టంగా ప్రజా ప్రతినిధులు తమ అభిప్రాయాలు తెలియజేశారు. గామన్ బ్రిడ్జి నుంచి వచ్చే వాహనాలు రాజమండ్రిలో ప్రవేశించే క్రమంలో రాజానగరం, రాజమండ్రి వైపు ప్రత్యామ్నాయ రహదారి అనుసంధాన మార్గం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాజానగరం రాజమహేంద్రవరం కు సంబంధించిన జీరో పాయింట్, బ్లాక్ స్పాట్లు, కల్వర్ట్ పనుల నాణ్యత, మోరంపూడి ఫ్లైఓవర్ లైటింగ్, మ్యాజిక్ డ్రైన్స్ వంటి అంశాలపై కూడా దృష్టి సారించాలన్నారు. గౌరవ ప్రజా ప్రతినిధులు చేసిన ప్రతిపాదనలు పరిగణన లోనికి తీసుకుని పుష్కరాలకు ముందు అవసరమైన సదుపాయాలు పూర్తిచేయాలన్నారు. ,ల భద్రతా ప్రమాణాలు పాటిస్తూ రోడ్డు పనులు అత్యుత్తమ నాణ్యతతో పూర్తి చేయాలని ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, అడిషనల్ ఎస్పీ ఏ.వి. సుబ్బరాజు, జిల్లా రెవెన్యూ అధికారి టి. సీతారామ మూర్తి, టెక్నికల్ మేనేజర్ వి.వి. రామకృష్ణ, సల్మాన్ అన్సారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కే. భాస్కర్ రెడ్డి, మేనేజర్ గోదావరి గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్ పి.శ్రీకాంత్, పిసిబి ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ ఎం.శంకరరావు, జిల్లా మైన్స్ అధికారి డి.ఫణి భూషణ్ రెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ ఆర్. సత్యనారాయణ, ఏపీ ట్రాన్స్‌కో ఎస్.ఈ. టి.తిలక్ కుమార్, ఆర్ అండ్ బి ఎస్.ఈ. ఎస్‌బివి రెడ్డి, ఎడి మైన్స్ బి. లక్ష్మీనారాయణ, పి.ఆర్.ఎస్.ఈ.బాలకృష్ణ మరియు ఇతర శాఖల అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నాయకులు శవ రాజకీయాలు మానుకోండి..

**కులాల మధ్య చిచ్చు రేపవద్దు.. - కాపు కార్పొరేషన్ చైర్మన్‌గా ఒక్క విద్యార్థికి కూడా చేయూతనివ్వలేదు..**
**- జనసేన రాజమండ్రి ఇన్‌ఛార్జ్ అనుశ్రీ సత్యనారాయణ స్ట్రాంగ్ వార్నింగ్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ నాయకులకు బుద్ధి లేదని, ప్రశాంతంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ లో కులాల మధ్య చిచ్చుపెట్టడానికి మాజీమంత్రి అంబటి రాంబాబు,మాజీ ఎమ్మెల్యే, కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ జక్కంపూడి రాజా తదితరులు అనుచితంగా వ్యవహరిస్తున్నారని, వైసీపీ నాయకులు శవ రాజకీయాలు మానుకోవాలి అని జనసేన రాజమండ్రి ఇన్చార్జి అనుశ్రీ సత్యనారాయణ ధ్వజమెత్తారు. జనసేన సిటీ ఆఫీసులో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలంతా బాగుండాలని కోరుకునే జననాయకుడు, తమ పార్టీ అధినేత,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అని అన్నారు. రాజమండ్రి జనసేన సిటీ కొనియాడారు. కందుకూరులో రెండు కులాలకు చెందిన వ్యక్తుల మధ్య ఆర్థిక లావాదేవీలకు సంబంధించి జరిగిన వివాదాన్ని, హత్యను కులాల మధ్య చిచ్చు పెట్టడానికి వైసిపి నాయకులు శవ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. మొన్నటి ఎన్నికల్లో ప్రజలు చిత్తుగా ఓడించి 11 సీట్లకు పరిమితమితం చేసినా ఇంకా వైసిపి రాజకీయ పార్టీకి బుద్ధిరాలేదని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రశాంతంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కులాలమధ్య చిచ్చు పెట్టటానికి అనుచితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. స్పైడర్ సినిమాలో సైకో విలన్ సూర్య క్యారెక్టర్ మాదిరిగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి క్యారెక్టర్ ఉందని ఆయన విమర్శించారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ గా ఉన్నప్పుడు..మీరు ఏ ఒక్క విద్యార్థికైనా చేయూత ఇచ్చారా?ఒక విద్యార్థినైనా విదేశాలకు చదువు కోసం పంపించారా..?? అని నిలదీశారు. రాజకీయాల్లో బఫూన్ అంబటి రాంబాబు అని ఎద్దేవా చేశారు. ప్రజలు కూడా వైసీపీ నాయకుల నిజ స్వరూపాలు తెలుసుకోవాలని రాజమండ్రి జనసేన సిటీ ఇంచార్జ్ అనుశ్రీ సత్యనారాయణ కోరారు. మీడియా సమావేశంలో జనసేన నాయకులు, వీరమహిళ గంటా స్వరూపరాణి, శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానం చైర్మన్ వై.వి.డి.ప్రసాద్, విన్నా వాసు, గుణ్ణం శ్యామ్ సుందర్, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

# పాస్టర్‌ల మధ్య వివాదాన్ని పరిష్కరించాలి..

**దైవ సన్నిధిలో ఆరాధన జరగకుండా అడ్డుకోవడం సరికాదు - పోలీసుల అధికారుల దౌర్జన్యంపై ఎస్పీకి ఫిర్యాదు - ధవళేశ్వరం ఎన్ఎంఇ లూథరన్ చర్చి విశ్వాసులు**






**ధవళేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ధవళేశ్వరం మెయిన్ రోడ్డులోని ఎన్ఎంఇ లూథరన్ చర్చిలో ఆరాధన జరగకుండా పోలీసులు అడ్డుకోవడం సరికాదని ఆ చర్చి విశ్వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చర్చికి సంబంధించి ఇద్దరు పాస్టర్‌ల మధ్య వివాదం నడుస్తుందని, హైకోర్టులో కేసులు నడుస్తున్నాయని వెల్లడిరచారు. ఈ నేపథ్యంలో ఇద్దరు పాస్టర్‌లకు సంబంధం లేకుండా ఎన్ఎంఇ చర్చిలో సభ్యులే ఆరాధన నడుపుకునేందుకు ప్రయత్నించగా ఈనెల 19వ తేదీన ధవళేశ్వరం పోలీసులు ఒక పాస్టర్‌కు మద్దతుగా అక్కడకు వచ్చి ఆరాదనను అడ్డుకోవడం, మహిళల పట్ల దౌర్జన్యానికి పాల్పడటం చాలా హేయమైన చర్యగా పేర్కొన్నారు. మంగళవారం చర్చి గేటు వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో బీఎస్పీ జిల్లా అధ్యక్షులు పట్నాల విజయకుమార్(యేసు), చర్చి సభ్యులు వి.రోహిణి, ఆర్.మణికుమారి, కె.అరుణకుమారి, ఎం.అమ్మాజీ తదితరులు మాట్లాడారు. ప్రస్తుతం చర్చి పాస్టర్‌గా వ్యవహరిస్తున్న రెవరెండ్ అనిల్ కిరణ్, డాక్టర్ కిరణ్ బాబుల మధ్య గత ఏడాదిన్నరగా వివాదం నడుస్తుందన్నారు. వీరిద్దరు హైకోర్టుకు వెళ్ళడంతో అక్కడ వాజ్యం నడుస్తుందన్నారు. ఇటీవల లూదరన్ సంఘానికి సంబంధించి కార్యవర్గం కాలపరిమితి ముగిసిందని, లూదరన్ సంఘంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి, ఎన్నికలు జరిపేందుకు రిటైర్డు జడ్జి కురియన్‌ను నియమించడం జరిగిందన్నారు. అయితే ఈయనకు పాస్టర్‌లను బదిలీచేయడం గానీ, నియామకం చేయడం గానీ, డిస్మిస్, సస్పెండ్ చేసే హక్కుగానీ లేదన్నారు. అయితే గత మూడున్నరేళ్ళగా ఇక్కడ పనిచేస్తున్న అరుణ్‌కిరణ్‌ను డిస్మిస్ చేసి, కిరణ్‌బాబును నియమించడంతో వివాదం నెలకొందన్నారు. వీరు కోర్టుకు వెళ్ళడంతో అక్కడ వాజ్యం నడుస్తుందని, కోర్టు తీర్పును అనుసరించి, ఎవరికి అర్డర్ వస్తే వారు పాస్టర్‌లుగా వ్యవహరిస్తారని, అప్పటి వరకు సంఘ సభ్యులే చర్చిని నడిపించుకోవడానికి అవకాశం ఇవ్వాల్సిందిగా ఆర్డీవో, తహాశీల్దారులను కోరామన్నారు. ఈమేరకు ఈనెల 18న పోలీసు అధికారులకు కూడా విషయం చెప్పడం జరిగిందన్నారు. అయితే 19వ తేదీన ఆరాధన జరుగుతుండగా పోలీసులు చర్చిలోకి ప్రవేశించి, మహిళలని కూడా చూడకుండా దౌర్జన్యానికి పాల్పడ్డారని వారు ఆరోపించారు. రోప్‌పార్టీని తీసుకువచ్చి మరీ తమను బయటకు నెట్టివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కులంతో దూషించి దుర్భాషలు ఆడారని, అందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. చర్చిలో అంతా శాంతి యుతంగా ఉంటారని, ఇదే దౌర్జన్యం మరో మతానికి చెందిన దేవాలయంలో చేస్తే పరిస్థితి ఎలా ఉండేదని ప్రశ్నించారు. తమ మత విశ్వాసాలు, మనోభావాలు దెబ్బతినే విధంగా వ్యహరించిన ధవళేశ్వరం సిఐ, ఎస్సైలతో పాటు, పోలీసు సిబ్బందిపై మంగళవారం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్నట్లు వెల్లడిరచారు. చర్చిలో పాస్టర్‌ల మధ్య వివాదాన్ని పరిష్కరించాలని, లేదా ఇద్దరు పాస్టర్‌లను పక్కన పెట్టి మరో పాస్టర్‌తో ఆరాధన జరిగే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జివి శాంతి, గోడి మేరి, కరీమున్నీషా, ఆర్ ఇందిర, వి సుదర్శిణి, డి ఇందిర, ఎం ఉమాబాల, జి నిర్మలకుమారి, ఎన్ రాణి, జయలీల సిహెచ్, ఎస్ నాగమణి, ఎం నిర్మల, ఎం మెర్సి, ఆదిలక్ష్మి, కనకరత్నం తదితర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

### కాపులను విడదీసే

# వైకాపా కుట్రలు మానుకోవాలి

**పవన్‌పై అవాకులు చవాకులు పేలితే ఊరుకునేది లేదు : ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కందుకూరు ఘటన నేపథ్యంలో తమపార్టీ అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై వైసీపీ నాయకులు అవాకులు చవాకులు పేలితే ఊరుకునేది లేదని, పవన్ కళ్యాణ్ జోలికి ఎవరు వచ్చినా జనసైనికులు సహించబోరని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ ఫైర్ అయ్యారు. మంగళవారం మధ్యాహ్నం రాజమండ్రిలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కందుకూరు ఘటన వైసీపీ నాయకులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ఆపాదించడం దారుణమన్నారు. పవన్ జోలికి వస్తే వైసీపీ ఇంకా అధఃపాతాళానికి వెళ్లి పోతుందన్నారు. గతంలో కూడా పవన్ కళ్యాణ్ ను వ్యక్తిగతంగా టార్గెట్ చేశారన్నారు. వ్యక్తిగత కారణాలతో కందుకూరు ఘటన జరిగిందని, ఆ హత్యపై పవన్ కళ్యాణ్ ప్రగాఢ సానుభూతి తెలియజేశారన్నారు. అయితే వైసీపీ నాయకులు అంబటి, జక్కంపూడి రాజా, వంగవీటి నరేంద్ర కందుకూరు వెళ్లి కుల రాజకీయం చేశాదని విమర్శించారు.కాపు కార్పొరేషన్ చైర్మన్ గా పనిచేసి జక్కంపూడి రాజా కాపు విద్యార్థులకు ఏం చేశారని ఆయన ప్రశ్నించారు.దళితుడిని హత్యచేసి డోర్ డెలివరి చేసిన వ్యక్తిని జక్కంపూడి రాజా భుజాలపై ఎక్కించు కున్నాడని,దళితుడిని చంపితే నాడు వైసీపీ నాయకులు ఎందుకు స్పందించలేదన్నారు. కాపుల మధ్య విభేదాలు సృష్టించాలని చూస్తున్నారని,కూటమి ప్రభుత్వంలో కాపులను ఎవరూ విడదీయ లేరన్నారు. కాపులు, కమ్మ మధ్య విభేదాలు ఎప్పుడూ లేవని, గతంలో కాంగ్రెస్, ఇప్పుడు వైసీపీ కాపు, కమ్మల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారన్నారు. పవన్ కళ్యాణ్ పై కాపు నాయకుడు అనే ముద్ర వేయాలని చూస్తున్నారని, అన్ని కులాలు ఓట్లు వేస్తేనే పవన్ డిప్యూటీ సీఎం అయ్యారన్నారు.కూటమి గానే మరో మూడుసార్లు ఎన్నికలకు వెళ్తామని, తాము మరో పదిహేనేళ్ళు అధికారంలో ఉంటామని బత్తుల అన్నారు. వైసీపీ నాయకులు ఇప్పటికైనా శవ రాజకీయాలు మానుకోవాలని, కుట్రలు కుతంత్రాలకు దూరంగా ఉండాలన్నారు. వైసీపీ హయాంలో కాపులు అణచి వేతకు గురయ్యారని, కాపులు ఎన్నటికీ విడిపోరని, వారి మధ్య మంచి ఐక్యత ఉందన్నారు. వంగవీటి నరేంద్ర సైతం అనుచిత వ్యాఖ్యలతో వంగవీటి మోహన రంగ పరువు తీస్తున్నారన్నారు. కాపులను విడదీయాలను కుంటే నమ్మే స్థితిలో ఎవరూ లేరని, అలాగే మాజీ మంత్రి అంబటి రాంబాబు కూడా కేవలం తెలుగుదేశం, బీజేపి నాయకులను తిట్టడానికే పని చేశారని, అధికారంలో ఉన్నా లేకపోయినా పవన్ కళ్యాణ్‌ని తిట్టడమే అంబటి ప్రధాన ఎజెండాగా పెట్టుకున్నారన్నారు. ఇప్పటికైన వైసిపి నేతలు తమ ప్రవర్తనను మార్చుకోక పోతే జన సైనికులు సహించరని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్పొరేషన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్ పాల్గొన్నారు.

### కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యల

# పరిష్కారానికి కృషి : చైర్మన్ కుడుపూడి సత్తిబాబు



**మంగళగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి నావంతు కృషి చేస్తానని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు హామీ ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం ఉదయం మంగళగిరిలో జాతీయ తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవియెన్స్ కార్యక్రమంలో ఆయనతో పాటు రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి పాల్గొని, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. నివాస స్థలాలు, పించన్లు, వైద్య, ఆరోగ్యం ఇతర సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ ప్రజాభివృద్ధికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ఒక ఉన్నత లక్ష్యంతో పనిచేస్తోందని భరోసా ఇచ్చారు. గత వైఎస్ ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించిన నిర్లక్ష్య వైఖరి ఒక శాపంగా మారి ప్రజా సమస్యలు కుప్పలు కుప్పలుగా పెరిగి పోయాయని ఆరోపించారు. అలాంటి ప్రజా వ్యతిరేక విధానాల నుంచి ప్రజలను చంద్రబాబు గట్టెక్కిస్తున్నా రని చెప్పారు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని సత్తిబాబు ధైర్యం చెప్పారు.

# స్వర్ణాంధ్రను సందర్శించిన రాజ్యసభ సభ్యులు పాక




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ స్థానిక లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం రాజమండ్రి పర్యటనలో భాగంగా తెలిసిన మిత్రులారా స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం సందర్శించి వృద్ధులతో ముచ్చటించి వారి సాధకబాధకాలను స్వయంగా తెలుసుకున్నారు. స్వర్ణాంధ్ర గత 27 సంవత్సరాలుగా చేస్తున్న సేవలను రాంబాబు ఎంపీకి వివరించారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర కుట్టి శిక్షణ విద్యార్థినులు తయారుచేసిన గుడ్డ సంచులను పాక ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ నడుం కట్టాలని ప్రతి పౌరుడు బాధ్యతగా తీసుకుంటే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చు అన్నారు. ఈ సందర్భంగా పూలే సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపకులు నయనాల కృష్ణారావు స్వర్ణాంధ్ర రాంబాబులు రాజ్యసభ సభ్యులు సత్యనారాయణని దుస్సాలులతో సత్కరించి, జ్ఞాపికను బహుకరించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర మేనేజర్ హరికృష్ణ, మేగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# సాధన ఉచిత ఆరోగ్య శిబిరం విజయవంతం




**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం పురుషోత్తపట్నం గ్రామం సాధన మహిళా మండలి ఆశ్రమంలో జరిగిన మెగా ఆరోగ్య శిబిరం విజయవంతం అయింది. రాజమండ్రి గౌతమి నేత్రాలయం, రమా డెంటల్ కేర్, మధర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ వారి సహకారంతో కంటి పరీక్షలు, దంత పరీక్షలు, స్త్రీ శిశు ఆరోగ్య పరీక్షలు 250 మందికి నిర్వహించారు. పురుషోత్తపట్నం గ్రామంలో గల వృద్ధులు, మహిళలు, సాధన ఆశ్రమం డే-కేర్ లబ్దిదారులు, అంగన్వాడీ పిల్లలు, స్కూల్ విధ్యార్థులు శిబిరమునకు హాజరయ్యారు. మధర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఎండి డాక్టర్ ఉష కిరణ్, డాక్టర్ సౌమ్య, రమ డెంటల్ డాక్టర్ పవన్ కుమార్, గౌతమి నేత్రాలయం అఫ్తాల్మోలాజిస్ట్ కన్నాయమ్మ, మేనేజర్ అరుణ్ కుమార్, రమా డెంటల్ కేర్ మేనేజర్ బాబీ, పి.నరేంద్ర, మధర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ మెడికల్ కాంప్ ఇంచార్జ్ రాంబాబు, సందీప్ కుమార్, గోవింద్, దేవి, సోనాలిక, గోపి, బాబ్జీ తదితరులు కాంప్‌లో పాల్గొన్నారు. ఆరోగ్య శిబిరం అనంతరం హాస్పిటల్స్ డాక్టర్స్, సిబ్బంది ఉచిత సేవలకు గుర్తింపుగా వారిని సాధన చైర్మన్ శ్రీమతి పి.సుజ్ఞాన కుమారి వారిని ఉచిత రీతిన సత్కరించారు.

కె.వి.ఎస్.కళాశాల ఆధ్వర్యంలో

# పోలీస్ అమరవీరుల దినోత్సవ ర్యాలీ

**ముఖ్య అతిథిగా కోరుకొండ సీఐ వై.సత్య కిషోర్..**
**పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని విద్యార్థులకు అవగాహన..**



**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ప్రముఖ విద్యా సంస్థ కె.వి.ఎస్.డిగ్రీ కళాశాల, దాసరి తమ్మనదొర వొకేషనల్ కాలేజ్ సంయుక్త ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీ ఘనంగా నిర్వహించారు. గోకవరం పద్మప్రియ థియేటర్ సమీపంలోని కెవిఎస్ కళాశాల ప్రాంగణం నుంచి కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ వై.సత్య కిషోర్, కళాశాల కరస్పాండెంట్ కె.ప్రసాద్ జెండా ఊపి ర్యాలీకి ప్రారంభం పలికారు. ఆర్టీసీ కాంప్లెక్స్, దేవిచౌక్, ఆంజనేయస్వామి గుడి మార్గంగా గోకవరం పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ కొనసాగింది.అనంతరం విద్యార్థులను ఉద్దేశించి సీఐ సత్య కిషోర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలు అర్పించిన పోలీసుల త్యాగాలు మరువరానివి అన్నారు. విద్యార్థులు పోలీసుల సేవా భావాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై నాగమణి, సిబ్బంది సత్యనారాయణ, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ ఆర్టిఐ వింగ్ జిల్లా కార్యదర్శిగా న్యాయవాది గువేరా



**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజవర్గ వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఆదేశాలతో వైసిపి పార్టీ అనుబంధ విభాగాల నుండి నియోజకవర్గంలో పలువురు వైసిపి పార్టీ నాయకులుకు నామినేటెడ్ పదవులు వరించాయి. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం శరభవరం గ్రామానికి చెందిన న్యాయవాది ఆలూరు సత్యనారాయణ మూర్తి గువేరాకు వైసిపి ఆర్టిఐ వింగ్ జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. జిల్లా కార్యదర్శిగా నియమితులైన గువేరా మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఈ పదవిని ఎంపిక చేసిన ముద్రగడ గిరిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గువేరాకు మండలంలోని వైసీపీ మండల కన్వీనర్ రామిశెట్టి నాని, ఎంపీటీసీ అమరాధి కాశీ, ఆర్టీఐ వైసిపి మండల వింగ్ అధ్యక్షుడు రామిశెట్టి దొరబాబు, కత్తిపూడి సొసైటీ మాజీ చైర్మన్ పప్పల సూర్య చక్ర రావు, గొల్లపల్లి దొరబాబు, గుర్రాజు, అభినందనలు తెలిపారు.


# జన్మదినాన దుప్పట్లు పంచిన మాజీ ఎమ్మెల్యే వరుపుల



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఇంఛార్జి వరుపుల సుబ్బారావు తన జన్మదినాన్ని మంగళవారం నిరా డంబరంగా జరుపుకున్నారు. ఉదయాన్నే లింగంపర్తిలోని తన స్వగృహంలో కేక్ కట్ చేసుకుని జన్మదినాన్ని జరుపు కున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దర్శనార్థం ఉదయం 7.30 గంటలకు శ్రీ రత్నగిరికి చేరుకున్నారు. ఆయన సతీమణి వెంకటలక్ష్మి, కుమారులతో కుటుంబ సమేతంగా శ్రీసత్య దేవుడిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం 8.30 గంటలకు స్థానిక రాఘవేంద్ర రెసిడెన్సిలో కొద్దిపాటి తన అనుచరుల సమక్షంలో కేక్ కట్ చేసుకుని జన్మదిన వేడుకలు జరుపు కున్నారు. ఈ సందర్భంగా సుమారు 60 మంది నిరుపేద వృద్దులకు దుప్పట్లను వరుపుల సుబ్బారావు పంపిణీ చేసారు. తర్వాత మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఇప్పటికే అందరికీ కొన్ని పాత విషయాలపైనే సరికొత్తగా కొత్తగా మారో మారు చెప్పారు.

# డ్రోన్ కెమెరాలతో ఆకతాయిలా ఆటకట్టు..

**జిల్లా ఎస్పీ బిందుమాధవ్**



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, నేరములు అరికట్టుటలో భాగంగా ఓపెన్ డ్రింకింగ్ , డ్రంక్ అండ్ డ్రైవ్, ఆకతాయిలు, ఈవ్ టీజింగ్‌కు పాల్పడే అసాంఘిక వ్యక్తులపై కట్టుదిట్టమైన చర్యలు చేపట్టుతున్నట్లు జిల్లా ఎస్.పి బిందు మాధవ్ వారి ఆదేశాల మేరకు, అత్యాధునిక డ్రోన్ కెమెరాలతో నిఘా కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల సహాయంతో తుని టౌన్ ఏరియా తుని టౌన్ పోలీస్ స్టేషన్ లిమిట్స్, ఏవీ నగరం గ్రామం తొండంగి పిఎస్ లిమిట్స్, జగ్గంపేట హై స్కూల్ జగ్గంపేట పిఎస్ లిమిట్స్ లలో నిఘా చేపట్టారు. మహిళలు, బాలికలకు భద్రత కల్పిస్తూ, వారికి సురక్షితంగా ఉన్నామనే నమ్మకాన్ని కలిగించేందుకు పోలీస్ విభాగం ఈ చర్యలు చేపట్టింది. డ్రోన్ కెమెరాల ద్వారా ఆకతాయిలను గుర్తించి, తగిన చర్యలు తీసుకునేందుకు సన్నాహాలు కొనసాగుతున్నాయని జిల్లా ఎస్పీ తెలియజేసారు.

## నేతాజీ వీరోచిత పోరాటంతో

# నేడు దేశ స్వాతంత్ర్యం సాధించాం..

**చారత్రిక భారత స్వాతంత్ర్యన్ని సాధించుకున్నాం.. - నేతాజీ వీరోచిత పోరాటంతో నేడు దేశ స్వాతంత్రం సాధించాం..**
**నేతాజీ సుభాష్ చంద్రబోస్ సారథ్యంలో పూర్తి స్వేచ్ఛను సాధించుకున్న రోజు అక్టోబర్ 21**
**జాతీయ జెండాను ఆవిష్కరించిన మేడా శ్రీనివాస్ - ఆర్పిసీ కార్యాలయంలో ఘనంగాస్వాతంత్ర దినోత్సవ వేడుకలు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నేతాజీ సుభాష్ చంద్రబోస్ వీరోచిత పోరాటంతో 1943 అక్టోబర్ 21న అధికారికంగా ప్రకటించుకున్న భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకను రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) ప్రధాన కార్యాలయం వద్ద అర్పిసి అధినేత మేడా శ్రీనివాస్ సారథ్యంలో అత్యంత ఘనంగా నేతాజీ సాధించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకను జరుపుకున్నారు. ముందుగా జాతీయ జండాను మేడా శ్రీనివాస్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం భారతదేశం కోసం నేతాజీకి వెన్ను దన్నుగా నిలిచి ఆత్మ బలిదానానికి సిద్ధపడిన యోధురాలు"నీరా ఆర్యా "ను, స్వాతంత్ర్యం అనంతరం భారతదేశం కోసం పాకిస్తాన్ జైల్లో చిత్రహింసలు అనుభవించి దేశం కోసం ప్రాణాలు విడిచిన రవీంద్ర కౌశిక్‌లను స్మరించుకున్నారు. నేతాజీని స్ఫూర్తిగా తీసుకుని ఎందరో ఆత్మబలిదానాలతో సాధించుకున్న స్వాతంత్ర్యం దినం 1943,అక్టోబర్ 21తేది అని, ఈ రోజునే నేతాజీ సారథ్యంలో అధికారికంగా భారతీయ పాలన అధికారంలోకి వచ్చినది. ఈ రోజు భారతీయుల వీరోచిత పోరాటాలకు, నేతాజీ గుండె ధైర్యానికి బ్రిటిష్ పాలకులు భయపడి పారిపోయిన గొప్ప రోజు నేటి రోజు అప్పటి కొంతమంది భారతీయ బ్రిటిష్ వారి మోచేతుల నీళ్లు త్రాగిన ఆ నాటి కాంగ్రెస్ అధినేతలు భారతీయుల ప్రాణ త్యాగాలతో నేతాజీ ప్రకంపనలతో సాధించిన స్వాతంత్రియాన్ని ఎలాగైనా మరుగున పెట్టాలి అని బ్రిటిష్ వారితో కుట్రలు సాగించి ఈ వీరోచిత దినంను చరిత్ర పుటల్లో కనుమరుగయ్యే విధంగా కుట్రలు చేసారు. నేతాజీ పేరు బ్రిటిష్ వెన్నులో వణుకు పుట్టించిన కారణంగా ఆ నాటి కాంగ్రెస్ నేతలుగా వున్న గాంధీ - నెహ్రూ లే స్వాతంత్ర్యం భారతీయులకు రావటానికి కారణం అని బ్రిటిష్ వారి రికార్డులలో తప్పును ఒప్పుగా నమోదు చేయించారు. నేటికి సాధించు కున్నటువంటి స్వాతంత్ర్యం ను విస్మరిస్తు గాంధీ - నెహ్రూలు ప్రకటించిన స్వాతంత్ర్య దినంను వేడుకగా జరుపుకుంటున్నాము. సాధించుకున్నటువంటి స్వాతంత్ర్యంను మరిచిపోతున్నాము. ఇక నుండి ప్రతి భారతీయుడు నేతాజీ సారథ్యంలో పూర్తి స్వేచ్ఛను సాధించుకున్న రోజు అక్టోబర్ 21న స్వాతంత్ర్య వేడుకలు జరుపుకోవాలని, ప్రభుత్వం కూడా ఈ వాస్తవ వీరోచిత చరిత్రను గుర్తించి స్వాతంత్ర్య వేడుక దినంగా ప్రకటించాలి. ఈ రోజునే సెలవు దినంగా ప్రకటించాలని, నేతాజీ స్ఫూర్తితో భారతీయులు అందరు దేశం కోసంమే బ్రతకాలి, దేశం కోసమే మరణించాలి అనే ఉగ్గు పాలను జన్మతః బిడ్డలకు తల్లిదండ్రులు ఊపిరిగా నింపాలని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. యావత్ అఖండ భారతదేశంలోనే తొలి సారిగా నేతాజీ సారథ్యంలో సాధించుకున్న వాస్తవ స్వాతంత్ర్య దినోత్సవాన్ని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజమండ్రి లో జరుపుకుంటున్నందుకు మిక్కిలి సంతోషంగా వుందని, ఈ ఘటన రాబోవు చరిత్ర పుటల్లో నిలిచిపోతుందని, ఈ వీరోచిత స్వాతంత్ర్య దినం 82 ఏళ్ల అననంతరం తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో జరుపుకుంటున్న ఈ చారిత్రిక అంశం ప్రపంచ చరిత్రలో లిఖించ బడుతుందనటంలో ఏ మాత్రం సందేహమే లేదు. రాజకీయాలకు అతీతంగా ప్రతి భారతీయుడు ఈ గొప్ప దినంను స్వాతంత్ర్య దినంగా ఆచరించాలని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ మన భారత పౌరులను కోరారు. అనంతరం బ్రిటిష్ వారిని గజ గజ లాడించిన భారతీయ యోధుడు శ్రీ శ్రీ నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్ర పటం వద్ద గౌరవ అంజలి ఘటించి పౌర వందనాలు సమర్పించారు. వందేమాతర గీతాలాపనతో దేశ భక్తిని చాటుకున్నారు. దేశం కోసం బ్రిటిష్ వారితో అంతిమ పోరాటం సాగించి స్వేచ్ఛను ప్రసాదించిన ఆ మహా యోధుడు మరణం ఒక మిస్టరి. ప్రజల హృదయాల్లో నేటికి జీవించి ఉన్నటువంటి ఒక మహా నేత సుభాష్ చంద్ర బోస్. యావత్ ప్రపంచంలోనే వుండరు. నేతాజీ వంటి మరో పోరాట యోధుడు నేటికి లేరని, నేతాజీ భారతీయుల ప్రతిష్టకు ఐ కాన్ కు మించిన ఐ కాన్ వంటివారు. భారతదేశ చరిత్రలో నేతాజీతో పాటుగా ఎందరో దేశం కోసం ప్రాణాలు అర్పించి బ్రిటిష్ వాళ్ళను ప్రాణ భయంతో పారిపోయేలా చేసారని, ఆ నాటి కాంగ్రెస్ వాళ్ళ కుట్రలతో ఆ పోరాట యోధుల చరిత్రను, వారి పేర్లను చరిత్ర పుటల్లో లేకుండా చేసారు . ఆ నాడు బ్రిటిష్ వారు మన పౌరులపై ఆధిపత్యం చెలాయిస్తే, గాంధీ, నెహ్రూలు మతోన్మాద చర్యలకు అగ్గి రాజేసి బ్రిటిష్ వారి కుట్రలకు పరోక్షంగా సహకరించరనే ఆరోపణలు బలంగా ఉండేవి. నేతాజీ మరణం సహజం కాదనేది యదార్థం అని మెజార్టీ భారతీయుల విశ్వాసం అని ఆయన కన్నీటి పర్యాంతం అయ్యారు. అనంతరం పార్టి సెక్యులర్స్ , శ్రేణులు సాధించుకున్న స్వాతంత్ర్య దినోత్సవ దినం గొప్పతనంను స్మరించుకుని స్వీట్లు పంచుకున్నారు. భారతీయుల త్యాగాలను చర్చించుకున్నారు. ఈ చారత్రిక భారత స్వాతంత్ర్య వేడుకలో అర్పిసి సెక్యులర్స్ సర్వశ్రీ పెండ్యాల కామరాజు, కాసా రాజు, డివి రమణమూర్తి, లంక దుర్గా ప్రసాద్, బర్ల ప్రసాద్, ఎమ్‌డి హుస్సేన్, దుద్దే సురేష్,వర్ధనపు శరత్ కుమార్, వాడపల్లి జ్యోతిష్, గుద్ల సాయి దుర్గా ప్రసాద్, బసా సోనియా, కొల్లి సత్యనారాయణ, ద్వాదశి శ్రీనివాసరావు, కాకర ప్రసాద్, దోషి నిషాంత్, వల్లి శ్రీనివాసరావు, యర్రా బాల మురళి కృష్ణ, చల్లా సాంబశివరావు, ఖండవల్లి శ్రీనివాసరావు, కూరాకుల నాగమణి, మీసాల హైమావతి, మాసా అప్పాయమ్మ, నాగూరు దుర్గ, వాసంశెట్టి శిరీషా, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా కాపు వన సమారాధన.. : రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ





**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆహ్లాదకరమైన వాతావరణంలో వచ్చే నెల నవంబర్ 16, కార్తీక మాసం ఆఖరి ఆదివారం కాపు సద్భావన సంఘం ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే, సంఘ పెద్దలు పంతం నానాజీ స్పష్టం చేశారు. స్థానిక ఆర్టీవో ఆఫీస్ రోడ్‌లో గల శుభం కాపు కళ్యాణ మండపంలో సంఘ గౌరవ అధ్యక్షులు బసవా ప్రభాకర్ రావు ప్రధాన కార్యదర్శి చిట్నీడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తీకమాస కాపు వన సమారాధన కమిటీ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే పంతం నానాజీ ముఖ్య అతిథిగా విచ్చేసి జీవితకాల సభ్యులు, కార్యవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు నాయకులు పాల్గొనాలి అని ఈ కార్తీక వన భోజన సమావేశంలో రాజకీయ ఉపన్యాసాలు ఉండకుండా చూడాలి అని పిలుపునిచ్చారు. సంఘ కార్యవర్గం ప్రతి 2 సంవత్సరాలకు ఒకసారి మార్పు చేయాలని నూతన కార్యవర్గం ఏర్పాటు చేసినట్లు అయితే నూతన ఆలోచనలు అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

## మహిళలకు ఆర్థిక సహాయం చేసిన

# మంత్రి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్న ఒక మహిళలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.15 వేలు ఆర్థిక సహాయం అందించారు.వివరాల్లోకి వెళితే పి గన్నవరం మండలం ముక్తేశ్వరం గ్రామంకు చెందిన జనిపల్లి సంధ్య భర్తను కోల్పోయి పిల్లలతో ఆర్థిక ఇబ్బందుల్లో సతమతమవుతుంది.ఈ విషయం తెలుసుకున్న మంత్రి సుభాష్ సంధ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.15 వేలు చెక్కును తక్షణ సహాయంగా అందించారు. ఇద్దరు పిల్లలకు మంచి విద్యాబుద్ధులు చెప్పించి వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించారు. పిల్లల చదువుకు తోడ్పాటు అందిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.మంత్రి సుభాష్ సేవ గుణానికి ఆ మహిళ కృతజ్ఞతలు తెలిపింది.

# ఘనంగా తోట పృధ్విరాజ్ పుట్టినరోజు వేడుకలు..





**మండపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** శాసనమండలి సభ్యులు తోట త్రిమూర్తులు తనయుడు, వైసిపి యువ నాయకుడు తోట పృధ్విరాజ్ జన్మదిన వేడుకలు మండపేట అసెంబ్లీ నియోజకవర్గంలో వాడవాడల జరిగాయి తొలుత విజయలక్ష్మి నగర్ లో ఉన్న వైసీపీ కార్యాలయంలో ఆయన అభిమానులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి విగ్రహం వద్ద పార్టీ పట్టణ అధ్యక్షులు పిల్లి శ్రీనివాస్, కౌన్సిలర్ మొండి భవాని మురళి, మందపల్లి రవి, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు టపా గోవిందరావు లు ఆధ్వర్యంలో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. యువకులకు ఆశాజ్యోతి మంచి మనసున్న సౌమ్యుడు తోట పృధ్విరాజ్ అని కొనియాడారు. అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైయస్సార్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ దూలం వెంకన్న బాబు ఆధ్వర్యంలో సూర్య కన్వెన్షన్ హాల్ నందు పుట్టినరోజు వేడుకలు జరిగాయి ముఖ్యఅతిథిగా తోట త్రిమూర్తులు పాల్గొని కేక్ కట్ చేసి అభిమానులకు పార్టీ కార్యకర్తలకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా దూలం వెంకన్న బాబు మాట్లాడుతూ నిండు నూరేళ్లు ఆయుర్ ఆరోగ్యాలతో వర్ధిల్లాలని మరెన్నో పుట్టినరోజు పండుగలు జరుపుకోవాలని, ప్రజా క్షేత్రంలో ఉన్నత స్థాయి పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.పృథ్వీరాజ్ కు జిల్లాలో అన్ని గ్రామాల్లో అభిమానులు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, సీనియర్ నాయకులు వేగుళ్ళ పట్టాభి రామయ్య చౌదరి, మున్సిపల్ చైర్మన్ పతివాడ నూక దుర్గారాణి,మాజీ ఎ ఎమ్ సి చైర్మన్ సిరిపురపు శ్రీను,ఐ టీ వింగ్ కన్వీనర్ యారామటి వెంకన్నబాబు, మున్సిపల్ మాజీ కో ఆప్షన్ సయ్యద్ రబ్బాని, టౌన్ ముస్లిం మైనార్టీ కన్వీనర్ షేక్ గౌస్ మొహిద్దీన్,కేశవరం ఎంపీటీసి సభ్యులు అన్నందేవుల కృష్ణ, సలాది శివ, మండల ఉప అధ్యక్షులు అద్దంకి రమణ, జిల్లా విద్యార్థి విభాగం వైస్ ప్రెసిడెంట్ కూసు దొరజీ, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి అబ్బిరెడ్డి వీర్రాజు, వుండమట్ల శ్రీ శ్రీ, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలీసులకు టఫ్ టాస్క్ ఇచ్చిన చంద్రబాబు



ఏపీలో పోలీసు అమరవీరుల దినోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. మంగళగిరిలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఏపీ పోలీసుల పనితీరుని మెచ్చుకుంటూనే వారికి దిశా నిర్దేశం చేశారు. ఏపీ పోలీసులు దేశానికే ఒక బ్రాండ్ అని వారి ఘనతను గుర్తు చేస్తూనే ఇంకా పెద్ద చాలెంజ్ లను ఎదుర్కోవాలని కోరారు. అంతే కాదు రానున్న కాలం టెక్నాలజీ వాటికి అనుగుణంగా పెరిగిపోతున్న నేరాలు ఒక పెను సవాల్ కాబోతున్నాయని వాటిని కూడా అంతే సమర్థతతో పోలీసులు చేదించి సాధించాలని ముఖ్యమంత్రి కోరారు.

**ఇంటెలిజెంట్ క్రైమ్స్ అంటూ :** ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటెలిజెంట్ క్రైమ్స్ అన్న పదం వాడారు. అవును టెక్నాలజీ పెరిగిన తరువాత ఈ కొత్త రకం నేరాలు ఆవిష్కృతం అవుతున్నాయి. నేరస్తుడు ఎక్కడో ఉంటాడు, నేరం మాత్రం జరిగిపోతుంది, మూలాలు కనుగొనాలీ అంటే చాలానే చేయాలి, దాంతో ఈ తరహా నేరాల పట్ల పూర్తిగా అలెర్ట్ గా ఉండాలని బాబు పోలీస్ శాఖను కోరారు. ఇంటెలిజెంట్ క్రైమ్స్ విషయంలో నేరస్తుల కంటే పోలీసు యంత్రాంగం ముందుండాలని బాబు కోరారు. ఆ విధంగా చేయగలిగితేనే వీటిని పూర్తిగా అరికట్టగలమని అన్నారు.

**రాజకీయ ముసుగులో :** ఇది చాలా టఫ్ చాలెంజ్ గా పోలీసుల ముందు ఉంది. నిజానికి చెబితే రాజకీయ పలుకుబడితోనే ఎక్కువగా నేరాలు జరుగుతూ ఉంటాయి. ఇది ఈ రోజున కూడా అయితే పుట్టలేదు, చాలా కాలంగానే ఉంది. అయితే ఇటీవల కాలంలో అధికం అయింది. నేరాలు చేసేవారికి ఒక అండ దొరుకుతోంది. వారు పైకి ముసుగు వేసుకుంటున్నారు. లోపల జరిగేది వేరుగా ఉంటోంది. ఏమంటే రాజకీయ వేధింపులుగా చెబుతున్నారు. కానీ జరగాల్సిన అకృత్యాలు తెర వెనక సాగిపోతూంటాయి. ఈ విధంగా రాజకీయ ముసుగు వేసుకుని నేరాలు చేసే వారి ముసుగు తొలగించాల్సిన అవసరం ఉందని చంద్రబాబు పోలీసులకు సూచించారు. వీటిని అరికట్టకపోతే ఏపీలో లా అండ్ ఆర్డర్ బ్రేక్ అవుతుందని అందువల్ల పూర్తి అప్రమత్తతతో ఉండాలని ఆయన హెచ్చరించారు.

**ట్రెడిషనల్ డ్యూటీ మైండ్ సెట్ నుంచి :** అయితే ఇది ఏమంత సులువు అయితే కాదు, టఫ్ జాబ్, ఎందుకంటే కరవమంటే కప్పకు కోపం విడవమంటే పాముకు కోపం అన్నట్లుగా రాజకీయాల వెనక ఉన్న నేరాలు ముసుగు వ్యవహారాలు ఉంటాయి. వీటి విషయంలోనే ఎక్కువగా పోలీసులు ఆందోళన చెందుతూంటారు, వీటి కారణంగానే వారు ఇబ్బందులు పడడమే కాకుండా విమర్శలు ఎదుర్కొంటూంటారు. కానీ ఏపీలో అంతా సజావుగా ఉండాలంటే పోలీసులు తమ విధులను కచ్చితంగా నిర్వహించడమే కాకుండా ట్రెడిషనల్ డ్యూటీ మైండ్ సెట్ నుంచి బయటకు వచ్చి మరింత స్మార్ట్ గా వ్యవహరించాలని చంద్రబాబు కోరారు.

**ఇన్విజిబుల్ పోలీసింగ్ అవసరం :** విజిబుల్ పోలీసింగ్ గురించి అందరికీ తెలిసిందే. ఎదురుగా ఖాకీ డ్రస్ తో సిబ్బంది ఉంటారు. కానీ ఇన్విజిబుల్ పోలీసింగ్ గురించి కూడా తెలుసుకోవాలి. పోలీస్ ప్రత్యక్షంగా లేకపోయినా నేరాలను అదుపు చేయడం. పోలీసు ఎల్లెడలా ఉండేలా చేయడం, ప్రజలకు ఆ విధగా భరోసా కల్పించడమే కాదు నేరస్తులకు హెచ్చరికగా వ్యవహరించడం. ఈ తరహా పోలీసింగ్ అతి ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. అందుకోసం టెక్నాలజీని పోలీసులు విస్తృతంగా వాడుకోవాలని ఆయన సూచించారు.

**సీసీ కెమెరాలతో :** ఇక చూస్తే అంతటా నేరాల రూపం స్వభావం తీరు అన్నీ మారుతున్నాయని బాబు చెప్పారు. పెద్ద ఎత్తున సైబర్ క్రైమ్, వైట్ కాలర్ నేరాలు పెరుగుతున్నాయని ఆయన అందోళన వ్యక్తం చేశారు. అందుకే ప్రభుత్వం ఈ విషయంలో ప్రత్యేక ఫోకస్ పెట్టిందని ఆయన చెప్పారు. రాష్ట్రంలో ప్రతి 55 కిలోమీటర్లకు ఒక సీసీ కెమెరా ఏర్పాటు చేస్తున్నామని సీఎం వెల్లడించారు. అంతే కాకుండా డ్రగ్స్, గంజాయి, ఎర్ర చందనం మాఫియాలను గుర్తించి పూర్తి స్థాయిలో అణచివేస్తున్నామని ఆయన వివరించారు. ఓల్డ్ థాట్స్ ని పకకన పెట్టేసి పోలీసులు కూడా కొత్త వెర్షన్‌గా మారాలని బాబు కోరారు.

**పెట్టుబడులకు లింక్ :** ఏ రాష్ట్రంలో అయితే లా అండ్ ఆర్డర్ కరెక్ట్ గా ఉంటుందో అక్కడే పెట్టుబడులే పెద్ద ఎత్తున వస్తాయని బాబు చెప్పారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ వచ్చింది అంటే దానికి కారణం సమర్థ నాయకత్వంతో పాటు ప్రశాంత వాతావరణం అన్నారు. ఇక శాంతి భద్రతలతోనే అభివృద్ధి, సంక్షేమం ముడిపడి ఉంటాయని బాబు చెప్పారు. రాష్ట్రంలో అలజడులు ఉంటే పెట్టుబడులు రావని అందుకే ఏపీలో క్రైమ్ రేట్‌ను అణచివేయడంలో తాను ఎక్కడా ఎప్పుడూ రాజీపడే ప్రశ్నే లేదని చంద్రబాబు స్పష్టం చేశారు. అదే సమయంలో ఏపీలో అయిదు కోట్ల మంది జనాల రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెడుతున్నది పోలీసులేనని ఆయన కితాబు ఇచ్చారు. మొత్తానికి చూస్తే కనుక ఏపీ పోలీసుల సామర్థ్యాన్ని కొనియాడుతూనే వారు మరింత అప్డేట్ గా ఉండాలని టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని బాబు దిశా నిర్దేశం చేశారు.

# దీపావళి వేళ వెలిగిన బాబు



హిందూ సంప్రదాయాల పట్ల తెలుగు సంస్కృతి పట్ల ఎంతో భక్తి విశ్వాసాలు చూపించే చంద్రబాబు పూజాకార్యక్రమాలు ఎంతో నిష్టగా పాల్గొంటారు. టీడీపీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు దీపావళి వేడుకలను ఉండవల్లిలోని తన నివాసంలో ఘనంగా జరుపుకున్నారు. తన సతీమణితో కలసి ఆయన ఎంతో ఆనందంగా ఈ ఉత్సవాలలో పాల్గొన్నారు. సంప్రదాయం ప్రకారం సాయంత్రం భువనేశ్వరితో కలసి ఆయన లక్ష్మీ పూజ నిర్వహించారు. ఆ తరువాత తన ఇంట దీపావళి సంబరాలను ఘనంగా నిర్వహించారు.

**సతీమణితో కలసి :** భువనేశ్వరితో కలసి ఆయన కాకరపువ్వొత్తులు కాల్చారు. ఆ దంపతులు ఎంతో హుషారుగా బాణాసంచా కాలుస్తూ సందడి చేశారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి, యాభై ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న దిగ్గజ నేత ఏడున్నర పదుల వయసు ఉన్న బాబు చిన్న పిల్లవారి మాదిరిగా మారిపోయి దీపావళి సంబరాలలో పాల్గొనడం అందరికీ ఆశ్చర్యపరచింది. చైనా నియంత్రణ.. అమెరికా హెచ్చరిక.. వాణిజ్య యుద్ధంలో మరో కోణం భక్తి శ్రద్ధలతో : హిందూ సంప్రదాయాల పట్ల తెలుగు సంస్కృతి పట్ల ఎంతో భక్తి విశ్వాసాలు చూపించే చంద్రబాబు పూజాకార్యక్రమాలు ఎంతో నిష్టగా పాల్గొంటారు. అదే విధంగా దీపావళి రోజున కూడా ఆయన అదే నిబద్ధతను పాటించారు. అంతే శ్రద్ధతో ఆయన పూజలో పాల్గొనడమే కాదు దీపావళి పండుగలోనూ హుషారు చేశారు.

**అపురూప దృశ్యం :** భార్య భువనేశ్వరి బాబు కలసి ఒకే కాకరపువ్వొత్తిని కాల్చడం చూసిన వారికి ఎంతో అపురూపంగా అనిపించింది. దంపతులు అంటే ఇంతటి ప్రేమాభిమానలు కలిగి ఉండాలని ఈ తరం వారికి ఈ విధంగా ఒక అద్భుతమైన సంకేతాన్ని ఇస్తున్నట్లుగా ఉందని చెబుతున్నారు. తాను రాష్ట్రానికి రాజు అయినా తన ఇంట్లో మాత్రం సతీమణిని కుటుంబాన్ని ఎంతగా గౌరవించి ప్రేమిస్తారో బాబు మరోసారి చాటి చెప్పారు. మూడేళ్ల వరకూ నో వీసా.. అమెరికా నిర్ణయంతో భారతీయులకు నిరాశ కూటమి అధినేతగా : ఇక చంద్రబాబు ప్రభుత్వ అధినేతగా కూటమి పెద్దగా ఈ పదహారు నెలల కాలంలో రాష్ట్రంలో ఎంతో అభివృద్ధిని సాధించారు. అంతే కాదు సంక్షేమ కార్యక్రమాలను కూడా కొనసాగిస్తున్నారు. తనకు ఉన్న అనుభవంతో తనకు ఉన్న ఉత్సాహం అసక్తితో రాష్ట్రాన్ని ముందూ తీసుకుని పోతున్నారు ఎడతెరిపి లేకుండా పనులతో ప్రతీ రోజూ ఎంతో బిజీగా గడిపే బాబు దీపావళి రోజు మాత్రం ఉల్లాసంగా కనిపించారు. ఆయన ముఖంలోనే దీపావళి వెలుగులు కనిపించాయి. రాష్ట్రాన్ని ఒక గాడిలో పెడుతున్న సంతృప్తితో ఉన్న బాబు ఈసారి సంతోషకరమైన దీపావళిని జరుపుకున్నారు అని చెప్పాలి. మొత్తానికి రాష్ట్రానికి పెద్దగా బాబులో కనిపించిన ఆత్మ విశ్వాసం సంతృప్తి ఆనందం ఇవన్నీ రాష్ట్రానికి శాశ్వతంగా దీపావళి కాంతులు ఇస్తాయని అంతా ఆశిస్తున్నారు.

### 2023 జనాభా లెక్కలను రిలీజ్ చేసిన సీఆర్ఎస్..

# రెండు తెలుగు రాష్ట్రాల జనాభా ఎంతంటే?

ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశం భారతదేశం. 140 కోట్లకు పైగా ప్రజలు ఈ దేశంలో జీవిస్తున్నారు. దేశ వ్యాప్తంగా జనాభా జాబితాను కేంద్ర ప్రభుత్వం రిలీజ్ చేస్తూనే ఉంటుంది. భారతదేశంలోని జనాభా గణాంకాలు కేవలం సంఖ్య కథ కాదు.. అవి సమాజపు ఆరోగ్యం, అభివృద్ధి, జీవన ప్రమాణాల ప్రతిబింబం. కేంద్ర హోంశాఖ తాజాగా విడుదల చేసిన సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (%జ=ా%) నివేదిక ప్రకారం.. 2023, జనవరి 1 నుంచి 2023, డిసెంబర్ 31 వరకు దేశవ్యాప్తంగా నమోదైన జనన%-%మరణాల వివరాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల గణాంకాలు సామాజిక పరిశీలనకు ఆసక్తికరమైన దిశను చూపిస్తున్నాయి.



ఏ రాష్ట్రంలో ఎంతంటే..? ఆంధ్రప్రదేశ్‌లో 2023లో మొత్తం 7,62,093 జననాలు నమోదవగా.. మరణాలు 4,42,218. తెలంగాణలో జననాలు 6,52,688, మరణాలు 2,40,058. రెండు రాష్ట్రాల్లోనూ ఈ గణాంకాలు కేవలం జనాభా పెరుగుదలకే కాదు.. వైద్య సేవల లభ్యత, పట్టణీకరణ, ఆరోగ్య మౌలిక సదుపాయాల స్థాయికి కూడా సూచికలుగా నిలుస్తాయి. ఈ జిల్లాల్లో పెరిగిన పుట్టుక రేటు.. జననాల సంఖ్యలో చూసుకుంటే ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాలు కర్నూలు, కడప, అనంతపురం ముందు వరుసలో ఉన్నాయి. ఈ జిల్లాలు అధిక జననాల జిల్లాలుగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో ఉన్న ఈ జిల్లాల్లో సాంప్రదాయ కుటుంబ వ్యవస్థలు, గ్రామీణ జనాభా శాతం అధికంగా ఉండడం వల్ల జననాల రేటు సహజంగానే ఎక్కువగా ఉంది. మరోవైపు విశాఖపట్నం, గుంటూరు వంటి నగర ప్రాంతాల్లో జననాలు తక్కువగా ఉండడం పట్టణ జీవితశైలిలో మార్పులు, కుటుంబ పరిమాణంపై ఉన్న చైతన్యం పెరిగిందని సూచిస్తోంది.

తెలంగాణలో ఈ గణాంకాలు మరింత విభిన్న చిత్రాన్ని చూపుతున్నాయి. హైదరాబాద్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలు జననాల పరంగా మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. ఈ మూడు జిల్లాలు మౌలిక వైద్య సదుపాయాలు, ప్రైవేట్ హెల్త్‌కేర్ ప్రావీణ్యం ఎక్కువగా కలిగిన ప్రాంతాలు. కానీ అదే సమయంలో మిగతా జిల్లాల్లో జననాల సంఖ్య తక్కువగా ఉండడం, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సదుపాయాల లభ్యతలో ఇంకా లోపాలున్నాయన్న సంకేతం ఇస్తోంది. మరణాల రేటు పరంగా చూస్తే, రెండు రాష్ట్రాల మధ్య వ్యత్యాసం స్పష్టంగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో మరణాలు తెలంగాణతో పోలిస్తే దాదాపు రెట్టింపు స్థాయిలో ఉండడం ఆ రాష్ట్ర జనాభా, వయసు నిర్మాణం, వైద్య సేవల లభ్యత, వృద్ధాప్య జనాభా శాతం వంటి అంశాలతో ముడిపడి ఉంది. తెలంగాణలో ఈ సంఖ్య తక్కువగా ఉండడం అక్కడి పట్టణ జనాభా ప్రాధాన్యంతో సంబంధమైందని విశ్లేషకులు భావిస్తున్నారు.


లక్షకు పైగా నమోదు కాని వైనం.. ఈ గణాంకాల్లో మరో కీలక అంశం ఏంటంటే.. రెండు రాష్ట్రాల్లోనూ లక్షకు పైగా జననాలు ఎక్కడా నమోదు కాలేదు. సివిల్ రిజిస్ట్రేషన్ వ్యవస్థ ఉద్దేశం ప్రతి శిశువు రికార్డు కావడం. పుట్టుక, మరణం రెండూ దేశ జనాభా పాలసీలకు, ఆర్థిక ప్రణాళికలకు బలమైన ఆధారం. ఈ రికార్డుల్లో గ్యాప్ ఉండడం మంచిది కాదు.. ఇది ప్రభుత్వ విధానాలను మార్చవచ్చు. ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లో పుట్టుకలు నమోదుకాకపోవడం వెనుక అవగాహన లోపం, సిబ్బంది కొరత, కొన్ని చోట్ల ఇంకా పాత సామాజిక ఆచారాలు ఉన్నాయి.

పుట్టుక నమోదును కేవలం ఆరోగ్య శాఖ బాధ్యతగా కాకుండా.. ప్రతి పంచాయతీ స్థాయిలో పౌర బాధ్యతగా చేయాలి. ఆసుపత్రుల్లో పుట్టిన పిల్లలతో పాటు.. ఇంట్లో పుట్టిన శిశువుల నమోదును సులభతరం చేయాలి. ఈ రికార్డులు సరైనవిగా ఉంటేనే జనాభా గణాంకాలు వాస్తవానికి దగ్గరగా ఉంటాయి, దీని ద్వారా ప్రభుత్వ విధానాలు మరింత సమర్థవంతంగా రూపకల్పన అవుతాయి. ఈ నివేదిక మనకు ఒక సందేశం ఇస్తోంది. పుట్టుకల సంఖ్య కేవలం జనాభా గణన కాదు.. ఆ గుర్తింపు, ఆ గౌరవం పూర్తిగా పొందే రోజే మన సమాజం సంఖ్యల వెనక దాగిన మనుష్యత్వాన్ని చూసే స్థితికి చేరుతుంది.

### ధర్మాన యాక్టివ్...

# వైసీపీకి లైన్ క్లియర్...!

సీనియర్ రాజకీయ నాయకుడు, మాజీ మంత్రి ధర్మాన ప్రసాద్ యాక్టివ్ అయ్యారు. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత.. సుదీర్ఘంగా ఏడాది పాటు ఆయన మౌనంగా ఉన్నారు. వైసీపీ తరఫున ఆయన రాజకీయాలు చేయరన్న వాదన కూడా వినిపించింది. ఇదేసమయంలో ఆయన తన కుమారుడి భవితవ్యాన్ని దృష్టిలో పెట్టుకుని.. కూటమి పార్టీలో ఒక దాని వైపు మొగ్గు చూపిస్తున్నారన్న చర్చ కూడా రాజకీయ వర్గాల్లో కొన్నాళ్లు హల్చల్ చేసింది. అయితే.. ఆ ప్రయత్నాలు ఏమయ్యాయో.. తెలియదు.



ఇంతలో మెడికల్ కాలేజీల వ్యవహారం తెరమీదకు వచ్చింది. ఈ కాలేజీలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంలో నిర్మించాలని.. తద్వారా ప్రభుత్వంపై భారాన్ని తగ్గించుకోవాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనిని వ్యతిరేకిస్తూ.. వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున ధర్నాలు, నిరసనలు వ్యక్తం చేశారు. అయితే.. అప్పట్లోనూ మౌనంగా ఉన్న ధర్మాన.. ఇటీవల మీడియా ముందుకు వచ్చారు. జగన్ తీసుకు వచ్చిన మెడికల్ కాలేజీలపై ఆయన సానుకూలత వ్యక్తం చేశారు.

బద్ధ శత్రువులు కూడా ఈ కాలేజీల ఏర్పాటును తప్పుబట్టలేరని అన్నారు. అంతేకాదు.. మెడికల్ కాలేజీల ద్వారా మేలు జరుగుతుందన్నారు.

ఇదెలా ఉన్నప్పటికీ.. ధర్మాన యాక్టివ్ కావడంతో వైసీపీలో ఆసక్తికర చర్చ అయితే తెరమీదకి వచ్చింది. ఆయన పార్టీలోనే ఉంటున్నారని.. పార్టీ నుంచి బయటకు వెళ్లడం లేదన్న వాదన బలపడింది. ప్రస్తుతం.. సాక్షి మీడియాపై నిబంధనలు విధించడం సరి కాదంటూ మరోసారి ధర్మాన మీడియా ముందుకు వచ్చారు. దీంతో ధర్మాన లైన్ క్లియర్ చేశారన్న వాదన పార్టీలో వినిపిస్తోంది.

నిజానికి శ్రీకాకుళం నియోజకవర్గం లో ఇప్పటి వరకు వైసీపీకి బలమైన నాయకుడిగా ఉన్న ధర్మాన కనుక వెళ్లిపోయి ఉంటే పార్టీకి పెద్దమైనస్ అయి ఉండేది. మరీ ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో బలమైన సామాజిక వర్గానికి చెందిన నాయకుడిగా ఉన్న ధర్మాన.. స్థిరత్వం ఉన్న నేతగా గుర్తింపు పొందారు. ఒకానొక దశలో ఆయన పార్టీ నుంచిబయటకు వెళ్లిపోతారని భావించినప్పుడు.. వైసీపీలో పెద్ద అలజడి రేగింది. కానీ.. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని.. ధర్మాన యాక్టివ్ అయ్యారని తెలియడంతో శ్రేణులతోపాటు పార్టీ అధిష్టానం కూడా ఊపిరి పీల్చుకుంది.

# మహాఘట్‌బంధన్ X మహాఘట్‌బంధన్

**పాట్నా**

బీహార్‌లో అధికార జేడీ(యూ), బీజేపీ పార్టీలతో కూడిన ఎన్డీఏ కూటమిని దించి ఈసారి ఎలాగైనా అధికారం చేపడదామని కలలు కంటున్న కాంగ్రెస్, ఆర్జేడీ తదితర పార్టీల మహాఘట్‌బంధన్‌లో ఐక్యత కరవైంది. వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రకటించిన లిస్టుల్లో చిత్రంగా 11 స్థానాల్లో ఈ పార్టీలు పరస్పరం తలపడుతున్నాయి. ఇందులో ఆరు స్థానాల్లో ఆర్జేడీ, కాంగ్రెస్ నేరుగా పోటీపడుతుండగా, నాలుగు స్థానాల్లో కాంగ్రెస్, సీపీఐ రంగంలో ఉన్నాయి. అలాగే ముఖేష్ సహానీకి చెందిన వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ), ఆర్జేడీలు రెండు నియోజకవర్గాల్లో ఢీకొంటున్నాయి. అయితే తమ మధ్య ఉన్నది స్నేహపూర్వక పోటీ అని ఈ కూటమి పార్టీలు సమర్థించుకుంటున్నాయి.

**ఎన్డీఏకే ప్రయోజనమా?**

ఇలా విపక్ష కూటమిలో లుకలుకల వల్ల వ్యతిరేక ఓటు చీలి బీజేపీ నేతృత్వంలోని అధికార ఎన్డీఏ కూటమికి పలు నియోజకవర్గాల్లో ప్రయోజనం చేకూర్చవచ్చునని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. మహాఘట్‌బంధన్‌లోని విభేదాలు సవాల్ విసిరే కొన్ని నియోజకవర్గాల్లో ఎన్డీఏ కూటమి విజయాన్ని సులభం చేస్తుందని ఆ కూటమి భాగస్వామి పార్టీ లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) నేత చిరాగ్ పాశ్వాన్ పేర్కొన్నారు. 'ఇంత పెద్ద కూటమి విడిపోయే దశలో ఉండటం నేనెక్కడా చూడలేదు. సీట్ల సర్దుబాటుపై కొద్దిపాటి వివాదాలు, విభేదాలు సహజమే. కానీ ఆయా పార్టీలు కూర్చుని ఎవరెక్కడ పోటీ చేయాలనే దానిపై ఒక అవగాహనకు రావాలి. కానీ మహాఘట్‌బంధన్‌లో ఇది కన్పించడం లేదు' అని అన్నారు. బీహార్ ఎన్నికల నుంచి తప్పుకున్న జేఎంఎం'మహాఘట్‌బంధన్'లో కాంగ్రెస్, ఆర్జేడీ తీరుతో విసిగిపోయిన జేఎంఎం కీలక ప్రకటన చేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయబోవటం లేదని మంగళవారం ప్రకటించింది. సీట్ల పంపకంపై కాంగ్రెస్, ఆర్జేడీతో వచ్చిన విభేదాల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్టు జార?ండ్ సీఎం, జేఎంఎం అధినేత హేమంత్ సొరేన్ వెల్లడించారు.

**విపక్ష అభ్యర్థులకు బీజేపీ బెదిరింపులు ప్రశాంత్ కిషోర్**

ఓటమి భయంతో పోటీ నుంచి తప్పుకోవాలని విపక్ష అభ్యర్థులను బీజేపీ బెదిరిస్తున్నదని 'జన్ సురాజ్' నాయకుడు ప్రశాంత్ కిషోర్ ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, బీజేపీ తీసుకొచ్చిన ఒత్తిడి వల్లే జన్ సురాజ్‌కు చెందిన ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం చచ్చిపోయిందన్నారు.

**బీహార్ ఎన్నికలకు కర్ణాటక మంత్రుల నిధుల సేకరణ!**

బెంగళూరు: బీహార్ శాసన సభ ఎన్నికల కోసం కర్ణాటక మంత్రులు నిధులు సేకరిస్తున్నారని బీజేపీ ఎంపీలు జగదీశ్ శెట్టర్, రాఘవేంద్ర సోమవారం ఆరోపించారు. ఈ నిధుల సేకరణలో సీఎం, మంత్రులు ఉండటం అధికార యంత్రాంగంలో అవినీతికి కారణమైందని వారు తెలిపారు. 'బీహార్ ఎన్నికల నిధుల కోసం మంత్రులంతా అధికారుల ద్వారా దోచుకుంటున్నారు. డబ్బులు వసూలు చేయాలని వారు అధికారులను అడిగారు. బదిలీల ద్వారా డబ్బు సేకరించిన తర్వాత, ఇప్పుడు రెన్యువల్స్ పేరు మీద వసూలు చేస్తున్నారు. ఇది వాళ్ల ప్రధాన వ్యాపారంగా మారింది' అని శివమొగ్గలో మీడియాతో మాట్లాడుతూ రాఘవేంద్ర అన్నారు.

# వంద జిల్లాల్లో స్వేచ్ఛా వాయువులు

**పణజీ**



దేశంలో నక్సల్-మావోయిస్టు ఉగ్రవాదం నిర్మూలనలో తుది అంకంలో ఉన్నామని ప్రధాని మోదీ అన్నారు. భద్రతాదళాలు 90 శాతం వరకు విజయం సాధించాయని.. వందకుపైగా జిల్లాలకు దీని నుంచి విముక్తి కల్పించాయని చెప్పారు. ఆయా జిల్లాల ప్రజలు స్వేచ్ఛావాయువులు పీలుస్తూ దీపావళి జరుపుకొంటున్నారని అన్నారు. సదరు ఉగ్రవాదం ప్రస్తుతం 11 జిల్లాలకే పరిమితమైందని తెలిపారు. దీపావళిని పురస్కరించుకుని ఆయన గోవా తీరంలో విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌పై జవాన్లతో కలిసి పండుగ జరుపుకొన్నారు. భద్రతాదళాల ధైర్యసాహసాలను కొనియాడారు. మావోయిస్టుల ఉగ్రవాదంపై కీలక విజయాలు సాధించాయన్నారు. '2014కి ముందు దాదాపు 125 జిల్లాలు మావోయిస్టుల గుప్పిట్లో ఉండేవి. గత దశాబ్ద కాలంగా కేంద్రప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో 11 జిల్లాలకు తగ్గిపోయింది. వీటిలో కూడా మూడు జిల్లాల్లోనే మావోయిస్టుల ప్రాబల్యం ఉంది. వారి నుంచి విముక్తి పొందిన వందకుపైగా జిల్లాలు తొలిసారి స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నాయి. 'జీఎస్టీ బచత్ ఉత్సవ్' కారణంగా ఈ ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. ఒకప్పుడు ఈ జిల్లాల్లో భారత రాజ్యాంగం పేరెత్తితేనే అణచివేసేవారు. ఇప్పుడక్కడ స్వదేశీ మంత్రం ప్రతిధ్వనిస్తోంది' అని చెప్పారు. దేశంలో అంతర్గతంగా యుద్ధం చేయాలంటే ఎంతో సహనం అవసరమని, అమాయకులెవరూ చనిపోకుండా చూసుకోవలసి ఉంటుందని గుర్తుచేశారు. తమ ప్రాబల్య ప్రాంతాల్లో స్కూళ్లు, రోడ్లు, ఆస్పత్రులను నిర్మించడానికి నక్సల్స్ అనుమతించలేదని.. వాటిని పేల్చేసి డాక్టర్లను కాల్చిచంపారని తెలిపారు. ఇప్పుడవే ప్రాంతాల్లో హైవేలు నిర్మిస్తున్నామని.. స్కూళ్లు, ఆస్పత్రులు పిల్లలకు నూతన భవిష్యత్‌ను ఇస్తున్నాయని చెప్పారు. భద్రతాదళాల త్యాగాలు, ధైర్యసాహసాల వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఈ పోరులో అవయవాలు కోల్పోయి వీల్‌చైర్లకే పరిమితమైనా పోలీసు జవాన్లు పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. మంగళవారం పోలీసు అమరవీరుల దినం సందర్భంగానూ.. ప్రాణత్యాగాలు చేసిన పోలీసులకు మోదీ నివాళులు అర్పించారు.

**'ఆత్మనిర్భర భారత్'కు విక్రాంత్ నిదర్శనం**

స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్.. 'ఆత్మనిర్భర భారత్'కు తిరుగులేని నిదర్శనమని ప్రధాని తెలిపారు. దీనిని కదులుతున్న నగరంగా అభివర్ణించారు. 'త్రివిధ దళాల మధ్య అద్భుత సమన్వయం.. మన నౌకాదళం చొప్పించిన భయం.. వైమానిక దళ అసాధారణ నైపుణ్యం, సైన్యం సాహసం.. కలగలిపి 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్‌ను కాళ్లబేరానికి తీసుకొచ్చాయన్నారు. 'కొన్నేళ్లుగా భారత దళాలు స్వావలంబనతో అత్యాధునికత సంతరించుకున్నాయి. బ్రహ్మోస్, ఆకాశ్ వంటి క్షిపణులు తమ సామర్థ్యాలను ఆపరేషన్ సిందూర్‌లో నిరూపించుకున్నాయి. పలు దేశాలు ఇప్పుడీ క్షిపణుల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నాయి. గత 11 ఏళ్లలో మన రక్షణ ఉత్పత్తులు మూడు రెట్లు పెరిగాయి. గత ఏడాది ఈ ఉత్పత్తులపై వ్యయం రూ.లక్షన్నర కోట్లకు చేరుకుంది. 2014 నుంచి వివిధ భారత షిప్‌యార్డులు నౌకాదళానికి 40 స్వదేశీ యుద్ధనౌకలు, జలాంతర్గాములను నిర్మించి ఇచ్చాయి. అంటే సగటున ప్రతి 40 రోజులకు ఓ యుద్ధనౌక, జలాంతర్గామి నిర్మించాయన్న మాట. ప్రపంచ అగ్ర రక్షణ ఉత్పత్తిదారుల్లో ఒకరిగా నిలవాలన్నది భారత లక్ష్యం' అని స్పష్టంచేశారు. ప్రధాని ఆదివారం సాయంత్రం ఐఎన్ఎస్ విక్రాంత్‌పైకి వచ్చారు. సోమవారమంతా అక్కడే ఉన్నారు. ఉదయం యోగా సెషన్‌లో పాల్గొన్నారు. యుద్ధనౌకలు, యుద్ధవిమానాల విన్యాసాలను పరిశీలించారు.

# సెకండ్ హ్యాండ్ ఐనా.. ఐఫోనే! భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా ఇదే ట్రెండ్

ఐఫోన్.. ఇది చాలామందికి స్టేటస్ సింబల్. బ్రాండ్ న్యూ ఫోన్కే కాదు.. పాతదైనా సరే ఐఫోన్కు ఏమ్రాతం క్రేజ్ తగ్గలేదు. ఒక్క భారత్‌లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా సెకండ్ హ్యాండ్ మార్కెట్లో ఐఫోన్ హవా నడుస్తోంది. అమ్మకాల సంఖ్య పరంగా సామ్‌సంగ్ మనదేశంలో నెంబర్‌వన్‌గా ఉన్నప్పటికీ.. వృద్ధి రేటులో మాత్రం ఆపిల్ నంబర్‌వన్‌గా నిలిచింది. మనదేశంలో సెకండ్ హ్యాండ్ ఫోన్ల మార్కెట్లో సామ్‌సంగ్, యాపిల్ తరవాత వన్ ప్లస్, షియోమి వంటివి ఉన్నాయి. యాపిల్ తయారీ ఐఫోన్%–%16 విడుదలై, అందుబాటులోకి వచ్చిన తొలి 10 రోజుల్లో అమ్మకాలతో పోలిస్తే.. ఇటీవలే మార్కెట్లోకి వచ్చిన ఐఫోన్%–%17 మోడల్ విక్రయాలు చైనా, యూఎస్‌లో 14% అధికంగా నమోదయ్యాయి. భారత్‌లోనూ పరిస్థితి దాదాపు ఇలాగే ఉందని మార్కెట్ వర్గాలు అంటున్నాయి. కేవలం కొత్త ఐఫోన్లకే గిరాకీ ఉందనుకుంటే పొరపాటే.. మార్కెట్‌ను బట్టి ప్రపంచవ్యాప్తంగా పాత ఐఫోన్ల కోసమూ కస్టమర్లు ఎగబడుతున్నారు.

భారత్‌లో చేతులు మారుతున్న (సెకండ్ హ్యాండ్) పాత ఫోన్లలో అయిదింట మూడు ఐఫోన్లేనని రీసేల్ ప్లాట్‌ఫామ్ 'క్యాషిఫై' చెబుతోంది. ప్రీమియం మోడళ్ల పట్ల పెరుగుతున్న ఆసక్తికి ఇది నిదర్శనం. ఆ సంస్థ సర్వే ప్రకారం కొనుగోలుదారుల్లో దాదాపు మూడోవంతు మంది.. రూ.21,000 నుంచి రూ.35,000 వరకు సెకెండ్ హ్యాండ్ ఫోన్ల కోసం వెచ్చిస్తున్నారంటే క్రేజ్ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**పెరుగుతున్నఆకాంక్ష**

ఇప్పటికే మొబైల్ ఫోన్ల విస్తృతి పెరగడం, కస్టమర్లు ఎక్కువ కాలంపాటు మొబైల్స్ వినియోగిస్తున్న కారణంగా యూరప్, యూఎస్ఏ, జపాన్ వంటి మార్కెట్లలో 2025 జనవరి%–%జూన్ మధ్య ప్రీ%–%ఓన్డ్ స్మార్ట్‌ఫోన్ అమ్మకాల్లో పెరుగుదల నమోదైంది. ఆఫ్రికా, భారత్, ఆగ్నేయాసియా అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలోనూ అమ్మకాలు పెరగడం విశేషం.

ప్రీమియం మోడళ్ల వైపు వినియోగదారులు మొగ్గు చూపుతుండడం ప్రీ%–%ఓన్డ్ అమ్మకాలకు కారణమవుతోంది. ప్రజల్లో అత్యధికులకు యాపిల్ ఫోన్లను కలిగి ఉండాలన్న ఆకాంక్ష పెరుగుతోంది. కానీ తలసరి ఆదాయం ఆ స్థాయిలో లేదు. అందుకే కొత్త ఫోన్ కొనలేకపోయినా.. కనీసం సెకండ్ హ్యాండ్ ఫోన్ అయినా సొంతం చేసుకోవాలనుకుంటున్నారు.

**భారత్‌లో 5 శాతం**

జనవరి%–%జూన్ కాలంలో 2024తో పోలిస్తే 2025లో పాత స్మార్ట్ ఫోన్ల మార్కెట్ ఆఫ్రికాలో 6 శాతం, భారత్, ఆగ్నేయాసియా దేశాల్లో చెరి 5 శాతం దూసుకెళ్లింది. యూఎస్ఏ, చైనా, లాటిన్ అమెరికా, జపాన్ దేశాలు చెరి 3 శాతం, యూరప్‌లలో ఒక శాతం వృద్ధి నమోదైందని మార్కెట్ పరిశోధన సంస్థ 'కౌంటర్‌పాయింట్' వెల్లడించింది. అయితే అన్ని మార్కెట్లలోనూ రీఫర్బిష్డ్ విభాగంలో యాపిల్ ఐఫోన్ల హవా నడుస్తుండడం విశేషం.




**19 శాతం పెరిగి..**

భారత్‌లో రీఫర్బిష్డ్ స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో తొలి స్థానంలో ఉన్న సామ్‌సంగ్ విక్రయాలుఈ ఏడాది జనవరి%–%జూన్ కాలంలో 1 శాతం తగ్గాయి. గెలాక్సీ ఎస్22, ఎస్21 అత్యధికంగా అమ్ముడైన మోడళ్లలో ఉన్నాయి.ఐఫోన్ 13, 14 సిరీస్ లను వినియోగదారులు ఇష్టపడు తుండటంతో యాపిల్ అమ్మకాలు ఏకంగా 19 శాతం పెరిగి, రెండో స్థానంలో నిలిచిందని కౌంటర్ పాయింట్ వెల్లడించింది.

**ఐఫోన్ ముచ్చట్లు**

' ప్రపంచవ్యాప్తంగాఐఫోన్ కస్టమర్లు..156 కోట్లకుపైమాటే
' 2024లోఅంతర్జాతీయంగా ఐఫోన్ అమ్మకాలు.. 23 కోట్లకుపైనే
' గతఏడాది భారత్‌లో అమ్ముడైన ఐఫోన్స్.. 1.2 కోట్లు
' భారత్‌లో 2024%–%25లో కంపెనీ ఆదాయం 13 శాతం వృద్ధితో 900 కోట్ల డాలర్లు
' 2025లో వాడేసిన, రిఫర్బిష్డ్ ఫోన్లప్రపంచ మార్కెట్ విలువ 6500 కోట్ల డాలర్లకుపైనేఉంటుందని అంచనా.

## రైతులకు రబీ షాక్



**న్యూఢిల్లీ**

ఇటీవల యూరియా దొరకక ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు మరో షాక్ తగలనుంది. రబీ సీజన్ ప్రారంభానికి ముందే దేశంలో ఎరువుల ధరలు పెరిగే పరిస్థితి కనిపిస్తోంది. యూరియాతో పాటు కొన్ని రకాల ఎరువుల ఎగుమతులను ఈ నెల 15 నుంచే చైనా నిలిపివేసింది. ఈ నిర్ణయం భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగంపై దుష్ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నిలిపివేత 5 నుంచి 6 నెలల పాటు కొనసాగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. మనం ఉపయోగించే టెక్నికల్ మోనోఅమ్మోనియం ఫాస్పేట్ (టీఎమ్ఏపీ), అడ్బ్లూతో పాటు యూరియా, డీఏపీ వంటి ఎరువులను దాదాపు 95 శాతం చైనా నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. ఇప్పుడు చైనా ఆంక్షలతో వీటి ధరలు మరో 10–15 శాతం పెరిగే అవకాశం ఉంది. భారత్ ప్రతి సంవత్సరం 2.5 లక్షల టన్నుల ప్రత్యేక ఎరువులను వినియోగిస్తోంది. వీటిలో సుమారు 60–65 శాతం రబీ (అక్టోబరు నుంచి మార్చి) సీజన్‌లోనే వాడుతున్నారు. ఈ సమయంలో ధరలు పెరిగితే రైతులపై మరింత భారం పడుతుంది. అయితే వ్యాపారులు ఇప్పటికే కొంత మేర ఎరువులను నిల్వచేయడంతో రబీ అవసరాలు తీరుతాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

## కిక్కు దించుతున్న లిక్కర్ రేట్లు!



**ముంబై**

విదేశీ మద్యం ధరలు పెరగడంతో మహారాష్ట్రలో మద్యం అమ్మకాలు పడిపోయి ఎక్సైజ్ సుంకం ద్వారా ఆదాయం తగ్గిపోయింది. ఎక్సైజ్ శాఖ గణాంకాల ప్రకారం ఈ ఏడాది సెప్టెంబర్ వరకు15.1 కోట్ల లీటర్ల మద్యం అమ్మకాలు మాత్రమే జరిగాయి. ఇదే కాలంలో గత ఏడాది 32.19 కోట్ల లీటర్ల మద్యం అమ్మకాలు జరగడం గమనార్హం. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 30 కోట్ల లీటర్ల మద్యం అమ్మకాలు జరగగా 2023–24లో 27.72 కోట్ల లీటర్ల అమ్మకాలు జరిగాయి. కొవిడ్–19 కాలంలో విదేశీ మద్యం అమ్మకాలు పుంజుకోవడం విశేషం. 2018–19లో 20.72 కోట్ల లీటర్లు, 2020–21లో 21 కోట్ల లీటర్ల విదేశీ మద్యం అమ్మకాలు జరిగాయి. ధరల పెంపు దేశీయ మద్యం అమ్మకాలపై ప్రభావం చూపింది. రాష్ట్ర ఎక్సైజ్ ఆదాయం గణనీయంగా పడిపోయింది. గత ఏడాది ఇదే కాలానికి రూ. 25,467 కోట్ల ఎక్సైజ్ ఆదాయం లభించగా ఈ ఏడాది రూ. 12,332 కోట్ల ఆదాయం మాత్రమే లభించింది. అయితే మద్యం అమ్మకాలు తగ్గడానికి ధరల పెంపు ఒక్కటే కారణం కాదని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. జీవన వ్యయం పెరగడం వల్ల ప్రజలు ఖర్చులు తగ్గించుకోక తప్పని పరిస్థితి ఏర్పడిందని, దీని ప్రభావం అత్యధికంగా మద్యంపై పడిందని అభిప్రాయపడ్డారు.

## గంటకు 453 కిలోమీటర్ల వేగం



**బీజింగ్**

రైలు ప్రయాణంలో వేగానికి సరికొత్త అర్థం చెప్తూ చైనా మరో ప్రపంచ రికార్డు సృష్టించింది. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సీఆర్ 450 హై స్పీడ్ రైలును ఆవిష్కరించింది. ఈ రైలు ప్రస్తుతం షాంఘై–చోంగ్‌క్వింగ్–చెంగ్డూ మార్గంలో తొలి పరీక్షలను ప్రారంభించింది. గతంలో జరిగిన పరీక్షల్లో ఈ రైలు గంటకు ఏకంగా 453 కిలోమీటర్లు (281 మైళ్లు) గరిష్ఠ వేగాన్ని అందుకుని, తన రికార్డు సామర్థ్యాన్ని నిరూపించింది. వాణిజ్య సేవల్లో ఇది గంటకు 400 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేందుకు వీలుగా రూపొందించారు. ప్రస్తుతం గంటకు 350 కి.మీ. వేగంతో ప్రయాణిస్తున్న పాత రైలు సీఆర్ 400 ఫ్యుక్సింగ్ మోడల్‌తో పోలిస్తే సీఆర్450 రైలులో అనేక మార్పులు చేశారు. పొడవైన ముక్కు, 20 సెం.మీ. తగ్గించిన పైకప్పుతో పాటు, మొత్తం బరువును 50 టన్నులు తగ్గించడం ద్వారా గాలి నిరోధాన్ని 22 శాతం మేర తగ్గించారు. ఈ రైలు కేవలం 4 నిమిషాల 40 సెకన్లలోనే సున్నా నుంచి గంటకు 350 కి.మీ. వేగాన్ని అందుకోగలదు. ఇటీవల నిర్వహించిన ఒక ప్రదర్శనలో రెండు సీఆర్ 450 రైళ్లు ఎదురెదురుగా వెళ్తూ, సంయుక్తంగా గంటకు 896 కి.మీ. వేగాన్ని నమోదు చేశాయి. ప్రస్తుతం ఈ హైస్పీడ్ రైలు 6,00,000 కిలోమీటర్ల సుదీర్ఘ పరీక్షలను పూర్తి చేయనుంది. నూతన సాంకేతికతతో కూడిన ఈ రైలు పర్యావరణహితంగా, మరింత నిశ్శబ్దంగా, సురక్షితంగా ఉంటుందని చైనా రైల్వే వర్గాలు వెల్లడించాయి.

# బిజినెస్ వాయిస్

## ట్రంప్‌నకు ఎదురుదెబ్బ!

## భారత ఎజెండాకు యూరోపియన్ కౌన్సిల్ ఆమోదం



భద్రత, రక్షణ భాగస్వామ్యాన్ని స్థాపించే దిశగా పనిచేయాలనే ఉద్దేశ్యాన్ని కౌన్సిల్ గుర్తించింది. ఇది సముచితమైతే, రక్షణ పారిశ్రామిక సహకారానికి కూడా దారితీస్తుందని యూరోపియన్ కౌన్సిల్ ప్రకటన పేర్కొంది. ఉక్రెయిన్‌పై రష్యా దూకుడుగా చేస్తున్న యుద్ధం అన్ని అంశాలపై ఇయు భారతదేశంతో సంభాషణను కొనసాగిస్తుందని పేర్కొంది. యూరోపియన్ కమిషన్ గతంలో ప్రకటించిన కొత్త వ్యూహాత్మక ఇయు భారత్ ఎజెండా తీర్మానాలను సోమవారం (అక్టోబర్ 20, 2025) యూరోపియన్ కౌన్సిల్ ఆమోదించింది. ఇయు– భారతదేశం మధ్య సంబంధాలను మరింతగా పెంచుకోవడానికి బలమైన ప్రోత్సాహాన్ని కూడా ఇది స్వాగతించింది. సుంకాల ద్వారా వ్యాపారం చేయాలని భారతదేశంపై నిరంతరం ఒత్తిడి తెస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇది ఎదురుదెబ్బ. బెల్జియంకు చెందిన కౌన్సిల్, 27 సభ్య దేశాల ఆర్థిక కూటమి మొత్తం రాజకీయ దిశ, ప్రాధాన్యతలకు బాధ్యత వహిస్తుంది. ఈ సంవత్సరం చివరి నాటికి భారతదేశం– ఇయు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్నిముగించడానికి రెండు వైపులా చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఈ వారం ఎజెండా ముగింపులు ఇయు– భారతదేశం సంబంధాలను మరింతగా పెంచే దాని లక్ష్యాన్ని సమర్థించాయి. ఇందులో ఉమ్మడి కమ్యూనికేషన్, శ్రేయస్సు, స్థిరత్వం, సాంకేతికత, ఆవిష్కరణలు, భద్రత, రక్షణ, కనెక్టివిటీ, ప్రపంచ సమస్యలు ఉన్నాయి. యూరోపియన్ కమిషన్–భారత ప్రభుత్వం ఈ సంవత్సరం చివరి నాటికి తుది నిర్ణయం తీసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న సమతుల్య, ప్రతిష్టాత్మకమైన, పరస్పర ప్రయోజనకరమైన, ఆర్థికంగా అర్థవంతమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసే ప్రయత్నాలను కౌన్సిల్ ప్రత్యేకంగా స్వాగతిస్తుంది అని యూరోపియన్ కౌన్సిల్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఒప్పందంలో మార్కెట్ యాక్సెస్‌ను విస్తరించడం, వాణిజ్య అడ్డంకులను తొలగించడం, స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించడం వంటి నిబంధనలు ఉండాలి అని ప్రకటన పేర్కొంది. పరస్పర విశ్వాసం, గౌరవం సూత్రాల ఆధారంగా భద్రత, రక్షణ విషయాలలో ఇయు – భారతదేశం మధ్య సన్నిహిత సహకారం చాలా ముఖ్యమైనదరి యూరోపియన్ కౌన్సిల్ వెల్లడించింది.

## ఏఐ వల్ల ఉద్యోగాల కోత ఉండదు



కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం వల్ల తమ బ్యాంకులో ఉద్యోగుల కోత ఉండదని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీఈఓ, ఎండీ శశిధర్ జగదీశన్ ప్రకటించారు. అయితే బ్యాకెండ్‌లో ఉన్నవారు సాంకేతికత పైపు రావడానికి ఇది మంచి అవకాశాన్ని అందిస్తుందని వివరించారు. జెనరేటివ్ ఏఐతో పాటు మరికొన్ని సాంకేతిక విభాగాల్లో బ్యాంక్ నుంచి పరిశోధనలు జరుగుతున్నాయని, దీని వల్ల ప్రయోజనాలు వచ్చే 18–24 నెలల్లో కనిపిస్తాయని శశిధర్ వెల్లడించారు. గత 6 నెలల్లో కొత్తగా నియమించుకున్న 5,000 మందితో కలిపి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు చివరికి బ్యాంకులో మొత్తం 2.20 లక్షల మంది సిబ్బంది ఉన్నారు. కొత్త సాంకేతికతల వల్ల ఉద్యోగులు పనిచేసే విధానాలు, స్థానాలు మారతాయి కానీ, వారిని తొలగించేది ఉండదని స్పష్టం చేశారు. ఉద్యోగుల వలసలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

# రికార్డు స్థాయిల నుంచి కిందకు జారిన బంగారం, వెండి ధరలు



రికార్డు స్థాయికి చేరిన బంగారం, వెండి ధరలు ఒక్కసారిగా నేలచూపులు చూస్తున్నాయి. ధనత్రయోదశి సందర్భంగా భారీగా నగల అమ్మకాలు జరిగిన మరుసటి రోజే, మంగళవారం ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో వెండి, పసిడి ధరలు గణనీయంగా పతనమయ్యాయి. సోమవారం చారిత్రక గరిష్ఠాలను తాకిన బంగారం, వెండి.. ఈరోజు అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి.దేశీయ మార్కెట్లో వెండి ధరలో భారీ పతనం కనిపించింది. ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ ప్రకారం, నిన్న కిలో వెండి ధర ఏకంగా 7 శాతం పడిపోయింది. దీంతో కిలో వెండి ధర రూ. 1,71,275 నుంచి రూ. 1,60,100కి తగ్గింది. ఈ ప్రభావం సిల్వర్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ కూడా తీవ్రంగా పడింది. గత ఏడాదిలో 65–70 శాతం రాబడినిచ్చిన ఈ ఫండ్స్, ఒక్కరోజే 7 శాతం వరకు నష్టపోయాయి. అంతర్జాతీయంగా వెండి సరఫరా మెరుగుపడటం, సురక్షిత పెట్టుబడిగా డిమాండ్ తగ్గడంతో ధరలు తగ్గుముఖం పట్టాయి.మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర కూడా తగ్గింది. సోమవారం ఆల్–టైమ్ గరిష్ఠ స్థాయి వి4,381.21 డాలర్లను తాకిన స్పాట్ గోల్డ్, మంగళవారం 0.3 శాతం తగ్గి ఔన్సుకు వి4,340.29 డాలర్ల వద్ద ట్రేడ్ అయింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను మరింత తగ్గించవచ్చన్న అంచనాలతో ఇన్వెస్టర్లు లాభాలను స్వీకరించారు. కాగా, మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ ఈరోజు మధ్యాహ్నం 1:45 నుంచి 2:45 గంటల వరకు ప్రత్యేక ముహూరత్ ట్రేడింగ్ జరగనుంది.అయితే, ధరలు తగ్గినప్పటికీ పండుగ డిమాండ్ మాత్రం బలంగానే ఉంది. ఆల్ ఇండియా జెమ్ అండ్ జువెలరీ ప్రమోషన్ కౌన్సిల్ వెల్లడించిన వివరాల ప్రకారం, ధనత్రయోదశి రెండు రోజుల్లో దేశవ్యాప్తంగా దాదాపు 50 నుంచి 60 టన్నుల నగల అమ్మకాలు జరిగాయి. వీటి విలువ సుమారు రూ. 85 కోట్లుగా నమోదైంది. గతేడాదితో పోలిస్తే అమ్మకాల పరిమాణం ఒకేలా ఉన్నా, ధరలు పెరగడంతో మొత్తం విలువలో 35–40 శాతం వృద్ధి కనిపించిందని ఆ సంస్థ తెలిపింది. ముఖ్యంగా వెండి అమ్మకాలు ఈ సీజన్‌లో రెట్టింపు అయ్యాయని పేర్కొంది. దీపావళి, భాయ్ దూజ్‌తో కలిపి ఐదు రోజుల పండుగ సీజన్‌లో మొత్తం అమ్మకాలు 100 నుంచి 120 టన్నులకు చేరవచ్చని అంచనా వేస్తున్నారు.

# చౌకగా లభించే సిఎన్‌జి కార్లు ఇవే!




మార్కెట్లో తక్కువ ధరకి లభించే కార్లలో చాలా వాటిలో సీఎన్‌జీ వేరియంట్లు అందుబాటులో ఉన్నాయి. పెట్రోల్ ధరలు భరించలేం అనుకునేవాళ్ల కోసం మార్కెట్లో ఎలక్ట్రిక్ కార్లు, సీఎన్‌జీ కార్ల వంటి ఆప్షన్స్ ఉన్నాయి. అయితే ఇందులో ఎలక్ట్రిక్ కార్ల ధరలు కాస్త ఎక్కువగా ఉంటాయి. ఇక మిగిలింది సీఎన్‌జీ ఒక్కటే. పెట్రోల్‌తో పోలిస్తే సీఎన్‌జీ ధరలు తక్కువ. పైగా సీఎన్‌జీ ఇచ్చే మైలేజ్ చాలా ఎక్కువ. అందుకే చాలామంది సీఎన్‌జీ ఆప్షన్ ఉన్న కార్లను ఎంచుకుంటున్నారు. ప్రస్తుతం మార్కెట్లో తక్కువ ధరకు లభిస్తున్న బెస్ట్ సీఎన్‌జీ కార్స్‌పై లుక్కేస్తే.. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న బెస్ట్ బడ్జెట్ ఫ్యామిలీ సీఎన్‌జీ కారుగా మారుతి వ్యాగన్ ఆర్‌ని చెప్పుకోవచ్చు. ఈ కారు సీఎన్ జీ మోడల్ ధర రూ. 5.89 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. 998 సీసీ ఇంజిన్ తో వస్తుంది. 56 పిఎస్ పవర్, 92.1 ఎన్ఎమ్ టార్క్ జనరేట్ చేస్తుంది. ఇది కిలోకు 34.05 కిలోమీటర్ల మైలేజీని అందిస్తుంది. ఆరు ఎయిర్‌బ్యాగులు, ఎబిఎస్, ఇఎస్‌పి మొదలైన సేఫ్టీ ఫీచర్స్ ఉన్నాయి. విశాలమైన క్యాబిన్ తో ఫ్యామిలీకి అనుకూలంగా ఉంటుంది. బెస్ట్ బడ్జెట్ కారుగా పేరు పొందిన ఆల్టో కె10 లో కూడా సిఎన్‌జి ఆప్షన్ ఉంది. దీని ధర రూ. 4.82 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. ఇందులో కూడా వ్యాగన్ ఆర్ లో ఉన్న 998సీసీ ఇంజిన్ ఉంటుంది. ఇది 56 పీఎస్ పవర్, 82.1 ఎన్ఎం టార్క్‌ను జనరేట్ చేస్తుంది. ఇది కిలోకు 33.85 కిలోమీటర్ల మైలేజీని అందిస్తుంది. ఇందులో కూడా ఆరు ఎయిర్‌బ్యాగులు, బ్యాక్ సెన్సార్ల వంటి ఫీచర్లు ఉన్నాయి. మినీ ఎస్‌యూవీగా పిలిచే మారుతి ఎస్–ప్రెస్సో సిఎన్‌జి మోడల్ ధర రూ. 4.62 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. ఇది 1.0 –లీటర్ మారుతి కె సిరీస్ ఇంజిన్‌ను కలిగి ఉంది. ఇది 56పీఎస్ పవర్, 82.1 ఎన్ఎం టార్క్‌ను జనరేట్ చేస్తుంది. ఇది కిలోకు 32.73 కిలోమీటర్ల మైలేజీని ఇస్తుంది. డ్యుయల్ ఎయిర్‌బ్యాగులు, ఏబీఎస్, పార్కింగ్ సెన్సార్ల వంటి ఫీచర్లతో వస్తుంది. బడ్జెట్ లో ప్రీమియం లుక్ కావాలనుకునేవారికి మారుతి సెలెరియో సూట్ అవుతుంది. దీని సిఎన్‌జి వేరియంట్ ధర రూ. 5.98 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. ఇందులో 998 సీసీ ఇంజిన్ ఉంటుంది. ఇది 56 పీఎస్ పవర్, 82.1 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇది కిలోకు 34.43 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుంది. ఆరు ఎయిర్‌బ్యాగులు, ఏబీఎస్ వంటి సేఫ్టీ ఫీచర్లు ఉన్నాయి. ఇక టాటా నుంచి బడ్జెట్ లో మరో సిఎన్‌జి ఆప్షన్ ఉంది. అదే టియాగో సీఎన్‌జీ. దీని ధర రూ. 5.49 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. 1.2–లీటర్ ఇంజిన్.. 72 పీఎస్ పవర్, 95 ఎన్ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది. కిలోకి 28.06 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుంది. 4 స్టార్ గ్లోబల్ సేఫ్టీ రేటింగ్ కలిగిన కారు.

# 2027 ప్రపంచకప్‌లో రోహిత్, కోహ్లీల భాగస్వామ్యంపై చర్చ



భారత క్రికెట్ దిగ్గజాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల భవిష్యత్తుపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. ఇప్పటికే టెస్టులు, టీ20 ఫార్మాట్ల నుంచి తప్పుకున్న ఈ ఇద్దరు సీనియర్లు 2027 వన్డే ప్రపంచకప్ నాటికి జట్టులో కొనసాగుతారా అనే ప్రశ్నకు ఇప్పుడే సమాధానం చెప్పలేమని, కాలమే దాన్ని నిర్ణయిస్తుందని మాజీ కోచ్ రవిశాస్త్రి, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ అభిప్రాయపడ్డారు.సుదీర్ఘ విరామం తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి పునరాగమనం చేసిన రోహిత్, కోహ్లీ ఆస్ట్రేలియాతో పెర్త్‌లో జరిగిన మ్యాచ్‌లో పెద్దగా రాణించలేదు.దీనిపై ఐసీసీ రివ్యూలో మాట్లాడిన రవిశాస్త్రి, "ఎక్కువ కాలం ఆటకు దూరంగా ఉంటే తిరిగి గాడిలో పడటానికి సమయం పడుతుంది. అందులోనూ ఆస్ట్రేలియా వంటి కఠినమైన పిచ్‌లపై, నాణ్యమైన బౌలర్లను ఎదుర్కోవడం అంత సులభం కాదు. వారిద్దరి విషయంలో అప్పుడే ఓ అంచనాకు రాలేం" అని అన్నాడు.ఆట పట్ల వారికి ఇంకా ఎంత ఆకలి, అభిరుచి మిగిలి ఉన్నాయి అనేదే కీలకమని శాస్త్రి పేర్కొన్నాడు. "వారిలో ఆటను ఆస్వాదించే గుణం బలంగా ఉంటే చాలు. వారిద్దరికీ అపారమైన అనుభవం, క్లాస్ ఉన్నాయి. కాబట్టి కాస్త సమయం ఇస్తే కచ్చితంగా పుంజుకుంటారు. తొందరపడి వారిని విమర్శించాల్సిన అవసరం లేదు" అని పేర్కొన్నాడు.రవిశాస్త్రి అభిప్రాయంతో రికీ పాంటింగ్ కూడా ఏకీభవించాడు. ఆటలో అన్నీ సాధించేశాను అనే భావనతో కాకుండా, స్వల్పకాలిక లక్ష్యాలను నిర్దేశించుకోవడం చాలా ముఖ్యమని ఆయన సూచించాడు. "2027 ప్రపంచకప్ కోసం వేచిచూడటం కాకుండా, ప్రస్తుత ఆస్ట్రేలియా సిరీస్‌లో రాణించడంపై విరాట్ కోహ్లీ దృష్టి పెట్టాలి. అతను ఎప్పుడూ అత్యంత ప్రేరణతో ఆడే ఆటగాడు" అని పాంటింగ్ అన్నాడు.వారిద్దరూ తమ అత్యుత్తమ ఫామ్‌లో ఉంటే భారత అత్యుత్తమ జట్టులో కచ్చితంగా ఉంటారని పాంటింగ్ స్పష్టం చేశాడు. "రాబోయే ప్రపంచకప్ నాటికి వారు తిరిగి తమ బెస్ట్ ఫామ్ అందుకుంటారా లేదా అనేది త్వరలోనే తేలిపోతుంది.

## గోవాతో ఏఎఫ్‌సీ ఛాంపియన్స్ లీగ్ మ్యాచ్‌కు గైర్హాజరు



భారత ఫుట్‌బాల్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న క్షణానికి తెరపడింది. ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో భారత్ కు రాలేదు. ఏఎఫ్‌సీ ఛాంపియన్స్ లీగ్‌లో భాగంగా ఎఫ్‌సీ గోవాతో జరగాల్సిన మ్యాచ్ కోసం ఆయన భారత్‌కు రావడం లేదని స్పష్టమైంది. ఈ వార్తతో రొనాల్డో ఆటను ప్రత్యక్షంగా వీక్షించాలని ఆశపడిన వేలాది మంది అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు.ఏఎఫ్‌సీ ఛాంపియన్స్ లీగ్ 2లో భాగంగా గోవా ఎఫ్‌సీతో జరగాల్సిన మ్యాచ్‌కు రొనాల్డో దూరంగా ఉంటున్నాడు. వరుస మ్యాచ్‌ల కారణంగా తీవ్రమైన పనిభారం పెరగడంతో విశ్రాంతి తీసుకోవాలని ఆయన నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని తన క్లబ్ అల్ నస్రీ యాజమాన్యానికి స్పష్టం చేసినట్లు సమాచారం. యాజమాన్యం నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా, రొనాల్డో తన నిర్ణయానికే కట్టుబడినట్లు సమాచారం.రొనాల్డో రాకపోయినా, అల్ నస్రీ జట్టు మాత్రం షెడ్యూల్ ప్రకారమే భారత్‌కు విచ్చేసింది. 28 మంది సభ్యులతో కూడిన ఈ బృందం గోవాకు చేరుకుంది. బుధవారం స్థానిక నెహ్రూ స్టేడియంలో గోవా ఎఫ్‌సీతో అల్ నస్రీ తలపడుతుంది.ఏఎఫ్‌సీ ఛాంపియన్స్ లీగ్ 2025–26 సీజన్ డ్రాలో అల్ నస్రీ, ఎఫ్‌సీ గోవా జట్లు రెండూ గ్రూప్ 'డి'లో చోటు దక్కించుకోవడంతో రొనాల్డో భారత్‌కు రావడం ఖాయమని అందరూ భావించారు. సౌదీ ప్రో లీగ్‌లో మూడో స్థానంలో నిలిచిన అల్ నస్రీ ఈ టోర్నీకి అర్హత సాధించగా, ఇండియన్ సూపర్ లీగ్‌లో సత్తా చాటిన ఎఫ్‌సీ గోవా ఈ ప్రతిష్ఠాత్మక లీగ్‌లో ఆడే అవకాశాన్ని సొంతం చేసుకుంది.ఈ లీగ్‌లో రొనాల్డో లేకుండానే అల్ నస్రీ గత రెండు మ్యాచ్‌లలో విజయం సాధించడం గమనార్హం. అయినప్పటికీ, తమ అభిమాన ఆటగాడిని ప్రత్యక్షంగా చూసే అవకాశం చేజారిపోవడంతో భారత ఫుట్‌బాల్ ప్రియులు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు

# క్రీడా వాయిస్

## సెమీస్ రేసులో భారత్ ఉత్కంఠ!



ఐసీసీ మహిళల ప్రపంచకప్‌లో సెమీఫైనల్ బెర్త్ కోసం భారత జట్టు చివరి ఘట్టంలో ఉత్కంఠభరితమైన పోరును ఎదుర్కొంటోంది. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా జట్లు ఇప్పటికే సెమీస్‌లో తమ స్థానాలను ఖరారు చేసుకోగా, మిగిలిన ఒకే ఒక్క బెర్త్ కోసం భారత్ మరియు న్యూజిలాండ్ జట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ప్రస్తుతం ఈ రెండు జట్లు చెరో నాలుగు పాయింట్లతో సమానంగా ఉన్నప్పటికీ, మెరుగైన నెట్ రన్ రేట్ కారణంగా భారత్ పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో ఉంది. ఈ క్లిష్ట సమయంలో, హర్మన్‌ప్రీత్ కౌర్ సేన రాబోయే రెండు లీగ్ మ్యాచ్‌లలో కచ్చితమైన ప్రదర్శన ఇవ్వాల్సిన అనివార్యత ఏర్పడింది. టీమిండియాకు సెమీస్ చేరుకోవడానికి అత్యంత సులువైన మార్గం ఏమిటంటే, మిగిలిన రెండు మ్యాచ్‌లలో (న్యూజిలాండ్ మరియు బంగ్లాదేశ్) తప్పనిసరిగా గెలవాలి. ఈ రెండు విజయాలు నేరుగా సెమీఫైనల్‌కు దారి తీస్తాయి. అయితే, ఒకవేళ కీలకమైన న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో భారత్ ఓడిపోతే, సెమీస్ ఆశలు మరింత సంక్లిష్టం అవుతాయి. అప్పుడు భారత్ తన చివరి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై గెలవడంతో పాటు, న్యూజిలాండ్ తన తరువాతి మ్యాచ్‌లో ఇంగ్లండ్ చేతిలో ఓడిపోవాలి. ఈ పరిస్థితిలో, పాయింట్లలో సమానమైనా మెరుగైన నెట్ రన్ రేట్ ఆధారంగా భారత్ సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. అయితే, ఇక్కడ పరిస్థితి మరింత క్లిష్టంగా మారవచ్చు. ఒకవేళ భారత్ న్యూజిలాండ్‌పై ఓడిపోయి, ఆ తర్వాత న్యూజిలాండ్ కూడా ఇంగ్లండ్‌పై గెలవగలిగితే, అప్పుడు భారత్ ప్రపంచకప్ ప్రయాణం ముగిసినట్లే. అందుకే, రాబోయే మ్యాచులు హర్మన్ సేనకు కేవలం గెలుపు కోసమే కాకుండా, పెద్ద తేడాతో విజయాలు సాధించి నెట్ రన్ రేట్‌ను కాపాడుకోవడానికి కూడా చాలా కీలకం. ముఖ్యంగా, న్యూజిలాండ్‌తో జరిగే 'డూ ఆర్ డై' మ్యాచ్‌పై యావత్ భారత క్రీడాభిమానుల దృష్టి నెలకొంది. భారత జట్టు తమ సెమీస్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే తమ సొంత ప్రదర్శనపైనే దృష్టి పెట్టాలి.



## దీపావళి వేళ క్యూట్ ఫోటోలు వైరల్

టాలీవుడ్ ఇండస్ట్రీలో హీరోయిన్ సమంత గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. అక్కినేని నాగచైతన్యకు విడాకులు ఇచ్చిన తర్వాత సమంత బ్రాండ్ మరింత పెరిగింది.మొదట్లో అనారోగ్యంతో బాధపడిన సమంత, ఆ తర్వాత ఆ క్రమక్రమంగా కోలుకుంది. అదే సమయంలో తన కెరీర్ పై ప్రత్యేక దృష్టి పెట్టి సక్సెస్ అవుతోంది సమంత. హీరోయిన్ గానే కాకుండా నిర్మాతగా కూడా ప్రస్తుతం హీరోయిన్ సమంత దూసుకు వెళ్తున్నారు. అటు వ్యాపారాలు కూడా లాభాల్లో దూసుకు వెళ్తున్నాయి. చేతినిండా సంపాదిస్తున్న సమంత తాజాగా దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. ఇటీవల హీరోయిన్ సమంత కొత్త ఇంటిని కొనుగోలు చేసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో తన కొత్త ఇంట్లోనే తాజాగా దీపావళి చేసుకున్నారట సమంత. అయితే ఈ వేడుకల్లో రాజ్ నిడిమోరు కూడా పాల్గొన్నారు. దీంతో సమంత దీపావళి వేడుకల ఫోటోలు సోషల్ మీడియాను దున్నేస్తున్నాయి. రాజ్ నిడిమోరుతో హీరోయిన్ సమంత రిలేషన్ పెట్టుకుందని గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. అతన్నే హీరోయిన్ సమంత త్వరలో రెండో పెళ్లి చేసుకోబోతున్నట్లు కూడా వార్తలు వైరల్ చేశారు. అయితే దీనిపై ఇప్పటి వరకు ఈ ఇద్దరు ఎక్కడా కూడా స్పందించలేదు. కానీ సమంత ఎక్కడ ఉంటే అక్కడే రాజ్ నిడిమోరు కనిపిస్తున్న నేపథ్యంలో రూమర్స్ వైరల్ అవుతున్నాయి. ఇక లేటేస్ట్ గా దీపావళి వేడుకలు కూడా సమంతతో రాజ్ నిడిమోరు చేసుకున్నాడు.

## తరుణ భాస్కర్‌తో ఈషా రెబ్బ దీపావళి వేడుకలు



తెలుగు అమ్మాయి ఈషా రెబ్బ గురించి తెలియని వారు ఉండరు. 2012 సంవత్సరంలో లైఫ్ ఈజ్ బ్యూటీ ఫుల్ సినిమాతో మెరిసిన ఈ అందాల తార పలు సినిమాల్లో హీరోయిన్ గా కూడా ఛాన్స్ కొట్టేసింది.పెద్ద హీరోయిన్ గా పేరు సక్సెస్ కాలేకపోతున్న ఈశా రెబ్బ, చిన్న పాత్రలు వచ్చినా చేస్తోంది. మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్, అరవింద సమేత వీర రాఘవ లాంటి సినిమాలలో సైడ్ హీరోయిన్ పాత్రలు చేసి మెప్పించింది. అయితే అలాంటి ఈషా రెబ్బ ఈ మధ్యకాలంలో పిట్టకథలు, 3రోజెస్ లాంటి వెబ్ సిరీస్ లో కూడా నటించింది. ఇది ఇలా ఉండగా తాజాగా ఈషా రెబ్బ గురించి ఓ సంచలన విషయం బయటకు వచ్చింది. దీపావళి సందర్భంగా దర్శకుడు తరుణ్ భాస్కర్ తో ఈషా రెబ్బ మెరిశారు. దీపావళి టపాకాయలు పేల్చుతూ సందడి చేశారు. విశ్వక్ సేన్ ఇంట్లో ఈ దీపావళి వేడుకలు జరిగినట్లు తెలుస్తోంది. దీంతో విశ్వక్ సేన్ ఇంటికి తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బ కలిసి వెళ్లారు. దీంతో వీళ్లిద్దరూ క్లోజ్ గా కనిపించిన ఫోటోలు వైరల్ గా మారాయి. ఈ నేపథ్యంలోనే తరుణ్, ఈషా రెబ్బ మధ్య రిలేషన్ ఉందని సోషల్ మీడియాలో జోరుగా చర్చ జరుగుతోంది. అయితే ఇందులో ఏమాత్రం వాస్తవం లేదని మరికొందరు అంటున్నారు. తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో ఈషా రెబ్బ త్వరలో కొత్త సినిమా చేయబోతున్నారని, అందుకే అతనితో వెళ్ళినట్లు చెబుతున్నారు.

## బ్రేకప్‌పై రష్మిక రియాక్షన్!



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రష్మిక మందాన గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. కన్నడ నుంచి తెలుగులో అడుగుపెట్టిన ఈ బ్యూటీ స్టార్ హీరోయిన్ గా ఎదిగారు.ముఖ్యంగా పుష్ప, యానిమల్ సినిమాలు చేసిన తర్వాత రష్మిక స్టార్ డం మొత్తం మారిపోయింది. ఇప్పుడు బాలీవుడ్ లోనే వరుసగా సినిమాలు చేస్తోంది ఈ అందాల తార రష్మిక. ప్రస్తుతం ది గర్ల్ ఫ్రెండ్ సినిమా ( %ఏష్త్రవ +అతీశ్రీటతీఱవఅఎ%) ప్రమోషన్స్ లో హీరోయిన్ రష్మిక కూడా పాల్గొంటున్నారు. ఈ సినిమా నవంబర్ 7వ తేదీన రిలీజ్ కానుంది. రాహుల్ రవీంద్రన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. రష్మికకు జోడిగా దీక్షిత్ శెట్టి మెరుస్తున్నారు. అయితే ఈ సినిమా గురించి పలు విషయాలు పంచుకున్న రష్మిక.. రిలేషన్ షిప్ బ్రేకప్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ప్రేమలో బ్రేకప్ అయితే, అబ్బాయిల కంటే ఎక్కువగా అమ్మాయిలు బాధపడతారని ఆమె పేర్కొన్నారు. ఇది తన పర్సనల్ అభిప్రాయం అంటూ ఎమోషనల్ అయ్యారు. బ్రేకప్ విషయంలో అమ్మాయిలతో పోలిస్తే అబ్బాయిలు బాధపడతారని ప్రచారం చేస్తున్నారు.. కానీ అందులో చాలా తప్పు ఉందని ఆమె పేర్కొన్నారు. ఆ విషయాన్ని ఖండిస్తున్నట్లు వెల్లడించారు. బాధను వ్యక్తపరిచేందుకు తాము గడ్డం పెంచలేము అని, మందు తాగలేమని ఆమె సెటైర్లు కూడా పేల్చారు. లోలోపల అమ్మాయిలకే బాధ ఎక్కువగా ఉంటుందన్నారు. కానీ ఆ బాధ బయటకు చూపించబోరని తెలిపారు. లవ్ ఫెల్యూర్ అయితే, గుండె పగిలిపోతుందంటూ పేర్కొన్నారు. దీంతో రష్మిక చేసిన వ్యాఖ్యలు వైరల్ గా మారాయి. కాగా విజయ్ దేవరకొండ, రష్మిక ఇద్దరు ఎంగేజ్మెంట్ చేసుకున్నట్లు మొన్న దసరా నుంచి వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే.

## థ్రిల్ చేసే 'ది బ్లాక్ గోల్డ్'



కథానాయిక సంయుక్త తొలిసారి ఓ ఫిమేల్ సెంట్రిక్ ఫిల్మ్‌లో నటిస్తున్నారు. యోగేష్ కెఎంసి దర్శకత్వం వహిస్తున్నారు. ఇంటెన్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని 'సామజవరగమన, ఊరు పేరు భైరవకోన' వంటి విజయ వంతమైన చిత్రాలు అందించిన నిర్మాత రాజేష్ దండా నిర్మిస్తున్నారు. హాస్య మూవీస్, మాగంటి పిక్చర్స్‌తో కలిసి చేస్తున్న ఆరవ సినిమా ఇది. సంయుక్త స్వయంగా ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. సింధు మాగంటి సహ నిర్మాత. ఆదివారం మేకర్స్ ఈ సినిమా టైటిల్‌ని అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి 'ది బ్లాక్ గోల్డ్' అనే ఇంట్రెస్టింగ్ టైటిల్ ఫిక్స్ చేశారు. టైటిల్ పోస్టర్ అదిరిపోయింది. దీపావళి సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్ నేడు (సోమవారం) విడుదల కానుంది. దర్శకుడు యోగేష్ కెఎంసి థ్రిల్లర్ జానర్‌కి కొత్త కాన్సెప్ట్‌ను పరిచయం చేస్తూ ప్రేక్షకులకు థ్రిల్ చేయబోతున్నారు. సంయుక్త డైనమిక్ పాత్రలో కనిపించనుంది. ఈ చిత్రంలో ఆమె అద్భుతమైన స్టంట్స్ చేస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రానికి డీవోపీ: ఎ.వసంత్, సంగీతం: సామ్ సిఎస్, ఎడిటర్: ఛోటా కె ప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్: సాహి సురేష్, కథ- డైలాగ్స్: యోగేష్, ప్రసాద్ నాయుడు, స్క్రిప్ట్ కో-ఆర్డినేటర్: మధు విప్పర్తి, యాక్షన్: రామకృష్ణ, సాహిత్యం: రామజోగయ్య శాస్త్రి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిరణ్ పోపూరి.

## జాక్ టైంలో ఇది జరిగింది!



చిన్న చిన్న పాత్రలతో మొదలుపెట్టి.. ఆ తర్వాత హీరోగా మారి.. స్టార్ ఇమేజ్ సంపాదంచిన నటుడు సిద్ధు కరోనా టైంలో ఓటీటీలో రిలీజైన కృష్ణ అండ్ హిజ్ లీల అతడికి ఫస్ట్ బ్రేక్ ఇవ్వగా.. డీజే టిల్లు, టిల్లు స్క్వేర్ చిత్రాలు బ్లాక్‌బస్టర్లయి తన రేంజ్ పెంచాయి. కానీ టిల్లు స్క్వేర్ తర్వాత వచ్చిన జాక్ మాత్రం పెద్ద డిజాస్టర్ అయి సిద్ధును తీవ్ర నిరాశకు గురి చేసింది. ఆ సినిమా మిగిల్చిన నష్టాల గురించి ఇండస్ట్రీలో పెద్ద చర్చే జరిగింది. టిల్లు స్క్వేర్ వసూళ్లలో పదో వంతు కూడా ఈ సినిమాకు రాకపోవడం.. భారీ బడ్జెట్ సినిమాలను మించి దీనికి నష్టాలు రావడం గురించి చాలా రోజులు ఇండస్ట్రీలో మాట్లాడుకున్నారు. సిద్ధును పరోక్షంగా టార్గెట్ చేస్తూ ఒక నిర్మాత ప్రెస్ మీట్లో చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయి. దీని గురించి తాజాగా కొందరు జర్నలిస్టులతో కలిసి పాల్గొన్న ఒక ఇంటర్వ్యూలో సిద్ధు స్పందించాడు. జాక్ సినిమా విషయంలో తనను కావాలనే టార్గెట్ చేశారని సిద్ధు అభిప్రాయపడ్డాడు. పనిగట్టుకుని తనను సెంటర్ చేసి నిందించే ప్రయత్నం జరిగిందని అతనన్నాడు. ఆ సమయంలో తాను బాధ పడ్డట్లు అతను చెప్పాడు. జాక్ సినిమా ఫెయిలయ్యాక తనను నిర్మాతలేమీ డబ్బులు అడగలేదని.. కానీ తనే ముందుకొచ్చి పారితోషకంలో కొంత భాగాన్ని (దాదాపు నాలుగన్నర కోట్లని వార్తలు వచ్చాయి) వెనక్కిచ్చినట్లు అతను వెల్లడించాడు. తాను ప్రశాంతంగా పడుకోవాలంటే ఆ డబ్బులు వెనక్కి ఇవ్వాలి అనిపించి ఇచ్చినట్లు అతను చెప్పాడు. ఎవరైనా స్టేజ్ మీద, ఇంటర్వ్యూల్లో కాన్ఫిడెంట్‌గా మాట్లాడితే జనం తట్టుకోలేరని.. ఇలా చేస్తే యారొగెన్స్ అంటారని.. ఎప్పుడూ చేతులు కట్టుకుని, వినమ్రంగా ఉండాలని కోరుకుంటారని అతనన్నాడు. తాను స్క్రిప్ట్ రాయగలనని చెప్పినా అది కూడా యారొగెన్స్ లాగా చూస్తారని సిద్ధు ఆశ్చర్యపోయాడు. తాను రాసిన స్క్రిప్ట్ సక్సెస్ అవుతుందా లేదా అన్నది వేరే విషయమని.. కానీ ఒక సీన్ రాయడం, దాన్ని తెరపై ప్రెజెంట్ చేయడం తనకు తెలుసని అతనన్నాడు. కానీ ఇలాంటివి చెబితే చాలామంది తట్టుకోలేరని సిద్ధు వ్యాఖ్యానించాడు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com